ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 08.01.2026 | సంపుటి : 12 సంచిక : 170 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







## పురపోరుకు
# ఈసీ కసరత్తు
## మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం



- 16 నాటికి ఓటర్ల తుది జాబితా
- ఈ మేరకు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ రాణికుముదిని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ గడువును రాష్ట్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ నెల 13 నాటికి పోలింగ్‌స్టేషన్ల వివరాల ముసాయిదా ప్రచురించాలని ఎస్ఈసీ ఆదేశించారు. ఈ నెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకంపై చర్చించారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన ఈసీ.. గురువారం రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో సమావేశం కానుంది. తెలంగాణలో రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీ పాలకవర్గాలకు




ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.



హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

## పేదవాడికి భద్రత, భరోసా, ధైర్యం..
# ఇందిరమ్మ ఇళ్లు

- అర్హులందరికీ అందిస్తాం
- దేశంలో ఏ రాష్ట్రమూ చేపట్టని విధంగా నిర్మిస్తున్నాం
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి


హుజూర్‌నగర్, (జనంసాక్షి):అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి లు అన్నారు. పేదవాడికి పూర్తి భద్రత, భరోసా, ధైర్యాన్ని ఇచ్చే కార్యక్రమమే ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమమని, ఈ ఏప్రిల్ లో మరో విడత, రానున్న 2 సంవత్సరాలలో 2 విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. బుధవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో గృహ నిర్మాణాలను వారు తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు కొల్లగొడితే ఆ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి విడతన 22500 కోట్ల రూపాయలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున 4 లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని తెలిపారు. రాజకీయాల కతీతంగా కులం, మతం, వర్గం పేరు అడగకుండా అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలు వెచ్చించి ఇండ్లు కట్టిస్తున్నామని, ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇటీవల అసెంబ్లీలో తమ ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీ ఎమ్మెల్యేలు కూడా మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు మిగతా 2లో..

# నదీ జలాలపై రాజకీయాలు చేయొద్దు

- గోదావరి నదిలో పుష్కలంగా నీరుంది
- పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదు
- తెలంగాణ నేతలను కోరిన ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి(జనంసాక్షి):గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని, పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సముద్రంలో కలిసే నీళ్లు ఎవరైనా వాడుకోవచ్చని తెలిపారు. నదీ జలాలపై రాజకీయాలు చేయవద్దని తెలంగాణను కోరుతున్నానని అన్నారు. దేవాదుల, కల్వకుర్తి తానే ప్రారంభించానని ఆర్డీఎస్‌లో నీళ్లు రాకుంటే జూరాల నుంచి నీళ్లు తెచ్చి మహబూబ్‌నగర్‌కు ఇచ్చామని వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో వారానికి ఒకసారి నీరు వచ్చేవని, సాగర్ నుంచి నీళ్లు తెచ్చి హైదరాబాద్‌కు ఇచ్చామని అన్నారు.

మిగతా 2లో..




## తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల
# ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్



హైదరాబాద్(జనంసాక్షి): తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు మిగతా 2లో..

## ఐ బొమ్మ రవికి
# చుక్కెదురు

**ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు**

హైదరాబాద్(జనంసాక్షి): పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ మిగతా 2లో..

# ఆ మంత్రులు అవినీతిపరులు

**420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది**
**పంచాయతీల్లో 40 % సర్పంచ్‌లను గెలుచుకున్నాం: కేటీఆర్**



ఖమ్మం(జనంసాక్షి): ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు 30శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఖమ్మం నిర్వహించిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో జరిగిన సర్పంచి ఎన్నికల్లో.. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం సర్పంచ్‌లను బీఆర్ఎస్ గెలుచుకుందన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్పించే పనిలో ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2లో..

# బీఆర్ఎస్ ఆరోపణలు పరాకాష్టకు చేరాయి

**ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఫైర్**



హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఫైరయ్యారు. జనగామలో కేటీఆర్ మితిమీరి, మతితప్పి బలుపు ఎక్కి మాట్లాడుతుండని మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి మాట్లాడితే తోడకలు తీస్తామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓడిపోయి కేటీఆర్ పరువు పోయిందని, సర్పంచ్ ఎన్నికల్లో అడ్రస్ గల్లంతు అయిందని, అయినా కేటీఆర్ కు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. 'శాసనసభ కాదు బూతుల సభ అని కేటీఆర్ అంటుండు అంటుండు. వ్యక్తి మీద ఉన్న అసూయ, ద్వేషంతో శాసన సభ వ్యవస్థను అగౌర పరుస్తుండు. కేటీఆర్‌కు శాసన సభాధిపతి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలి' అని సంపత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



# ఫోన్ ట్యాపింగ్‌పై వేగం పెంచిన సిట్

**సీఎం రేవంత్ సోదరుడు కొండల్‌రెడ్డికి నోటీసులు**
**మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ..**

హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. విపక్ష నేతగా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించింది. కొండల్‌రెడ్డితోపాటు పలువురు నేతలకూ నోటీసులు ఇచ్చినట్లు మిగతా 2లో..


# రాష్ట్రంలో కొత్త పార్టీలకు మనుగడ కష్టమే



**మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి): కవిత వచ్చి విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని.. ఆమె మిగతా 2లో..

# చికిత్స కంటే నివారణే మార్గం



- వీధికుక్కల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు
- శునకాలవేనా .. కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా?
- కుక్క దగ్గరకు వచ్చేంత వరకు అది కరుస్తుందో లేదో చెప్పలేం
- దేశవ్యాప్తంగా వీధిశునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలి
- అధికారులను ఆదేశించిన ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి):వీధి కుక్కల వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే..ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు? వాటివి ప్రాణాలు కావా" అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్ని అవి దగ్గరకు వచ్చేంతవరకు తెలుసుకోలేమని వ్యాఖ్యానించింది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. రోడ్లు, పాఠశాలల వద్ద కుక్కల వల్ల ప్రమాదాలు జరగడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రదేశాల్లో కుక్కలు కరుస్తోన్న ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు

మిగతా 2లో..



## గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి
# ట్రంప్ ఎత్తుగడలు



- లాటిన్ అమెరికా దేశాల్లో గందరగోళం
- వెనిజువెలాపై దాడి చమురు కోసమేనని ప్రచారం
- గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగంగా మారాల్సిందే
- అది మా జాతీయ భద్రతకు అవసరం
- ఆ దేశంపై నియంత్రణకు మా వద్ద అనేక ఆప్షన్‌లు
- వాటిలో సైనిక చర్యను పరిశీలిస్తున్నాం
- వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ వెల్లడి


వాషింగ్టన్(జనంసాక్షి):వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్భంధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన ఎంపికలపై అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం చర్చిస్తోందని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. లక్ష్యాన్ని సాధించేందుకు 'మిలటరీ'ని ప్రయోగించడాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను అడ్డుకునేందుకు గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అమెరికా జాతీయ భద్రతా ప్రాధాన్యతగా ట్రంప్ భావిస్తున్నారని జాతీయ మీడియా ప్రశ్నలకు ప్రతిస్పందనగా వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునే మార్గాల గురించి ఓవల్ కార్యాలయంలో చర్చలు కొనసాగుతున్నాయని సలహాదారులు వివిధ మార్గాలపై చర్చిస్తున్నారని అమెరికా సీనియర్ అధికారి తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా నాటో నేతలు చేసిన ప్రకటనలపై ట్రంప్ భయపడటం లేదని అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కొనుగోలు చేయడం లేదా ఆ భూభాగంతో స్వేచ్ఛా అనుబంధ ఒప్పందం (సిఒఎఫ్ఎ) ఏర్పరుచుకోవడం కూడా ఉందని పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ఒక అధికారి తెలిపారు. సిఒఎఫ్ఐ ఒప్పందం గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో భాగం చేయాలనే ట్రంప్ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని అన్నారు. మిగతా 2లో..

## వంట చేయడం లేదన్న కారణంతో
# విడాకులు ఇవ్వలేం

**హైకోర్టు**

హైదరాబాద్(జనంసాక్షి): భార్య, భర్త.. ఇద్దరూ ఉద్యోగులుగా ఉన్నపుడు వంట చేయకపోవడం, తల్లికి సహకరించలేదన్న కారణాన్ని క్రూరత్వంగా పరిగణించి.. విడాకులు మంజూరు చేయడం కుదరదని హైకోర్టు తేల్చి

మిగతా 2లో..





# ఫిబ్రవరి1నే బడ్జెట్

## ఆ రోజు ఆదివారమైనా కేంద్రం ముందుకే..

- 28 నుంచే పార్లమెంట్ .. రెండువిడతల్లో సమావేశాలు
- 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి..
- మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో విడత

న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సారథ్యంలోని పార్లమెంటు వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే తేదీలపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ బడ్జెట్ సమావేశాలు రెండు విడతల్లో జరగనున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. తొలి విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల మిగతా 9లో..

# హైదరాబాద్‌లో డ్రగ్స్ పార్టీ

**దొరికిపోయిన ఏఆర్ కానిస్టేబుల్**

**మైనర్లతో పాక్ గూఢచర్య నెట్‌వర్క్..**
# వెలుగులోకి కీలక విషయాలు

# రూ.15 లక్షల కోట్లు..
- రష్యా నుంచి భారత్‌కు.. చమురు దిగుమతి
- ఐరోపా సంస్థ వెల్లడి

# రూ.50 కోట్ల జిఎస్టీ ఎగవేత
- ఆరెంజ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అరెస్ట్..
- ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ఎంపి చేతన్ కూడా అదుపులోకి..

# ఉచిత సలహాలు ఇవ్వడం మాని..
**మీ దేశాల్లో శాంతిభద్రతలు సరిచూసుకోండి: జైశంకర్**

వివరాలు 2వ పేజీలో..

జనంసాక్షి www.janamsakshi.org
గురువారం 08.01.2026

## చికిత్స కంటే నివారణే మార్గం

చేయాలని అధికారులను ఆదేశించింది. దీనిపై న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజ్ చేయడం, షెల్టర్లు నిర్మించడం వంటి పద్ధతులతో వీధి కుక్కల సమస్య తగ్గుతోందని తెలిపారు. అయితే భారత్‌లో ఈ పద్ధతులను సరైన విధంగా పాటించకపోవడం, వీధుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో వీటి బెడద తీవ్రమవుతోందన్నారు. జంతు సంక్షేమ ఎన్‌జీవోల తరఫున హాజరైన న్యాయవాది కాలిన్ గోన్సాల్వ్స్ వాదిస్తూ.. దేశంలో కుక్కకాట్ల సంఖ్యను ఉన్నదానికంటే ఐదు రెట్లు ఎక్కువగా ప్రభుత్వ నివేదికలు చూపుతున్నాయని ఆరోపించారు. కుక్క కాటు ఇంజెక్షన్‌ల సంఖ్యను కూడా సరైన విధంగా లెక్కించట్లేదన్నారు. 2021 నుంచి 19 రాష్ట్రాల్లో రేబిస్ కేసులు లేవన్నారు.

## వంట చేయడంలేదన్న కారణంతో విడాకులు ఇవ్వలేం

చెప్పింది. భార్య కారణంగా హింసకు గురవుతున్నానని, వివాహాన్ని రద్దు చేయాలంటూ హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కింది కోర్టు కొట్టివేయడంతో హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ నగేశ్ భీమపాకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరిస్తూ అప్పీలును కొట్టివేసింది. భర్త మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 10 వరకు ఆఫీసు విధుల్లో ఉండగా, భార్య ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగం లో ఉంటుందని, ఇలాంటప్పుడు ఉదయం వంట చేయలేదన్న కారణాన్ని క్రూరత్వంగా పరిగణించలేమంది. తనభార్య తరచూ పుట్టింటికి వెళుతోందని, తమతో కలిసి ఉండటంలేదన్న దానిపై వివాహమై ఏడాది 9 నెలలు కాగా, అందులో తనతో కలిసి ఉన్నది 5 నెలలని ఒకసారి, 3 నెలలని మరోసారి భిన్నంగా భర్త వాంగ్మూలం ఇచ్చారంది. పెళ్లయిన తరువాత గర్భస్రావం కావడంతో తల్లిదండ్రుల వద్ద ఉండటాన్ని క్రూరత్వంగా పరిగణించలేమంది. వేరు కాపురం పెట్టాలన్నది క్రూరత్వం కిందికి వస్తుందని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ.. అది ఆయా కేసుల్లోని వాస్తవాల ఆధారంగా వర్తిస్తుందని తెలిపింది. ప్రస్తుత కేసులో వేరుకాపురం ప్రతిపాదన భార్య చేయలేదని.. ఆమె తరఫు న్యాయవాది అలా సలహా ఇచ్చారని, అందువల్ల దాన్ని క్రూరత్వంగా పరిగణించలేమంది. భర్త చేసిన ఆరోపణలను క్రూరత్వంగా పరిగణించి విడాకులు మంజూరు చేయలేమంటూ అప్పీలును కొట్టివేసింది.

## రాష్ట్రంలో కొత్త పార్టీలకు మనుగడ కష్టమే..

విషయంలోనూ అదే జరిగిందన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు."రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదు. జనాభా ప్రాతిపదికన జరిగిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదు" అని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ పార్టీ..

**హైదరాబాద్(జనంసాక్షి):** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ సోదాలు నిర్వహించింది. కొండాపూర్ మసీద్‌బండ సమీపంలో ఉన్న కోవే స్టేస్‌లో కొందరు వ్యక్తులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలియడంతో ఈగల్ టీమ్ ఆకస్మిక దాడి చేసింది. సోదాల సమయంలో.. అక్కడ మద్యం సేవిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించగా.. ఏడుగురిలో ఐదుగురికి గంజాయి పాజిటివ్ వచ్చింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఉండటం గమనార్హం

## ఉచిత సలహాలు ఇవ్వడం మాని..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

## రూ.50 కోట్ల జీఎస్టీ పన్ను ఎగవేత

**హైదరాబాద్(జనంసాక్షి):**జీఎస్టీ పన్ను ఎగవేత కేసులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ హైదరాబాద్ జోనల్ యూనిట్ దాడులను మరింత ముమ్మరం చేసింది. డేటా అనలిటిక్స్, అంతర-ఏజెన్సీ సమన్వయంతో సేకరించిన ప్రత్యేక సమాచారంతో, భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్రాష్ట్ర పన్ను మోసాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డ ఇద్దరు ప్రముఖ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లను డీజీజీఐ అధికారులు అరెస్టు చేశారు. జనవరి 6న జరిగిన ఈ అరెస్టులు పన్ను మోసాల తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. మెసర్స్ ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రయాణికుల నుంచి వసూలు చేసిన రూ.28.24 కోట్ల జీఎస్టీని గడువు ముగిసిన మూడు నెలలు గడిచినా ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా అక్రమంగా దాచుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. అదే విధంగా, మెసర్స్ ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతన్ ఎన్ రూ.22 కోట్ల మేర నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసానికి సూత్రధారిగా వ్యవహరించినట్టు డీజీజీఐ గుర్తించింది. ఈ ఇద్దరిపై సీజీఎస్టీ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. సంఘటితంగా జరుగుతున్న పన్ను మోసాలపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని డీజీజీఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు చట్టాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలని, జీఎస్టీ ఎగవేతకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని డీజీజీఐ హెచ్చరించింది.

## రూ.15 లక్షల కోట్లు..

### రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే అప్పటినుంచి 144 బిలియన్ యూరోల (రూ.15 లక్షల కోట్ల విలువైన) క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంది. దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది. ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడించింది. అలాగే ఫిబ్రవరి, 2022 (యుద్ధం మొదలైన ఏడాది) నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా వేసింది. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో చైనా తర్వాత మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది.

## పేదవాడికి భద్రత, భరోసా, ధైర్యం..
# ఇందిరమ్మ ఇళ్లు

చేయాలని కోరుతున్నారని,అలాగే గతంలో గృహ జ్యోతి కింద మంజూరు చేసిన ఇండ్లను పూర్తి చేయాలని ఇతర పార్టీ ల ఎం ఎల్ ఏ ఏ లు కోరారని, వాటిని కూడా మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం కడితే కమిషన్ వస్తుందని ఆలోచించింది తప్ప పేదవాడికి ఇండ్లు కట్టించలేదన్నారు. అంతేకాక గృహ నిర్మాణ శాఖను అస్తవ్యస్తం చేసిందని అన్నారు. హుజూర్ నగర్ లో చేపట్టిన 2160 ఇందిరమ్మ హౌసింగ్ కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. హుజూర్ నగర్ రామస్వామి గుట్ట లో చేపట్టిన ఇల్లన్నింటిని ఈ మార్చి 31 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశం ఇచ్చామని, గృహ నిర్మాణ పాలసీ ప్రకారం బహు పేదల నుండి ఇండ్లకు దరఖాస్తులను తీసుకొని మార్చి 31 లోపు వారికి ఇల్లు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. సంక్రాంతి లోపు లేదా ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులను గుర్తించి తుది జాబితా రూపొందించాలని చెప్పారు. హుజూర్ నగర్ లోని బడుగు, బలహీన వర్గాల పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని తెలిపారు. అంతకు ముందు హుజూర్ నగర్ ఇందిరమ్మ ఇండ్ల కాలనీ లో ఇండ్ల నిర్మాణాల పై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, గృహనిర్మాణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ తో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మార్చి 31 నాటికి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి మిగిలిపోయిన పనులన్నింటిని గుర్తించి పనుల పూర్తికి ప్రతిపాదనలు పంపించాలని, గృహ నిర్మాణాలతో పాటు, రోడ్లు, విద్యుత్, తాగునీరు, వంటి మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. హుజూర్నగర్ కాలనీ పూర్తికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు పురోగతిని పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మిగిలిపోయిన పనుల పూర్తికి అవసరమైన అంచనాలను రూపొందించి పంపిస్తే ఈ నెల 15లోగా అనుమతులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. అవసరమైతే పనులను విభజించి పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 2012లో తాను గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్ నగర్ హౌసింగ్ కాలనీ ని మంజూరు చేయించడం జరిగిందని, ప్రభుత్వ భూమి లేకపోయినప్పటికీ, దేవాదాయ శాఖ భూమి సుమారు 115 ఎకరాలను సేకరించి ప్రభుత్వానికి నిధులు చెల్లించి పనులు ప్రారంభించామని, గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10 సంవత్సరాలలో పూర్తిగా పనులు నిలిపివేసిందని, తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన, ప్రాధాన్య పథకాల కింద గృహ నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. హుజూర్ నగర్ ఇందిరమ్మ ఇండ్ల కాలనీ తెలంగాణలోనే కాకుండా దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా నిరుపేదలకు మోడల్ హౌసింగ్ కాలనీగా నిలుస్తుందని తెలిపారు. హుజూర్ నగర్ ఇందిరమ్మ కాలనీలో ఇళ్లకు మెరిట్ ఆధారంగా వెంటనే దరఖాస్తులను తీసుకోవాలని, నిరుపేదలు, ఇండ్లు లేని వారు,నూటికి నూరు శాతం అర్హత ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చేలా ఇందిరమ్మ ఇండ్ల నియమ, నిబంధనల ప్రకారం దరఖాస్థులు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో ఇండ్ల నిర్మాణంతో పాటు, ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో ఇండ్ల నిర్మాణంతో పాటు, పాఠశాల ,అంగన్వాడి, హెల్త్ సెంటర్ ,కమ్యూనిటీ హాల్, ప్లే గ్రౌండ్ వంటి మౌలిక సదుపాయాలన్ని కల్పిస్తామని తెలిపారు. హుజూర్ నగర్ హౌసింగ్ కాలనీ పూర్తికి ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్ కు పూర్తి సహకారం అందిస్తామని , నాణ్యతతో పనులు పూర్తి చేయాలని మంత్రి అన్నారు. రాష్ట్రంలో సన్న బియ్యంతో పాటు, ఇందిరమ్మండ్లకు మంచి పేరు ఉందని అన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ త్వరలోనే సూర్యాపేట జిల్లా హుజూర్ గర్ నియోజకవర్గం మఠంపల్లి కి రానున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు మంత్రులు రామస్వామి గుట్ట ఇందిరమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను , సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సెక్రెటరీ గౌతం , జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి సిద్దార్థ్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నదీ జలాలపై రాజకీయాలు చేయొద్దు

తాము చేసిన పనుల వల్ల హైదరాబాద్ అన్నింటికీ అనుకూలంగా ఉందని, ప్రస్తుతం దేశంలోనే అత్యంత జీవన అనుకూల నగరంగా హైదరాబాద్ మారిందని స్పష్టం చేశారు. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని, అలాంటిది పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదని చెప్పారు. మిగిలిన నీళ్లు ఎవరైనా వాడుకోవచ్చని పోటీపడి మాట్లాడటం సరికాదని, అక్కడి ప్రజలు కూడా ఆలోచించాలని సూచించారు.పోలవరం గ్యాప్-1లో పనులన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయని చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్యాప్-2లో అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరంలో చంద్రబాబు బుధవారం పర్యటించారు. ఈ క్రమంలో పోలవరం నిర్మాణ పనుల పురోగతిని సీఎం పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్?తో పాటు కాఫర్ డ్యామ్, బట్రస్ డ్యామ్ పనులపై ఆరా తీశారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి వివరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పట్టిసీమ రాకుండా వైఎస్సార్సీపీ నేతలు విశ్వప్రయత్నాలు చేశారని అప్పుడు పట్టిసీమ నిర్మించకుంటే ఇవాళ రాయలసీమకు నీళ్లు వెళ్లేవి కాదని అన్నారు. రైట్ కనెక్టివిటీలో 19 మీటర్లు వెడల్పు, ఎత్తుతో 2 టన్నెళ్లు వస్తాయని వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు అనేక విశిష్ట లక్షణాలు ఉన్నాయని తెలిపారు. విశాఖకు నీరు తీసుకెళ్లే కాలువను బాగా వెడల్పు చేశామని, పోలవరం నీటితో అనకాపల్లి, విశాఖ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు ఏపీకి వరం - జీవనాడని కొనియాడారు. "నీటి విషయంలో రాజకీయాలు చేయవద్దని తెలంగాణను కోరుతున్నా. రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడటం సరికాదు. అక్కడి ప్రజలు కూడా ఆలోచించాలి. తెలుగు జాతి ఒక్కటే.. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. ఇద్దరి మధ్య విరోధాలు పెరిగి ఆనందించే పరిస్థితి రాకూడదు. భావోద్వేగాలతో ఆటలు ఆడటం మంచిది కాదు. ప్రజల కోసం రాజకీయాలు చేస్తే మంచిదే. ఆర్టీఎస్‌లో నీళ్లు రాకుంటే జూరాల నుంచి నీళ్లు తెచ్చి మహబూబ్‌నగర్‌కు ఇచ్చాం. దేవాదుల, కల్వకుర్తి నేనే ప్రారంభించా. దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి.. ఎవరు వద్దన్నారు?."- నారా చంద్రబాబు నాయుడు, ఏపీ సీఎం పట్టిసీమ ఎత్తిపోతలను ఏడాది వ్యవధిలో పూర్తి చేశామని ఈ పట్టిసీమ వల్ల కృష్ణా డెల్టాలో సమయానికి పంటలు వేయగలిగామని ఏపీ సీఎం అన్నారు. శ్రీశైలంలో నీళ్లు పొదు పు చేసి రాయలసీమకు నీరివ్వగలిగామని అలానే రాయలసీమలో గొల్లపల్లి కట్టి కియా మోటార్స్ తెచ్చామని చెప్పారు. పండ్లతోటలు ఎక్కువ పండుతున్న రాష్టంగా మనం మారామని హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ప్రతి సోమవారం రోజు పోలవరంపై సమీక్ష చేశనని అన్నారు.మంత్రి లోకేశ్ స్పందించారు. "సముద్రంలో కలిసే వేల టీఎంసీలు కాపాడి రాయలసీమకు తీసుకెళ్తే తప్పేంటి? తెలంగాణ ప్రాజెక్టులకు మేం ఎక్కడా చిల్లు పెట్టలేదు. మిగిలిన నీళ్లను తెలంగాణ వాడుకోవచ్చు, చెన్నైకు ఇవ్వొచ్చు. గతంలో పట్టిసీమ దండగని జగన్ అన్నారు. దాన్నే ఐదేళ్లు వాడుకున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది" అని అన్నారు.

## ఆ మంత్రులు అవినీతిపరులు

ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమం జరిగింది. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్ సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు.ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమిషన్‌లకు కక్కుర్తిపడి ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ఆ



ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమిషన్‌లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు.అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవే తలు, కూల్చివేతలు, పేల్చివేతలేని, కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## ఐ బొమ్మ రవికి చుక్కెదురు

స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై బుధవారం నాడు నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

### తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్

సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

### ఫోన్ ట్యాపింగ్‌పై వేగం పెంచిన సిట్

సమాచారం.ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకు సిట్ నోటీసులు జారీ చేసింది. జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యను గురువారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదే కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్‌రావుకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం ఒంటిగంటకు విచారణకు రావాలని నోటీసులు ఇవ్వగా.. కొండలరావు, సందీప్ రావు హాజరు కాలేదు. అనారోగ్యం వల్ల సిట్ కార్యాలయానికి రాలేకపోతున్నట్లు కొండల్‌రావు సిట్‌కు తెలిపారు. తన నివాసంలోనే విచారణకు సిద్ధమని కొండలరావుకు తెలిపినట్లు సమాచారం. కొండలరావు, సందీప్ రావు ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తించారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చింది. నేడు విచారణకు హాజరుకావాలని పేర్కొంది. కొండలరావు, సందీప్ ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. వివరాల నమోదుకు జూబ్లీహిల్స్‌లోని కార్యాలయానికి రావాలని నోటీసుల్లో పేర్కొంది.

## గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి
# ట్రంప్ ఎత్తుగడలు

వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అనంతరం గ్రీన్‌ల్యాండ్‌పై సుమారు రెండు నెలల్లో నిర్ణయం ప్రకటిస్తానని ట్రంప్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.వెనిజువెలాపై దాడి నేపథ్యంలో లాటిన్ అమెరికా దేశాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన నెలకొల్పే చర్యగా వర్ణించి జనాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. వెనిజులాలో జరిగిన దుర్మార్గానికి అమెరికా, ఐరోపా, ఇతర అమెరికా అనుకూల దేశాల్లోని మీడియా అమెరికా చెప్పిన కట్టుకతలనే వల్లిస్తున్నాయి. వెనిజువెలాలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన మరియా కొరీనా మచాడోకు నోబెల్ బహుమతి వచ్చాక, అమెరికా ఇప్పుడు ఆమెతో చిలుక పలుకులు పలికిస్తున్నది. పశ్చిమ దేశాల మీడియాకు అవే వేదవాక్కులుగా చెబుతున్నది. వెనిజులా మాదక ద్రవ్యాల కేంద్రంగా ఉన్నట్లు అమెరికా సంస్థలు గత కొంతకాలంగా పాటపాడుతున్నాయి. డ్రగ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డిఇఎ) తాజా నివేదికలో కూడా పేర్కొన్నది. అయితే ఐరాస వంద పేజీల నివేదికలో ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. అయినా సరే పశ్చిమ దేశాల మీడియాకు అవేవీ పట్టలేదు. మదురో నియంత అంటూ కథనాలు అందిస్తున్నాయి. నోబెల్ పురస్కారం అందుకున్న మచాడో ఎప్పటి నుంచో అక్కడ పోరాటం చేస్తున్నారు. దీనిని మాత్రమే సాకుగా చూపుతున్నారు. ఒకవేళ అదే నిజం అయితే అక్కడి పౌరులకే స్వేచ్ఛను ఎంచుకునే అవకాశం ఇవ్వాలి. మచాడో నాయకత్వాన్ని సమర్థించి ఉంటే ట్రంప్ పరపతి పెరిగేది. గత పాతిక సంవత్సరాలుగా వెనిజులా కొరకరాని కొయ్యగా తయారైంది. క్యూబా చమురు అవసరాలు తీరుస్తున్నది, పెద్ద మొత్తంలో చైనాకు సరఫరా చేస్తున్నది, ఒక్క వీటికే కాదు, ఎవరు వస్తే వారికి విక్రయిస్తున్నది. మన దేశం 2024లో 140 కోట్ల డాలర్ల మేర చమురు దిగుమతి చేసుకుంది. ట్రంప్ బెదిరించటంతో 2025లో 81 శాతం తగ్గించింది. ఏతావాతా చూస్తే అక్కడి చమురు నిక్షేపాలను తన గుప్పిట పెట్టుకునే ఎత్తుగడతోనే ట్రంప్ దాడికి తెగించాడు. నిజానికి ప్రపంచం మొత్తానికి సరఫరా చేయగలిగేంత నిల్వలు వెనిజెవెలాలో ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని, వ్యాపారం చేసివుంటే వెనిజులా గల్ఫ్ దేశాలను మించి ఆర్థికంగా ఎదిగేది. అయితే అక్కడి కమ్యూనిస్టులు దీనిని అడ్డుకోవడంతో దుర్భర పరిస్తితి ఏర్పడింది. ప్రజలు వసలపోయే వరకు వచ్చింది. చావెజ్ వచ్చాక ఈ దుస్థితి ఏర్పడింది. భద్రతా మండలిలో ఒక శాశ్వత రాజ్యంగా ఉండి మరో సర్వసత్తాక దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిందంటే ఐరాస ఉండీ లేనట్లే. తాను భాగస్వామిగా ఉండి నెలకొల్పిన అనేక సంస్థలు అనివార్యమై తనకే అడ్డుపడు తుండటంతో క్రమంగా అమెరికా వాటిని దెబ్బతీస్తున్నది. వెనిజులాను ఆక్రమించటం ప్రపంచ బలహీనతకు చిహ్నంగా చూడాలి. రష్యాను శాసించలేదని ఉక్రెయిన్ సంక్షోభం వెల్లడించింది. చైనా మిలిటరీ రీత్యా కూడా బలపడుతున్నది. ఈ రెండూ కలసి వాషింగ్టన్‌ను సవాలు చేస్తున్నాయి. మెరికా ఎత్తుగడల గురించి రకరకాల అభిప్రాయాలు వెలువడుతున్నాయి. మదురోను పట్టుకోవటం కాదని, అసలు లక్ష్యం చైనా అన్నది వాటిలో ఒకటి. చైనాను దెబ్బ తీసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, చిప్స్ అందకుండా ఇప్పటికే ఒక వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ప్రపంచంలో చమురు దిగుమతి చేసుకొనే దేశాలలో చైనా అగ్రస్థానంలో ఉంది. వెనిజులా ఒక ప్రధాన సరఫరాదారు, అక్కడ చైనా పెట్టుబడులు కూడా ఉన్నాయి. అక్కడి చమురును స్వాధీనం చేసుకుంటే చైనాకు సరఫరా నిలిపివేయవచ్చు. మరో ప్రధాన సరఫరాదారు ఇరాన్ మీద కూడా మిలిటరీ చర్య ద్వారా దాన్ని ఆక్రమించుకొనేందుకు అమెరికా చూస్తున్నది. ఇదే సమయంలో మరో ప్రధాన వనరుగా ఉన్న రష్యాను కూడా చైనా నుంచి దూరం చేయాలనే ఎత్తుగడ ఉంది. దానిలో భాగంగానే ఉక్రెయిన్‌లో కోరిన ప్రాంతాలను అప్పగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు ట్రంప్ తీరుతెన్నులు ఉన్నాయి. అమెరికా చెలగాటం తమకు ప్రాణగండంగా ఐరోపా భావిస్తే ప్రపంచ రాజకీయాలే మరో మలుపు తిరుగుతాయి. మొత్తం మీద చెప్పాలంటే చైనాకు చమురు దొరక్కుండా చేయాలనే ఎత్తుగడలో అమెరికా ఉందని, వెనిజెలాపై దాడితో స్పష్టం అవుతోంది. భారత్ మీద తాను ఆగ్రహంగా ఉన్నట్లు వారికి తెలుసని ఈ సందర్భంగా ట్రంప్ చేసిన ప్రకటన నరేంద్ర మోడీని మరింతగా ఇరకాటంలోకి నెట్టింది. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపివేయించానని పదే పదే చెప్పిన ట్రంప్ వాణిజ్య ఒప్పందం గురించి ఇంకా పట్టుబడుతూనే ఉన్నాడు. ఒకవైపు పాకిస్తాన్, మరో వైపు నుంచి బంగ్లాదేశ్‌ను మన మీదకు ఉసిగొల్పుతున్నాడు. అమెరికా ఒక దేశాధ్యక్షుడిని పదవి నుంచి కూల్చివేయటం నికోలస్ మదురోతోనే ప్రారంభం కాలేదు. ఇదే ఆఖరిదీ కాబోదు. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు మన ముందున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో అస్థిర పరిస్థితి రోజు రోజుకూ పెరుగుతున్నట్లుగా ఉంది. ఉక్రెయిన్, పాలస్తీనాలోని గాజా, వెస్ట్ బ్యాంక్, కాంగో, సూడాన్‌లో దాడులు, అంతర్యుద్ధాలు, రష్యా, ఇరాన్, వెనిజులా లపై ఆంక్షలు, ఐరాస ప్రసంగాల వేదికగా మారి చేష్టలుడిగి చూస్తున్నదిగా మారటం, సోవియట్‌తో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత అమెరికా అనేక దేశాల మీద దాడులకు పూనుకోవటం, సిరియా, లిబియాల్లో జోక్యం, గాజాలో ఇజ్రాయిల్ మారణకాండకు మద్దతు, ఇరాన్‌పై దాడి, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో పరాభవం. మొత్తం మీద ప్రపంచంలో విలువైన వనరులను చేజిక్కించుకొనేందుకు అడ్డగోలు చర్యలకు పాల్పడుతున్న అమెరికా తీరు ఇటీవలి కాలంలో మరింతగా ప్రపంచానికి తేటతెల్లమైంది.

పరిశీలనలో సైనిక ఆప్షన్: వైట్‌హౌస్

గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగంగా మారాల్సిందేనని, అది తమ జాతీయ భద్రతకు అవసరమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం పునరుద్ఘాటించింది. దానిపై నియంత్రణ సాధించేందుకు తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని, వాటిల్లో సైన్యాన్ని వాడే అంశం కూడా పరిశీలనలో ఉందని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మకంగా కీలకమైందని, ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణ అవసరమని అధ్యక్షుడు భావిస్తున్నారన్నారు. ఆ లక్ష్యం దిశగా ముందుకువెళ్లడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలించాలని తన బృందానికి సూచించారని చెప్పారు. వెనెజువెలా నేత నికోలస్ మదురోను సైనిక ఆపరేషన్ ద్వారా అమెరికా కస్టడీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి గ్రీన్‌లాండ్ పేరు వార్తల్లో వినిపిస్తోంది. ఇంకో 20 రోజుల్లో మాట్లాడదామంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేయడం, గతంలో ఆయన ప్రభుత్వంలో పనిచేసిన కేటీ మిల్లర్ 'త్వరలో' అనే పోస్టు పెట్టడం కలకలం రేపుతున్నాయి. దీంతో ఈ ద్వీపాన్ని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఐరోపా దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. వ్యూహాత్మక, ఖనిజాలతో నిండి ఉన్న ఈ ఆర్కిటిక్ ద్వీపంపై హక్కు అక్కడి ప్రజలకే ఉంటుందని మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే.

## మైనర్లతో పాక్ గూఢచర్య నెట్‌వర్క్..

### వెలుగులోకి కీలక విషయాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్‌ఐ కోసం గూఢచర్యం చేస్తున్న 15 ఏళ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పలు కీలక విషయాలు వెల్లడించారు. భారత్‌కు చెందిన మైనర్లతో గూఢచర్యం నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి ఐఎస్‌ఐ ఏజెంట్లు కుట్ర పన్నినట్లు గుర్తించామన్నారు. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్, పంజాబ్, హరియాణాకు చెందిన పలువురు మైనర్లను ట్రాప్ చేసి, ఉగ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా వారు ప్రేరేపిస్తున్నారని తెలిపారు.ఇప్పటివరకు హరియాణా, పంజాబ్‌కు చెందిన 12 మంది, జమ్మూకశ్మీర్‌కు చెందిన 25 మంది మైనర్లను ఐఎస్‌ఐ ఏజెంట్లు ట్రాప్ చేసినట్లు గుర్తించామన్నారు. వారి కదలికలపై దర్యాప్తు బృందాలు నిఘా పెట్టినట్లు తెలిపారు. వీరంతా 14 నుంచి 17 ఏళ్లలోపు వారేనన్నారు. మొదట పాక్ హ్యాండ్లర్లు మైనర్ల ఫోన్‌లకు లింక్‌లు పంపిస్తున్నారని.. వాటిని క్లిక్ చేయగానే వారి ఫోన్‌లను క్లోన్ చేస్తున్నారని పేర్కొన్నారు. వారి ఫోన్లు క్లోన్ చేసి ఉండడంతో బాలురు తమ ఫోన్‌లలో సేవ్ చేసే కంటెంట్‌ను వారి ప్రమేయం లేకుండానే హ్యాండ్లర్లు సేకరిస్తున్నారన్నారు.ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న బాలుడి ఫోన్‌ను స్కాన్ చేయగా అతడు పాక్‌కు చెందిన ఐఎస్‌ఐ ఆధారిత ఏజెన్సీలు, ఉగ్రవాద గ్రూపుల నిర్వాహకులతో పలుమార్లు సంప్రదింపులు జరిపినట్లు తేలిందన్నారు. వారి సూచనల ఆధారంగా అతడు సైనిక స్థావరాల వీడియోలను చిత్రీకరిస్తున్నట్లు, భద్రతా కాన్వాయ్‌ల కదలికలను లీక్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఐఎస్‌ఐ ఏజెంట్లతో సంప్రదింపుల కోసం అతడు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ప్రమాదకర ముఠాల చేతిలో పడకుండా పిల్లలను రక్షించాలంటే.. తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

## కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన మోడీ సర్కారు

- టిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఖలీల్
- చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో లేబర్ కోడ్లు నిర్వీర్యమవుతున్న కార్మిక చట్టాలు, మహిళలపై దోపిడీపై సదస్సు



మహబూబ్‌నగర్ (జనంసాక్షి) : కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ సర్కారు నిర్వీర్యం చేసిందని అన్నారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీ వర్ధంతి సభ చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, రాష్ట్ర కో-కన్వీనర్లు శ్రీదేవి, రాధ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని టీఎన్జీవో హాల్‌లో మాట్లాడారు. టిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ 'లేబర్ కోడ్లు నిర్వీర్యం అవుతున్న కార్మిక చట్టాలు మహిళలపై శ్రమ దోపిడీ' గురించి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం 29 చట్టాలని కలిపి నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చారని ఉన్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేశారని అన్నారు. మొదటగా వచ్చిన ప్రసూతి చట్టం 1961 మహిళలకు ఇచ్చిన సెలవులను తీసివేశారని, సమాన పనికి సమాన వేతనం ఎప్పుడో అమలులో లేకుండా పోయిందని, సమ్మె చేసే హక్కు ప్రస్తుతం లేదని అన్నారు. ప్రస్తుతం మారిన చట్టాలలో 50 మంది మహిళలు పనిచేస్తుంటే అక్కడ ఒక క్రష్ ఉండాలి కానీ ప్రస్తుతం 200 పైగా మహిళలు ఉంటేనే క్రష్ పెట్టాలన్న మార్పు జరిగింది. ఉన్న చట్టాలు అమలు కాని పరిస్థితిలో వీటిని నిర్వీర్యాన్ని ప్రశ్నిస్తూ పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చాడు. తర్వాత వక్త జిల్లా డిటిఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి సృజన పర్యావరణ- మహిళలపై ప్రభావం అనే అంశంపై మాట్లాడారు. కొంతమంది ప్రయోజనాలకు గనులను తవ్వుతున్నారు. 250 కోట్ల ముందు ఏర్పడిన ఆరావలి పర్వతాలను తవ్వి అక్కడ మైనింగ్ చేస్తున్నారన్నారు. ఉద్యమాలకు నాయకత్వం వహించి పోరాడాల్సిన అవసరం మహిళలకు ఉందని, అడవులను రక్షస్తున్న ఆదివాసులను నిర్మూలిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొని వస్తున్న కగార్ కు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపునిస్తూ ముగించారు.

వికారాబాద్ జిల్లా కార్యదర్శి అలివేలు మత్తు పదార్థాల వల్ల మహిళలపై జరుగుతున్న ఆగాయిత్యాలు అనే అంశంపై మాట్లాడారు. 90 వ దశ కంలో జరిగిన సారా వ్యతిరేక పోరాటంలో ఎంతో మంది మహిళలు పాల్గొని ఉధృతం చేసి సారా నిషేధాన్ని సాధించుకున్నారన్నారు. మహిళలంతా ఏకమై ఈ మత్తు పదార్థాలు,మద్యాన్ని కి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గద్వాల్ జిల్లా అధ్యక్షురాలు రేవతి పోలీస్‌స్టేషన్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్న అంశంపై మాట్లాడారు. శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు రెండవ తరగతి పౌరు లుగా ఉన్నారని, దీని నిర్మూలించి మనం ధైర్యంగా మన సమస్యలన్నీ సంఘంగా ఆధ్వర్యంలో పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సభలో చాలామంది మహిళలు మాట్లాడారని అదే చరిత్ర అని అన్నారు.

## తెలంగాణ సమగ్రాభివృద్ధికి జాగృతి బ్లూప్రింట్

- పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం - సంపూర్ణ అధ్యయనం సహా అన్ని కీలక అంశాలపై స్టడీ
- రాజకీయ పార్టీల రాజ్యాంగాల అధ్యయనానికి ప్రత్యేక కమిటీ
- ఈనెల 17న జాగృతి స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వనున్న కమిటీలు
- కమిటీల నివేదిక ఆధారంగా ప్రజాక్షేత్రంలోకి జాగృతి వెళ్లేలా నిర్ణయం



హైదరాబాద్ (జనంసాక్షి) : రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వికాసానికి, చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు, వివిధ వర్గాల ప్రజల సంక్షమానికి కృషి చేస్తోన్న తెలంగాణ జాగృతి రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అడుగులు వేయనున్నది. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం బ్లూ ప్రింట్ రూపొందించడంలో నిమగ్నమయ్యింది. జాగృతి జనంబాటలో భాగంగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తోన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారికి ఉద్యమకారులు, వివిధ వర్గాల ప్రజల నుంచి తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వం అవసరమని సూచనలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రస్ఫుటింపజేసేలా రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తానని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్వీయ రాజకీయ శక్తిగా నిలుస్తామని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గం మంగళవారం (ఈనెల 6న) సమావేశం అయి భవిష్యత్ కార్యాచరణపై చర్చించింది. ప్రజాస్వామిక పద్ధతిలో అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తూ కమిటీలు ఏర్పాటు చేసి వాటి నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జాగృతి ముఖ్య నాయకులు బుధవారం సమావేశమై "పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం ఉ సంపూర్ణ అధ్యయనం" సహా 30 కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని, రాష్టంలోని వివిధ రాజకీయ పార్టీల రాజ్యాంగాలను స్టడీ చేసి జాగృతికి ప్రజాస్వామ్యబద్ధమైన, పటిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించడానికి న్యాయ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఎడ్యుకేషన్, హెల్త్, ఎంప్లాయిమెంట్, రైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ సాధికారత, కార్మిక, సింగరేణి, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, లిటరేచర్, హిస్టరీ ఉ హెరిటేజ్, ఎంప్లాయీస్, టీచర్స్, మహిళా సాధికారత, శిశు సంక్షమం, యూత్ ఎంపవర్మెంట్, ఆన్ లైన్ కంటెంట్, ఉద్యమకారుల సంక్షమం, ఇరిగేషన్, బడ్జెట్ ఎనాలిసిస్, మైనార్టీల సాధికారత, వలస (గల్ఫ్) కార్మికుల సంక్షమం, స్టూడెంట్స్, రెవెన్యూ రిఫార్మ్స్ విభాగాల్లో విద్యావంతులు, నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను నియమించారు. ప్రతి కమిటీలో విధిగా విద్యావంతులైన మహిళా నాయకులకు అవకాశం ఇచ్చారు. కమిటీల బాధ్యులు రానున్న పది రోజుల పాటు వారికి అప్పగించిన రంగాల్లో రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసి నివేదిక రూపొందిస్తారు. తమ నివేదికలను ఈనెల 17వ తేదీన జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ అధ్యక్షతన నియమించిన స్టీరింగ్ కమిటీకి సమర్పిస్తారు. స్టీరింగ్ కమిటీ నివేదికపై జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గం మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై అందరి అభిప్రాయలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకుంటుంది.

### తెలంగాణ జాగృతి ఎజెండా కమిటీ సభ్యులతో కల్వకుంట్ల కవిత జూమ్ కాన్ఫరెన్స్

తెలంగాణ సమగ్రాభివృద్ధికి జాగృతి రూపొందించబోయే రూట్ మ్యాప్ సిద్ధం చేయనున్న ఎజెండా కమిటీ సభ్యులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు బుధవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ ప్రాంతాన్ని పరిపాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు, అన్ని పార్టీల రాజ్యాంగాల అధ్యయనం.. అత్యంత ప్రజాస్వామ్యయుతమైన రాజ్యాంగం రూపొందించడం, నీళ్లు - నిధులు - నియామకాలు సహా 32 అంశాల అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు వేశామన్నారు. కమిటీ సభ్యులు క్షత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఈనెల 17వ తేదీ వరకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని సూచించారు. స్టీరింగ్ కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు

## డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ విచారణ

- అన్ని వేళ్లూ ఒకేవైపు చూపిస్తున్నా చర్యలేవీ
- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ పారిపోయింది
- బిజెపి మాత్రమే సమర్థ విపక్షంగా పనిచేసింది
- మెదక్ ఎంపి రఘునందన్ రావు



మెదక్, జనవరి7 (జనంసాక్షి) : ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ డైలీ సీరియల్‌లా సాగుతోందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మెదక్‌లో రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు డైలీ సీరియల్‌లా సాగుతోందని వ్యంగ్యంగా అన్నారు. కొండను తవ్వి ఎలుకను ఈ సిట్ పడుతుందో లేదో అంటూ సందేహం వ్యక్తం చేశారు. డేటాను సర్వీస్ ప్రొవైడర్ల వద్ద తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. నేడు కొండల్ రెడ్డి, రేపు ఆయన డ్రైవర్ ఇలా ఎన్నాళ్లు అంటూ? సిట్ వ్యవహారశైలిపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. కర్త, కర్మ అన్ని ఒకరివైపే వేలు చూపిస్తున్నాయని.. కానీ ఆయనను పిలిచేందుకు భయపడుతున్నారంటూ రఘునందన్ పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తతంగమంతా ఎన్నికల కోసం పిలుస్తున్నట్లుగా ఉందన్నారు. ÷ూఎ÷ు కాస్తా అఎ÷ు(కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్)లా మారిందంటూ ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫస్ట్ బాధితుడిని తానేనని గుర్తు చేశారు. మొక్కుబడిగా ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిం దంటూ రాష్ట్ర ప్రభుత్వంపై రఘునందన్ రావు మండిపడ్డారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి.. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. నీటి అంశాలపై చర్చకు పాలక పక్షం మీనమేషాలు లెక్కిస్తే.. బీఆర్ఎస్ పార్టీ భయపడి పారిపోయిందని పేర్కొన్నారు. తమ సంఖ్య తక్కువ ఉన్నా గట్టిగా పోరాడి.. పాలక పక్షాన్ని బీజేపీ నిలదీసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపి శాసనసభా పక్ష నేత మహేశ్వర రెడ్డిని అభినందిస్తున్నానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుంటే.. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సభలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలమూరు జిల్లా మీద, కృష్ణా జలాల మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఇదంటూ అధికార పార్టీ సభ్యులపై నిప్పులు చెరిగారు. కొంతమంది తమ పార్టీ నుంచి వలసపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆలోచించుకోవాలంటూ వలస నేతలకు ఈ సందర్భంగా ఆయన కీలక సూచన చేశారు. యెన్నెం శ్రీనివాస రెడ్డి కూడా తమ పార్టీ నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. ఆలోచించుకోవాలంటూ ఆయనకు హితవు పలికారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లపై పోరాడేది.. ప్రజల పక్షాన ఉండేది బీజేపీ మాత్రమేనని ఎంపీ స్పష్టం చేశారు. తమ పార్టీలో కొత్త పాత అనేది ఏమీలేదని కుండబద్ధలు కొట్టారాయన. కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపిస్తే.. దేశంలో 6202వ పార్టీ అవుతుందన్నారు. ఎవరు కొత్త పార్టీ పెట్టిన తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఒక నటుడు సినిమాకు టికెట్ల ధర పెంచి మరో నటుడికి పెంచకపోతే అది పక్షపాతం అవుతుందన్నారు. అందరికీ ఒకటే రూల్ ఉండాలి.. అన్ని సినిమాలకు ఒకటే రూల్ ఉండాలని రఘునందన్ తెలిపారు.



## ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు మహా సామూహిక కార్యక్రమ ఆహ్వాన పత్రిక అందజేత

హైదరాబాద్ (జనంసాక్షి) : నాగోల్ లోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసానికి శైవక్షత్ర పీఠాధిపతులు, హిందూ ధర్మ పరిరక్షకులు, భారతధర్మ దేవత, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శివస్వామిజీ వచ్చి ధర్మో రక్షతి రక్షతః ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా సామూహిక కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు కార్యక్రమ విశేషాలను వివరిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. గత సంవత్సరాలుగా వేలాదిమందికి ఆధ్యాత్మిక సేవలు, అన్నదాన కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, 2026 ఫిబ్రవరి 22న లక్షలాది భక్తులతో ఘనంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చి, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మశిరోమణి అవార్డు గ్రహీత వినితా శక్తి ఇంటర్నేషల్ నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ పరివార్ మహిళా విభాగ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హైమ ,విశ్వనాథుని కోటేశ్వరరావు ధర్మశిరోమణి అవార్డు గ్రహీత, ఎల్వీ కుమార్, కటకం శ్రీనివాస్, రమేశ్, సాయి రాం , ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.ట్రస్ట్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## కెపిహెచ్‌బి వెంకటేశ్వరాలయంలో భారీ చోరీ

- బంగారు, వెండి ఆభరణాలు దోచుకున్న దొంగలు



హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) : కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధి సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన దొంగలు 15 తులాల వెండి, 3 తులాల బంగారు ఆభరణాలు.. వెండి, పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. బుధవారం తెల్లవారుజామున రోజువారీ పూజల కోసం ఆలయాన్ని తెరిచిన పూజారులు చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. నిందితులు ఆలయంలోకి ప్రవేశించి చోరీ చేసిన దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. ఫుటేజీని పరిశీలించిన పోలీసులు.. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- 'బాకీ కార్డుల'ను ఆవిష్కరించిన శ్రీనివాసగౌడ్



మహబూబ్‌నగర్, జనవరి 7 (జనంసాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ 'బాకీ కార్డుల'ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విఫలమైనదని ఆరోపించారు. మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్కూటీలు, రైతులకు రైతు భరోసా సహాయం మరియు రుణమాఫీ చేయకుండా ప్రజలకు బాకీ పడిందన్నారు. ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. ఈ బాకీలు ఎప్పుడూ చెల్లిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పాలమూరుకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదు?

- పాలమూరు రంగారెడ్డి నిర్మాణంపై ప్రశ్నించని బీఆర్ఎస్ నాయకులు నేడు యాత్ర చేపట్టడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) : పాలమూరు రంగారెడ్డి నిర్మాణం పై నేడు ఆపు సోపాలు పడుతూ యాత్ర నిర్వహిస్తున్న నాయకులు,ఆనాడు ౣసిఆర్ ను పాలమూరు రంగారెడ్డి నిర్మాణం పై ఎందుకు ప్రశ్నించలేదని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి , దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు.కాలేశ్వరం నిర్మాణం పై పెట్టిన శ్రద్ధ పాలమూరు రంగారెడ్డి నిర్మాణం పైన ఎందుకు పెట్టలేదని వారు ప్రశ్నించారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో భాగంగా కర్వేన రిజర్వాయర్ శంకుస్థాపన కార్యక్రమం అనంతరం భూత్పూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పటి సి ఎం కే సి ఆర్ అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తో ప్రాజెక్టు దగ్గర కుర్చీ వేయి ఇక్కడే ఉండి పూర్తి చేసి పోతానని చెప్పి మీ ప్రభుత్వం అధికారం పోయే వరకు ఎందుకు పూర్తి చేయలేక పోయారని విమర్శించారు.బుధవారం జిల్లా కేంద్రం లోని నందిని సులో గల ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తో కలిసి ఆయన మాట్లాడారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో భాగంగా 2023 లో నార్లపూర్ దగ్గర ఒక మోటారు ఆన్ చేసి అక్కడి నుండి చెంబులతో నీళ్లను తెచ్చి ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రతి గుడి దగ్గర జలాభిషేకం కార్యక్రమం ను అప్పటి బి ఆర్ ఎస్ నాయకులు చేసారని నార్లపూర్ లో మోటారు ఆన్ చేసినంక హెలికాప్టర్ లో కే సి ఆర్ ఇంటికి వెళ్లే వరకు మోటార్ బంద్ అయ్యిందన్నారు.అధికారం పోయిన తరువాత రెండు సంవత్సరాలకు నిద్ర లేచిన కే సి ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు, ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి తట్టుకోలేక ఒక ప్రెస్ మీట్ పెట్టి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడి అసెంబ్లీ కి వచ్చి మూడు నిముషాలు ఉండి వెళ్లిపోవడం హాస్యాస్పదమన్నారు.పది సంవత్సరాల కాలంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ను పూర్తి చేయకుండా ఎందుకు పెండింగ్ లో పెట్టారని అధికారం లో ఉన్నప్పుడు అడుగలేక పదవి పోయిన తరువాత ప్రజలు తమను మరిచిపోతారని ఉమ్మడి జిల్లా మంత్రులు, మాజీ ఎమ్మెల్యే లకు పని పాట లేక ప్రాజెక్టు ల పేరుతో విహారయాత్ర చేస్తున్నారని దుయ్యబట్టారు.రూ 27 వేల కోట్లు ఖర్చు పెట్టి పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టు లో తల తోక లేకుండా పనులు చేసారని ఒక ప్రాజెక్టు లో పని పూర్తి కాకముందే ఇంకో ప్రాజెక్టు కు టెండర్లు పిలిచి వారి కమిషన్లు దండుకున్నారన్నారు. రూ 27 వేల కోట్లలో రూ 15 వేల కోట్లు పంపుల కోసం ఖర్చు చేసి కమిషన్లు జేబు నింపుకున్నారని చెప్పారు.మొత్తం 57 వేల కోట్లకు డిపి ఆర్ అనుమతి కోసం పెట్టినప్పుడు రూ 27 వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పనులు పూర్తి అయ్యాయని బి ఆర్ ఎస్ నాయకులు చెబుతున్నారు కదా ఎట్లా పూర్తి అయ్యినట్లు ఆ నాయకులే ప్రజలకు వివరించాలని సూచించారు. ఉమ్మడి పాలమూరు లో ప్రాజెక్టు లను పూర్తి చేసింది కాంగ్రెస్ పార్టీ అని ప్రాజెక్టు ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది గడిచిన 10 ఏండ్ల కాలంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు ల కోసం ఎంత ఖర్చు చేసింది అన్న విషయం పై చర్చ కు సిద్ధమా అని ఎమ్మెల్యేలు సవాలు విసిరారు.ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి సి ఎం రేవంత్ రెడ్డి అని 14 నియోజకవర్గం లలో ప్రతి గ్రామం, పట్టణం అభివృద్ధి చేసే బాధ్యత సి ఎం పై ఉందని అందులో భాగంగానే నేడు గ్రామ గ్రామాన సంక్షమ పథకాలు అమలవుతున్నాయన్నారు. గడిచిన 10 ఏండ్లు కాలంలో ప్రాజెక్టు ల్లో ఎంత ఖర్చు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసామో చర్చకు సిద్ధంగా ఉన్నామని వారు చెప్పారు.సి ఎం రేవంత్ రెడ్డి భూత్పు ర్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాలమూరు కు సంవత్సరానికి రూ 25 వేల కోట్ల చొప్పున లక్ష కోట్లు కేటాయించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారని వారు గుర్తు చేశారు. పాలమూరులోని 14 నియోజకవర్గాల్లో నియోజకవర్గాలకు సాగు, తాగు నీటి తోపాటు అన్ని రంగాలలో అభివృద్ధి పనులు చేసే బాధ్యత సి ఎం తీసుకున్నారని వారు చెప్పారు. కేవలం తాగునీటి కోసం పాలమూరు రంగారెడ్డి నిర్మిస్తున్నామని అనుమతులు పొందిన మీరు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పై మాట్లాడే అర్హత కోల్పోయారని వారు అన్నారు.

### ఇలా వచ్చి అలా వెళ్లారు : ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

రెండు సంవత్సరాలు నిద్ర పోయి సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి నిద్ర లేచి నీళ్ల దోపిడీ అని మాటలు మాట్లాడి అసెంబ్లీ కి వచ్చి తోలు తీస్తా అని కే సి ఆర్ ప్రెస్ మీట్ లో చెప్పి తీరా అసెంబ్లీ కి ఇలా వచ్చి అలా వెళ్లారని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.పాలమూరు జిల్లాలో గతంలో మంత్రులుగా ఎమ్మెల్యే లుగా పని చేసిన వాళ్లు విహారయాత్ర చేసి ఎక్కడో ఒక దగ్గర సమావేశం పెట్టి ఎప్పుడు మాట్లాడని వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారన్నారు. కృష్ణ నీటి, పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టు మీద విశ్లేషణ చేసిండు కాళేశ్వరం మాదిరిగా ఎంక్వయిరీ చేస్తాం అనే వరకు పారిపోయిండు ముందు మామా పారిపోయిండు తరువాత వాళ్లు పారిపోయరన్నారు.కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి అభివృద్ధి పథంలో దూసుకుని పోతున్న విషయం ను చూసి ఓర్వలేక అక్కడ ముఖం లేక పారిపోయి బయటకు వచ్చి ఎం చెబుతున్నారుంటే స్పీకర్ మైక్ కట్ చేస్తున్నారని చెబుతున్నారన్నారు. బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే లు చెబుతున్నారని తాము అధికారం లో ఉన్నప్పుడు ఒక్క రోజు కూడా మైక్ ఇవ్వలేదు కానీ మీ ప్రభుత్వం లో మాత్రం మైక్ ఇచ్చి మాట్లాడిస్తున్నారని చెబుతున్నారని ఆయన వివరించారు.గతం లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రతి పక్షలకు ఏనాడూ మాట్లాడానికి అవకాశం ఇవ్వలేదు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లో మీరు రండి మీ విలువైన సూచనలు ఇవ్వండి అని సి ఎం చెబుతున్నారని ఆయన గుర్తు చేశారు.2003 ఆగస్టు 08 లో కాంగ్రెస్ ప్రభుత్వం జీవో తీసుకుని వచ్చింది పాలమూరు రంగారెడ్డి కు జూరాల ద్వారా 90 టి ఎం సి నీళ్లను మూడు లిఫ్ట్ 22 పంపుల ల ద్వారా 10 లక్షల ఎకరాలకు నీళ్లను ఇవ్వచ్చు అని ఉందని అలా కాకుండా నార్లపూర్ నుండి రంగారెడ్డి వరకు నీళ్లు కేవలం 70 టి ఎం సీలు అని ఆయన వివరించారు.పాలమూరు రంగారెడ్డి కు అన్యాయం చేసిందే బి ఆర్ ఎస్ పార్టీ అని మన నీళ్లు మనకు దక్కాల్సింది పోయి తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత శ్రీ శైలం నుండి 4 టి ఎం సి ల నుండి 11 టి ఎం సి లు ఆంధ్ర కు వెళ్ళుతుంటే పట్టించు కొనిది మీ బి ఆర్ ఎస్ ప్రభుత్వం అని రాయలసీమ ను రత్నాల సీమ చేస్తా అని జగన్ ను కలిసి రోజమ్మ ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిన్నది కే సి ఆర్ కాదా అని అయన ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మదనపురం మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు ప్రశాంత్, వనపర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ వెనుకబాటుకు కారణం ఎవరు?

రాయలసీమ. ఒకప్పుడు తృణధాన్యాల గడ్డి, ఇప్పుడు చీకటి ఎడారిలా మారిన భూభాగం. సాగునీటి కొరత దీని గర్భనాళం. ప్రతి ఎండాకాలం ఒక యుద్ధం. ప్రతి వర్షం ఒక ప్రార్థన. ఈ ప్రాంతం, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యమైన ఓటు బ్యాంకు అయినప్పటికీ, దాని అభివృద్ధి కథనం అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

భౌగోళికంగా వర్షపాతం తక్కువ, ఎడారి స్వభావం ఉన్న ఈ ప్రాంతంలో సాగుకు ప్రాణం కృష్ణా నదీ జలాలు. కానీ ఆ జలాలు చేరుకోవడం కూడా సాధ్యం కాని స్వప్నంగా మిగిలాయి దశాబ్దాలపాటు. రాయలసీమ ప్రజల జీవితాలు హిమాలయాల్లో పుట్టే నదీ నీటికీ, పోలవరంలో నిర్మించిన ప్రాజెక్టులకీ మధ్య జరిగే రాజకీయాలపై ఆధారపడి ఉండిపోయాయి. నీలం సంజీవరెడ్డి నుండి కోట్ల విజయ భాస్కరరెడ్డి, నారా చంద్రబాబు నాయుడు వరకు ఈ ప్రాంతం నుండి అనేక ముఖ్యమంత్రులు వెలువడిన ప్పటికీ, ప్రాంతం మూల సమస్య ఉ సుస్థిరమైన సాగునీటి సరఫరా ఉ పరిష్కారానికి దూరంగానే ఉంది.

గత రెండు దశాబ్దాల్లో రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాలాలు మినహాయింపు. రాజశేఖర రెడ్డి కాలంలో ప్రారంభించబడిన సూర్యాపేట లిఫ్ట్ ఇరిగేషన్ వంటి ప్రాజెక్టులు కొన్ని ప్రగతిని నమూనాగా చూపాయి. వైఎస్ జగన్ రెండవ పరిపాలనలో, 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట అనే పెద్ద ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఇది శ్రీశైలం ప్రాజెక్ట్ నుండి నీటిని ఎత్తి, రాయలసీమలో 9.6 లక్షల ఎకరాలకు పరివర్తనం తీసుకువెళ్లాలనే గొప్ప లక్ష్యం. ఇది కేవలం ఇరిగేషన్ ప్రాజెక్టు కాదు, దశాబ్దాల పాటు వ్యాపించిన కరవు శాపాన్ని తొలగించే మహాయజ్ఞంగా ప్రజలు భావించారు. కానీ రాజకీయాల చంచల స్వభావంలో, ఈ యజ్ఞానికి విఘ్నాలు తప్పలేదు.

ఇక్కడే ప్రశ్నలు మొదలవుతాయి. చంద్రబాబు నాయుడు, తాను పుట్టి పెరిగిన ఈ ప్రాంతానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నవ్యక్తి, రాయలసీమ యొక్క ఈ మూల సమస్యను పరిష్కరించడంలో ఎందుకు గణనీయమైన ముందడుగు వేయలేకపోయాడు? అతని పాలనా కాలాలు (2004-2014 మరియు 2014-2019) రాయలసీమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విషయంలో ప్రత్యేకించి సుస్థిర నీటిపారుదల కోసం ఏ మాత్రం పారదర్శకమైన, అంకితభావం కలిగిన ప్రణాళిక లేకుండా గడిచినట్లు కనిపిస్తుంది. పోరుబండి, గాండికోట, చింతలపల్లి ప్రాజెక్టులు వంటి ప్రణాళికలు ప్రగతి సాధించలేదు లేదా ప్రాధాన్యత పొందలేదు. రాజకీయ విశ్లేషణలు రెండు అంశాలను సూచిస్తాయి. మొదటిది, రాజకీయ ప్రాధాన్యతలు. చంద్రబాబు నాయుడు తన రాజకీయ ఆధారపడిన ప్రాంతం కాపు (కోస్టల్ ఆంధ్ర ప్రదేశ్) పట్ల దృష్టి సారించారనే భావన సామాన్యం. అమరావతి రాజధాని ప్రాజెక్టుపై అత్యధిక శ్రద్ధ మరియు వనరుల కేంద్రీకరణ, రాయలసీమ వంటి ప్రాంతాల పట్ల ఉన్న తక్కువ ప్రాధాన్యతకు సూచికగా చెప్పుకోబడుతుంది. రెండవది, తెలంగాణతో సంబంధాలు. RLIP తెలంగాణలోని శ్రీశైలం నీటి సముపార్జనపై ఆధారపడి ఉండటంతో, తెలంగాణ ప్రభుత్వంతో సహకారం అవసరం. రాజకీయ పరస్పర విశ్వాసం లేమి, పార్టీ లైన్లు అడ్డుపడటం వలన ఈ సహకారం కుదరకపోవడం సహజం. ఇటీవల, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా వ్యక్తపరచబడిన ఆందోళనలు మరియు ఎన్జీటీ సమస్యలు ఈ జటిలతకు నిదర్శనం. కానీ అసలు విషయం రాజకీయాల కంటే లోతుగా ఉంది. ఇది రాజకీయ నాయకత్వం యొక్క దృష్టి మరియు ప్రాధాన్యతలకు సంబంధించినది. వైఎస్ జగన్ లాగా RLIPని కేంద్ర బిందువుగా చేసుకోవడం, లేదా రాజశేఖర రెడ్డి సమయంలో కొన్ని ప్రాజెక్టులకు ప్రోత్సాహం ఇవ్వడం వంటివి, ఆ ప్రాంతం సమస్యను అర్థం చేసుకున్న తర్వాత దానిని పరిష్కరించడానికి ఒక స్పష్టమైన వ్యూహాత్మక దృష్టిని చూపుతాయి. చంద్రబాబు నాయుడు పరిపాలనలో, రాయలసీమ కోసం అటువంటి స్పష్టమైన, దీర్ఘకాలిక వ్యూహం లేదనే భావన బలంగా ఉంది. ఇది ప్రాంతీయ పక్షపాతం కాకపోవచ్చు, కానీ అది ఒక రాజకీయ ప్రాధాన్యతలోని లోపం అని చెప్పాలి.

రాయలసీమ రైతు ఇప్పటికీ బండ్లుబరిసే భూముల్లో నిరాశతో చూస్తున్నాడు. ప్రతి ఎన్నిక సమయంలో నీటి బుగ్గలు వాగ్దానాలు చేస్తాయి, కానీ ఎన్నికల తర్వాత ఆ వాగ్దానాలు ఎండిపోతాయి. చివరకు, రాయలసీమ అభివృద్ధి ప్రశ్న రాజకీయ సంకల్పం పరీక్షగా మారింది. రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్ వంటి నాయకులు ఈ ప్రశ్నకు కొంతవరకు సమాధానం ఇచ్చినట్లు కనిపిస్తే, చంద్రబాబు నాయుడు పాలన రాయలసీమకు స్థిరమైన పరిష్కారాన్ని అందించలేకపోయిందని చరిత్ర నిరూపించింది. రాయలసీమకు కావలసింది రాజకీయాలకు మించిన దీర్ఘకాలిక దృష్టి. కరవు అనేది ప్రకృతి శాపం మాత్రమే కాదు, అది మానవ నిర్మితమైన నిర్లక్ష్యం పరిణామం కూడా. రాయలసీమ సమాజం ఇప్పుడు తనకు మిత్రులు ఎవరు, శత్రువులు ఎవరు అనేది మాత్రమే కాకుండా, తన భవిష్యత్తును ఎవరి చేతుల్లో పెట్టాలి అనే దానిపై ఆలోచిస్తోంది. ఆ ఎంపిక, తదుపరి ఎన్నికల్లో కేవలం ఓటు మాత్రమే కాదు, ఒక ప్రాంతం యొక్క జీవిత పోరాటానికి సంబంధించిన నిర్ణయం అవుతుంది.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారాన్ని సాధిస్తున్న అమెరికా

ప్రపంచానికి ప్రజాస్వామ్యం బోధించే అమెరికా, వాస్తవంలో మాత్రం తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారాన్ని సాధించడంలో ముందుంది. వెనెజువెలా వంటి స్వతంత్ర దేశాలపై సైనిక, రాజకీయ, ఆర్థిక దాడులు చేయడం దానికి నిదర్శనం. ప్రజాస్వామ్య పరిరక్షణ, మానవ హక్కుల రక్షణ అనే నినాదాల వెనుక దాగి ఉన్న అసలు ముఖం తుపాకీనే. ఎన్నికల ద్వారా వచ్చిన ప్రభుత్వాలను అంగీకరించని ధోరణి, సహజ వనరులపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకున్న దేశాలపై బలప్రయోగం చేయడమే అమెరికా అంతర్జాతీయ విధానంగా మారింది. వెనెజువెలా ఘటన తుపాకీ లేకుండా జరగలేదన్నది కేవలం ఆయుధాల వినియోగంలోనే కాదు, చట్టాలు, ఆంక్షలు, అపహరణలు అన్నీ కలిపిన ఒక సంపూర్ణ బలప్రయోగంగా అర్థం చేసుకోవాలి.

2.స్వాతంత్ర్యం అంటే సంవత్సరానికి ఒకసారి జెండాలు ఎగరేయడం, ప్రసంగాలు వినడం, నినాదాలు చేయడం మాత్రమే కాదు. నిజమైన స్వాతంత్ర్యం ఆలోచనలపై ఎవరి ఆజ్ఞలు లేకుండా జీవించగలగడంలో ఉంటుంది. రాజకీయ అధికారాన్ని పొందినా, ఆర్థిక నిర్ణయాలు ఇతరుల చేతుల్లో ఉంటే ఆ స్వాతంత్ర్యం అర్థాంతరమే. జాతీయ గీతం ఆలపించినంత మాత్రాన, రాజ్యాంగ ప్రతిని చేతబట్టి ఫోటోలు దిగినంత మాత్రాన దేశం నిజంగా విముక్తి పొందినట్టుకాదు. స్వతంత్ర దేశంగా పిలుచుకుంటూనే విదేశీ శక్తుల ఆర్థిక ఒత్తిళ్లకు తలవంచితే, విదేశీ విధానాలను వారి ప్రయోజనాలకు అనుగుణంగా మలిస్తే, అది ఆధునిక బానిసత్వానికి మరో రూపమే. ఆయుధాలతో వచ్చే ఆక్రమణలకన్నా, అప్పులు, వాణిజ్య ఒప్పందాలు, కరెన్సీ ఆధిపత్యాల ద్వారా వచ్చే నియంత్రణ మరింత ప్రమాదకరం. ఇవి కనిపించవు, కానీ దేశ నిర్ణయాలను నిశ్శబ్దంగా బంధిస్తాయి.

ప్రజాస్వామ్యం పేరుతో జరిగే జోక్యాలు, మానవ హక్కుల పేరుతో సాగించే యుద్ధాలు, చట్టాల ముసుగులో జరిగే బలప్రయోగాలు ఈ కాలపు కొత్త వలస పాలన రూపాలు. ఇలాంటి పరిస్థితుల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు కేవలం ఆచారాలుగా మిగిలిపోతాయి. ప్రజలు ప్రశ్నించడం మానేసిన రోజే స్వాతంత్ర్యం మౌనంగా మరణిస్తుంది. అందుకే స్వాతంత్ర్యాన్ని జెండా కర్రల ఎత్తుతో కాదు, దేశ నిర్ణయాల స్వేచ్ఛతో కొలవాలి. ఆలోచనా స్వాతంత్ర్యం, ఆర్థిక స్వావలంబన, విదేశీ విధానాల్లో స్వతంత్ర నిర్ణయాలే నిజమైన విముక్తికి కొలమానాలు. ఈ కోణంలో చూస్తే నేటి ప్రపంచ రాజకీయాల్లో జరుగుతున్న సంఘటనలు స్వాతంత్ర్య భావనపై తీవ్రమైన ప్రశ్నలు వేస్తున్నాయి. స్వాతంత్ర్యం అంటే కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదని, ఆలోచనలపై, ఆర్థిక వ్యవస్థపై, విదేశీ విధానాలపై ఇతరుల ఆధిపత్యం లేని స్థితియే నిజమైన విముక్తి అని మహాకవి శ్రీశ్రీ తన రచనల ద్వారా స్పష్టంగా చెప్పారు. బలవంతుడి శక్తి ఎంత మహత్తుగా కనిపించినా, అది చివరికి మానవ గౌరవాన్ని త్రొక్కే సాధనంగానే మారుతుందని ఆయన చేసిన హెచ్చరిక నేటి అంతర్జాతీయ రాజకీయాలకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలాస్ మదురోను అర్థరాత్రి అపహరించి అమెరికాకు తరలించిన ఘటన ఒక దేశంపై జరిగిన చర్యగా మాత్రమే చూడలేం. అది ప్రపంచ సార్వభౌమత్వంపై, అంతర్జాతీయ న్యాయవ్యవస్థపై జరిగిన బహిరంగ దాడి. సామ్రాజ్యవాదం తుపాకీతోనే కాకుండా చట్టాల ముసుగులో కూడా పనిచేస్తుందని శ్రీశ్రీ భావన ఈ ఘటనలో స్పష్టంగా దర్శనమిస్తుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి నినాదాలు వినిపించినా, ఈ చర్యకు అంతర్జాతీయ న్యాయపరంగా 0% చట్టబద్ధత కూడా లేదు.

ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 2(4) ప్రకారం ఏ దేశమైనా మరో దేశంపై బలప్రయోగం చేయడం నిషిద్ధం. స్వీయ రక్షణ లేదా భద్రతా మండలి అనుమతి ఉన్నప్పుడే సైనిక చర్యలకు అవకాశం ఉంటుంది. వెనెజువెలా ఘటనలో ఈ రెండు ప్రమాణాలు 100%గా లేవు. అంతేకాదు, అంతర్జాతీయ న్యాయస్థానం 2002లో ఇచ్చిన 'అరెస్ట్ వారెంట్ కేసు' తీర్పు ప్రకారం, ఒక దేశాధ్యక్షుడికి విదేశీ న్యాయస్థానాల ముందు వ్యక్తిగత రక్షణ ఉంటుంది. ఈ కోణంలో కూడా అమెరికా చర్య పూర్తిగా చట్ట విరుద్ధమే.



వెనెజువెలా ప్రపంచ చమురు నిల్వల్లో సుమారు 17% వాటా కలిగిన దేశం. ప్రపంచ చమురు ఎగుమతుల్లో దాని పాత్ర 8% వరకు చేరగల సామర్థ్యం ఉంది. ఈ చమురును డాలర్‌కు బదులు యువాన్, యూరో, బార్టర్ పద్ధతుల్లో విక్రయించాలన్న విధానం అమెరికా డాలర్ ఆధిపత్యానికి ప్రత్యక్ష సవాలుగా మారింది. ప్రస్తుతం ప్రపంచ విదేశీ మారక లావాదేవీల్లో 58% డాలర్‌లోనే జరుగుతున్నాయి. ఈ వాటా 50% కంటే దిగజారితే అమెరికా ఆర్థిక ప్రభావం కనీసం 20% వరకు తగ్గుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఇలాంటి పరిణామాలు చరిత్రలో పదేపదే పునరావృతమయ్యాయి. 1953లో ఇరాన్‌లో చమురు జాతీయీకరణకు ప్రతిగా ప్రభుత్వం కూల్చబడింది. 1973లో చిలీలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం పడిపోయింది. 2003లో ఇరాక్‌పై దాడి అనంతరం అక్కడి చమురు వాణిజ్యం పూర్తిగా డాలర్‌కే పరిమితమైంది. 2011లో లిబియాలో సైనిక జోక్యం జరిగిన తరువాత ఆ దేశ జీడీపీ 2010లోని స్థాయి నుంచి 2015 నాటికి 40 కంటే దిగజారింది. ఈ పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి కూడా శక్తివంతుల చేతిలో సాధనంగా మారిందన్న విమర్శలు బలపడుతున్నాయి. 193 దేశాలు సభ్యులైనా, నిర్ణయాధికారం కేవలం 5 దేశాల చేతుల్లోనే ఉంది. ఇప్పటివరకు అమెరికా ఒక్కటే సుమారు 80కి పైగా సార్లు వీటోను ఉపయోగించింది. దీని వల్ల అంతర్జాతీయ న్యాయం అనే భావన 100% సమానంగా అమలవుతుందన్న నమ్మకం పూర్తిగా కూలిపోయింది.

భారత్ వంటి దేశాలకు ఇవన్నీ హెచ్చరికలు. ప్రపంచ జీడీపీలో భారత్ వాటా సుమారు 7.5% కాగా, 2030 నాటికి ఇది 10% దాటుతుందన్న అంచనాలున్నాయి. కానీ డాలర్ ఆధారిత చమురు దిగుమతులు ఇంకా 85% వరకు ఉన్నాయి. ఈ ఆధారాన్ని తగ్గించకపోతే రాజకీయ స్వతంత్రత అపూర్ణంగానే మిగులుతుంది. శ్రీశ్రీ భావన ఇక్కడ మరింత ప్రాసంగికం అవుతుంది. ఆయన చెప్పిన స్వాతంత్ర్యం నిశ్శబ్దం కాదు. అది నిరసన. అది తిరుగుబాటు. అది ఆలోచనల తిరుగుబాటు. భయంతో మౌనంగా ఉండటం బానిసత్వమేనని ఆయన హెచ్చరిక ఈ రోజుకీ వర్తిస్తుంది.


చరిత్ర స్పష్టంగా చెబుతోందిఅమెరికా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేదు, అవసరమైతే దానిని ధ్వంసం చేసింది. 1953లో ఇరాన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చింది. 1973లో చిలీలో ప్రజల ఓటుతో వచ్చిన ప్రభుత్వాన్ని రక్తపాతంతో తొలగించింది. 2003లో ఇరాక్‌పై ప్రజాస్వామ్యం పేరుతో దాడి చేసి లక్షలాది పౌరుల ప్రాణాలను బలితీసుకుంది. 2011లో లిబియాను మానవ హక్కుల ముసుగులో ధ్వంసం చేసి, ఒక దేశాన్ని శాశ్వత అరాజకతలోకి నెట్టింది. ప్రపంచంలో జరిగిన సైనిక, రాజకీయ జోక్యాల్లో సుమారు 70%కి పైగా అమెరికా పాత్ర ఉంది. విదేశీ జోక్యాల వల్ల కూలిపోయిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు 40%కు మించాయి. ఇది యాదృచ్ఛికం కాదు, ఇది వ్యవస్థాత్మక ప్రజాస్వామ్య ధ్వంసం.డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తే ఆంక్షలు, సహజ వనరులపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటే అస్థిరత, విదేశీ విధానాల్లో స్వతంత్రత చూపితే ప్రభుత్వ కూల్చివేతుఇదే అమెరికా ప్రజాస్వామ్య నమూనా. ప్రజల ఓటు విలువ 0%కి పడిపోయినప్పుడు ప్రజాస్వామ్యం నినాదంగా మాత్రమే మిగులుతుంది.అందుకే ఈ కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం అంటే శక్తివంతుల జోక్యాలను ప్రశ్నించడం. లేదంటే ప్రపంచం చట్టాల రాజ్యం కాదు, బలవంతుడి రాజ్యంగా మారుతుంది. చరిత్ర స్పష్టంగా చెబుతోందిఅమెరికా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేదు, అవసరమైతే దానిని ధ్వంసం చేసింది. 1953లో ఇరాన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చింది. 1973లో చిలీలో ప్రజల ఓటుతో వచ్చిన ప్రభుత్వాన్ని రక్తపాతంతో తొలగించింది. 2003లో ఇరాక్‌పై ప్రజాస్వామ్యం పేరుతో దాడి చేసి లక్షలాది పౌరుల ప్రాణాలను బలితీసుకుంది. 2011లో లిబియాను మానవ హక్కుల ముసుగులో ధ్వంసం చేసి, ఒక దేశాన్ని శాశ్వత అరాజకతలోకి నెట్టింది.ప్రపంచంలో జరిగిన సైనిక, రాజకీయ జోక్యాల్లో సుమారు 70%కి పైగా అమెరికా పాత్ర ఉంది. విదేశీ జోక్యాల వల్ల కూలిపోయిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు 40%కి మించాయి. ఇది యాదృచ్ఛికం కాదు, వ్యవస్థాత్మక ప్రజాస్వామ్య ధ్వంసం. డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తే ఆంక్షలు, సహజ వనరులపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటే అస్థిరత, విదేశీ విధానాల్లో స్వతంత్రత చూపితే ప్రభుత్వ కూల్చివేతుఇదే అమెరికా ప్రజాస్వామ్య నమూనా.ప్రజల ఓటు విలువ 0%కి పడిపోయినప్పుడు ప్రజాస్వామ్యం నినాదంగా మాత్రమే మిగులుతుంది. భయభరిత మౌనం చైతన్యాన్ని హతం చేస్తుంది. నిరసన, ప్రశ్నించే ధైర్యం, స్వతంత్ర ఆలోచనలే చివరి కాపురం. శ్రీశ్రీ భావన ప్రకారం, బలవంతుడి ప్రాబల్యం ఎంతగానైనా, ప్రజల చైతన్యం నిలిచితే నిజమైన విముక్తి సాకారం అవుతుంది. మౌనం అంగీకారమే, చైతన్యం ప్రతిఘటన. ప్రపంచం చట్టాల రాజ్యం కాక, బలవంతుల రాజ్యంగా మారకుండా, ప్రజల చైతన్యం నిలవాలి.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# నూతన ఆవిష్కరణల రూపకర్త గెలీలియో

గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలిస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలీలి (జననం 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు.



గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు.

20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు.


గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళి ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతంను బలపరిచాడు. క్రీ.శ 1616లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ధ్వందంగా ప్రకటించాడు.

అప్పటికే మత గ్రంథలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ "Dialogues concerning the two chief world systems" అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథనికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# అగ్రకులతత్వమే మరణ శాసనమై..

భారతదేశంలో వేల సంవత్సరాల అగ్రకుల ఆధిపత్య భావజాలం కేవలం రాజకీయ, ఆర్థిక రంగాల్లోనే కాకుండా, వెనుకబడిన వర్గాల మెదళ్లలోకి చొరబడింది. ఇటీవల దళిత మహిళా డాక్టర్ ఆత్మహత్య ఇందుకు నిదర్శనంగా నిలిచింది. తెలంగాణలో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 23 ఏళ్ల దళిత హౌస్ సర్జన్ పేద కూలీ కుటుంబం నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక సంక్షమ హాస్టళ్ల ద్వారా ఎంబిబిఎస్ వరకు చేరింది. ఆ యువతి, బీసీ కంసాలి కులానికి చెందిన సీనియర్ డాక్టర్‌తో ప్రేమలో పడి, అతని వివాహ వాగ్దానాన్ని నమ్మింది. చివరకు ఆ యువకుడు వారి పెద్దల మాటలు నమ్మి కులభేదాన్ని చూపించి వెనక్కి తగ్గడంతో ఆమె మనోభారంతో ఆత్మహత్య చేసుకుంది. ఇది వ్యక్తిగత ప్రేమ విఫలం కాదు, అగ్రకుల భావజాలం బీసీ వర్గాల మెదళ్లలో పెంచిన కుల దురహంకారానికి నిదర్శనం. ఈ ఘటన రాజకీయ పార్టీలు, మీడియా "ప్రేమ విషాదం"గా చూపిస్తున్నప్పటికీ, దళితుల్ని బీసీల కంటే తక్కువనే విషబీజాన్ని నాటడం వల్లనే ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా బీసీ, ఎస్సీ కులాల్లో సైతం అంతర్గత కుల వివక్ష కొనసాగుతుంది. దీంతో వివాహ సంబంధాలకు దూరంగా ఉంటున్నారు. ఇది అగ్రకుల దుర్విచక్షణ బీసీ సమాజ మెదళ్లలో ఎంత లోతుగా చేరిందో అనే దానికి తాజా నిదర్శనం.



**ఎక్కడికి వెళ్ళినా కులం విడదు**

ఈ దేశంలో దళితులు చదువుకున్నా, ఉద్యోగం చేసినా, నగరానికి వచ్చినా కులం వీడడం లేదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఒక సాధారణ విద్యార్థి కాదు. పీహెచ్‌డీ స్కాలర్. అంబేద్కర్ స్టూడెంట్ లీడర్. అయినా అగ్రకులాలు దళితులపై కులవివక్ష, రాజకీయ దాడులు అతన్ని ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించాయి. ఇది దేశవ్యాప్త నిరసనలకు దారితీసింది. ఎయిమ్స్ లో దళిత విద్యార్థి బాల్ ముకుంద్ భారతి మెడిసిన్ చదవడానికి అర్హుడు కాదు అని అగ్రకుల అధ్యాపకుల అవమానాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది ఇంతటితో ఆగకుండా ఐఐటిలు, మెడికల్ కళాశాలల్లో సైతం కుల వివక్షతతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఐఐటీలో 25 శాతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని సర్వేలు చెప్తున్నాయి. కుల వేధింపులతో హర్యానాకు చెందిన అడిషనల్ డీజీపీ స్థాయి అధికారి పూరణ్ కుమార్ మరణం దేశవ్యాప్తంగా సంచలమైంది. కరీంనగర్ పట్టణంలో ఇటీవల ఎస్సీ, ఎస్టీలకు ఇల్లు అద్దెకి ఇవ్వబడదని ఓ ఇంటి యజమాని ఏకంగా బోర్డు పెట్టాడు. కావున పై ఉదాహరణల ద్వారా స్పష్టమవుతున్న విషయం ఏమిటంటే ఈ దేశంలో కులమే నిజం. చట్టాలు, రాజ్యాంగం ఉన్న కుల భూతం తొలగడం లేదు. ఇప్పటికే దళితుడు గుడిలోకి వెళ్లాడని కొట్టారు, గుర్రం ఎక్కాడని చంపారు, మీసం తిప్పాడని దాడి చేశారు, ప్రేమించాడని ఊచకోత కోశారు. నేడు కులం రూపం, పద్ధతి మారుతుంది, కానీ అణచివేత కొనసాగుతుంది. ఇది కేవలం దళితులకే పరిమితం కాలేదు. బీసీ కులాల సైతం అక్కడక్కడ కులవివక్షతకు, కుల బహిష్కరణకు గురవుతున్న సందర్భాలు చూస్తున్నాం. వారి జనాభా తగిన విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్స్ ను ఆధిపత్య కులాలు అడ్డుకోవడమే అతి పెద్ద వివక్ష.. మాకు అసలు కులం లేదనే, కులం తెలియదనే బహుజన మేధావులంతా ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి.

**బీసీ ఎస్సీ ఎస్టీలంతా దళితులే..**

అగ్రకులాలు కులాన్ని కులతత్వ సాధనాలుగా మారుస్తూ బీసీ ఎస్సీ ఎస్టీల మధ్య ఐక్యతను దెబ్బతీస్తున్నారు. బీసీలను ఎస్సీలపై ఎగ దోస్తూ, ఎస్సీలను బీసీలపై ఎగదోస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నారు. దీని అర్థం చేసుకోకుండా బీసీ,ఎస్సీ ఎస్టీలు నిత్యం విద్వేషాలతో రగులుతున్నారు. వాస్తవంగా దళితులు అంటే విడగొట్టబడిన సమాజం (ఎతీశీనవఅ జూవశీజూశ్రీవ). నేటి బీసీ ఎస్సీ ఎస్టీలంతా దళితులే. కానీ బీసీలను "శూద్రులు"గా, దళితులను "అస్పృశ్యులు"గా ముద్ర వేసిన అగ్రకుల సిద్ధాంతం బీసీ మెదళ్లలోనూ స్థిరపడింది. ఫలితంగా, అణచివేతకు గురైన బీసీ లు కూడా కొంత విద్య, ఉద్యోగం, అవకాశంతో సామాజికంగా ఉన్నత స్థితికి చేరగానే "దళితుల కంటే ఉన్నతులమని భావించుకుంటున్నారు. ఈ భావన వల్లే సిద్దిపేట మెడికల్ కళాశాలలో డాక్టర్ వంటి గొప్ప చదువు చదివిన దళిత యువతికి, బీసీ యువకుడి పెళ్లికి కులం అడ్డు వచ్చింది. ఈ అంతర్గత బ్రాహ్మణతత్వం సమాజంలో బీసీ, ఎస్సీల మధ్య సంఘర్షణకు దారి తీస్తున్నాయి. విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అగ్రకుల ఆధిపత్య భావజాలమే. ఇప్పటికీ దళిత, బహుజనులు అగ్రకుల వర్ణ సిద్ధాంతంతో విడిపోయిన సామాజిక, రాజకీయ అనాథలే. ఈ విషయాన్ని అంబేద్కర్, పూలేలు స్పష్టం చేశారు. వారి స్ఫూర్తితో గత కొన్ని నెలల నుంచి తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలంతా ఉమ్మడిగా ఉద్యమిస్తున్నారు. మరోవైపు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీసీ ఎస్సీ ఎస్టీల జాక్ అధికారం, హక్కుల పోరాటం బహుజనుల ఐక్యతకు, అధికారానికి ముందడుగు వేస్తుంది. ఈ క్రమంలో బీసీ, ఎస్సీల మధ్య కుల పరమైన అంతరాలు పెచ్చరిల్లడం, సామాజిక, రాజకీయ చైతన్యానికి ప్రమాదకరం. బీసీలు అగ్రకులతత్వం వీడాలి. తమ చారిత్రక నేపథ్యాన్ని, భారత రాజ్యాంగ విలువలను అర్థం చేసుకొని బహుజనులు సామాజిక దుర్విచక్షణకు దూరంగా ఉండాలి.




**సంపతి రమేష్ మహారాజ్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428**

## వస్త్రాల తీర్పు

చెట్టు దిగంబరం దాని ఆకుల్ని ఎవరూ ప్రశ్నించరు
రాల్చుకున్నా అది పాపం కాదంటారు.
చెరువు దిగంబరం లోతు కనిపించినా ఎవరూ తీర్పు చెప్పరు
ఆకాశం దిగంబరం అవని దిగంబరం అంతా
చూపించినా అపవాదం లేదు
ప్రకృతి అంతా నగ్నం నిందలకి అతీతం.
కాని ఆడవాళ్ళు వస్త్రాలతోనే విచారణకు నిలబెట్టబడతారు
కప్పుకున్నా తగినంత కాదు అంటారు ఎంత(క)విప్పినా
సంస్కారం లేదు అంటారు.
సామర్థ్యం నైతికత ఆలోచన ధైర్యం
ఇవన్నీ ఉన్నా ఒక చీర మడత విలువను కొలిచే
ప్రమాణమయ్యింది
శాస్త్రాలు చదివిన జీవుడు కూడా అక్కడ మూగబోతాడు
స్త్రీని వ్యక్తిగా కాదు దేహంగా మాత్రమే చూస్తాడు
కాని ఆడవాళ్ళు
వస్త్రాలమధ్యే విప్లవాలు నడిపారు
విమర్శల మధ్యే విజయాలు రాశారు
వాళ్ళ శక్తి చీరలో లేదు
సంకల్పంలో ఉంది స్వాభిమానంలో ఉంది.
దిగంబరం అంటే దుస్తుల లేమి కాదని దృష్టి లోపమే అసలు నగ్నతని
అప్పుడే స్త్రీ కాదు.. సమాజమే సరైన వస్త్రం ధరిస్తుంది

కోటం చంద్రశేఖర్ 9492043348

## మధుర కవిత



బాల భానుని ఉదయ కిరణాలు
విశ్వ చైతన్య భావుటాలు
పున్నమ చంద్రుని తూపులు
వసుమతికి పులకరింతలు

కవిత పల్లి యువ గళాలు
విరులు చిల్లి పరిమళాలు
మధువు లొల్లి పానశాలలు
తనువు కుల్లి నర్తనశాలలు

కోవెలలో మ్రోగెను గంటలు
గిరులు పై చిందులేసే మయూరాలు
తరులలో పూచెను చిగురులు
కోనలలో కూసెను కోకిలలు

నమిలకొండ నాగేశ్వర్ రావు
మేడ్చల్
8688553470

# మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యం

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 7 (జనం సాక్షి) :** సైబర్ జాగ్రూకత దివస్‌ను పురస్కరించుకొని ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ సైబర్ క్రైమ్ అవగాహన ప్రచారం కింద, ఈ వారపు థీమ్ "మహిళల రక్షణ ఉ పిల్లల సంరక్షణ" ఆధారంగా, విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో మెదక్ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేటింగ్ యాప్‌ల ద్వారా జరిగే మోసాలు, సైబర్ బుల్లీయింగ్, సైబర్ స్టాల్కింగ్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ ఫ్రాడ్స్, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలపై వీడియోల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు ఎలా జరుగుతాయో, వాటి వల్ల బాధితులకు కలిగే ఆర్థిక నష్టాలను ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. అలాగే మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలు ఽ ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాల్కింగ్, బ్లాక్‌మెయిల్, డిజిటల్ దుర్వినియోగం వంటి అంశాలపై భయం లేకుండా, ఆలస్యం



చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన కొద్దీ సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు మరియు యువత సైబర్ మోసాలకు సులభంగా బలవుతున్నారని పేర్కొన్నారు. డేటింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని నమ్మకం పొందిన అనంతరం మోసాలకు పాల్పడుతున్న ఘటనలు అధికంగా జరుగుతున్నాయని, అపరిచితులపై వెంటనే నమ్మకం పెట్టుకోవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులు, కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి తాను తెలుసుకున్న సైబర్ భద్రతా సమాచారాన్ని కనీసం ముగ్గురు స్నేహితులకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే భయపడకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమయానికి ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సైబర్ నేరాల నివారణపై ప్రతిజ్ఞ చేయించి, సైబర్ మోసాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు. సైబర్ అవగాహన క్విజ్ పోటీలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సయ్యద్, సతీష్, సాయి కిరణ్, స్వప్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జనవరి 7 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులతో జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారసింగ్, ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్పర్సన్ కల్వ సుజాత, పార్టీ పరిశీలకులు వినోద్ రెడ్డి, రాంశెట్టి నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి పదవుల కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. సర్పంచ్ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కష్టపడి పని చేయాలన్నారు. అర్హులైన వారికి పదవులు సమయానుకూలంగా వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్
- మూడు చింతలపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం



**శామీర్‌పేట్, జనవరి 7 (జనం సాక్షి) :** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రోజు కాంగ్రెస్ పార్టీ నూతన కార్యా లయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్‌ఉమల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, హాజరై కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయ్యాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, మేడ్చల్ జిల్లా ఆర్ టి ఏ మెంబర్ జైపాల్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గోనే మహేందర్ రెడ్డి ,మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్,స్థానిక నాయకులు మంద శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మరెడ్డి, జగన్నాధం, వెంకటరమణ రెడ్డి, బాలకృష్ణ, నర్సింగరావు,పార్టీ కార్యకర్తలు,మాజీ ప్రజా ప్రతినిధులు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ముఖ్య ఉద్దేశం

- జిల్లా మెప్మా పిడి రవికుమార్

**తాండూరు, జనవరి 7 (జనంసాక్షి) :** నిరక్షరాస్యులు అయిన మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ముఖ్య ఉద్దేశమని జిల్లా మెప్మా పిడి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణలో భాగంగా తాండూర్ మహా సమైక్య ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ మెప్మా పిడి రవికుమార్ మాట్లాడుతూ అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమం చదువురాని మహిళలకు చదువు నేర్పేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకం అక్షర వికాసం ఈ పుస్తకంలో 16 పాటలతో ఈ పుస్తకాన్ని అధికారులు తయారు చేశారు .ఈ పాఠాలు వారి నిజ జీవితంలోని సంఘటనలకు అవగాహన కలిగించడానికి సులువుగా అర్థం



చేసుకోవడానికి రూపొందించింది. అమ్మకు అక్షరమాల పై శిక్షణ పొందిన స్టేట్ లెవెల్ ఫెడరేషన్ ప్రతినిధులు రిసోర్స్ పర్సన్లు వారి గ్రూపుల్లో చదువురాని మహిళలకు చదువు నేర్పిస్తారు. ఈ అక్షరమాల కార్యక్రమం 90 రోజులపాటు తెలుగు అక్షరాలతో పాటు అక్షరమాల ఒత్తులు గుణింతాలు చిన్న చిన్న లెక్కలు చిన్న చిన్న పదాలు చదవడం రాయడం సంతకం చేయడం ఇలాంటి నేర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాల పై పడ్డ ప్రతి మహిళ నిరక్షరాస్యులు అయినటువంటి మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ముఖ్య ఉద్దేశం .90 రోజులపాటు అక్షరమాల కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు నిర్వహిస్తారు .పరీక్షలలో పాస్ అయిన వారికి ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేస్తుంది. ఈ సర్టిఫికెట్ ద్వారా మహిళలు ఓపెన్ టెన్త్ లాంటి ఉన్నత విద్యను చదవడానికి అర్హత పొందుతారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వికారాబాద్ వయోజన విద్య లైసెన్ ఆఫీసర్ శ్రీనివాస్ బాబు, తాండూర్ ఎంఈఓ వెంకటయ్య, కోఆర్డినేటర్ నటరాజ్ , తాండూర్ టిఎంసి రాజేంద్రప్రసాద్ గౌడ్, డిఆర్పి హరీష్ సిఆర్పి లావణ్య లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- పారదర్శకతతో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశం

**హైదరాబాద్, జనవరి 7 (జనం సాక్షి) :** రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష




సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షంచాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ మరియు కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సమర్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్‌ఉమల్కాజిగిరి జిల్లా నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే మున్సిపాలిటీల అభివృద్ధి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, జనవరి 7 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు సమగ్ర అభివృద్ధిని సాధించాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బిఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశమై రానున్న మున్సిపల్ ఎన్నికలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని నియోజకవర్గ కేంద్రంగా అభివృద్ధి చేయడంలో బీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఎన్నో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి, వివిధ అధికారిక కార్యాలయాలను ఇబ్రహీంపట్నానికి తీసుకురావడంలో మాజీ ఎమ్మెల్యే , జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లిమంచిరెడ్డి కిషన్ రెడ్డిలి కృషి మరువలేనిదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి లికేటీఆర్‌లి చొరవతో మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణలు, మౌలిక వసతుల అభివృద్ధి గణనీయంగా జరిగిందని తెలిపారు. అలాగే ప్రజలకు నేరుగా ఉపయోగపడే సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం కల్పించిందని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన పనులకు కొత్త శిలాఫలకలు తప్ప చేసిందేమీలేదని మండి పడ్డారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రజలు పొందిన సంక్షేమ ఫలాలను ప్రజలకు గుర్తు చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , మున్సిపాలిటీ అధ్యక్షుడు అల్వాల్ వెంకట్ రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్ రావు, మాజీ చైర్మన్ భరత్ కుమార్ , వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, సుల్తాన్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి , మాజీ వైస్ చైర్మన్ క్యామ శంకర్, మున్సిపల్ ముఖ్య నేతలు ఆకుల సురేష్, ముత్యాల నరేష్ కుమార్ , యాచారం రవీందర్, నల్లబోలు శ్రీనివాస్ రెడ్డి, మంద సుధాకర్, జెర్కోని రాజు, నీలం బాలు , కొండ్రు ప్రవీణ్ , షబ్బీర్ , రవి , జనార్దన్ రెడ్డి , పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఓల్డ్ విలేజ్ భరత్ నగర్ రూ.13.25 కోట్లతో అభివృద్ధి పనులు

- సీఎం రేవంత్ రెడ్డి చొరవతో భారీగా నిధులు మంజూరు



**ఉప్పల్, జనవరి 7 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి.మురికివాడలు, ఓల్డ్ కాలనీల అభివృద్ధినే లక్ష్యంగా చేసుకొని కావాల్సిన నిధులను రాపడుతూ పనులు చేపడుతున్నట్లుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు అవుతున్నట్లుగా చెప్పారు.నియోజకవర్గంలోని మురికివాడలు, ఓల్డ్ విలేజ్‌ల అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లుగా తెలిపారు. రూ.1.25 కోట్లతో ఉప్పల్ ఓల్డ్ భరత్ నగర్ అభివృద్ధి పనులు.ఉప్పల్ లోని ఓల్డ్ భరత్ నగర్ లో రూ.1.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం పరమేశ్వర్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి ఏఈ రాజ్ కుమార్ తో కలిసి పరిశీలించారు.ఓల్డ్ భరత్ నగర్ లో డ్రైనేజీలు, సీసీ రోడ్లను, ఇతర అభివృద్ధి పనులను ఇప్పటికే రూ.12 కోట్లతో ప్రణాళికాబద్ధంగా చేపట్టినట్లుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి చెప్పారు.ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలోని ఓల్డ్ కాలనీలను, మురికివాడలను సైతం అభివృద్ధి చేస్తున్నట్లుగా చెప్పారు.ఈ కార్యక్రమంలో భూసం రఘునాథ్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, గొరిగే చిరంజీవి, సల్ల రాజేందర్ రెడ్డి, బింగి రమేష్, పప్పుది రాకేష్ రెడ్డి, నరసింహ గౌడ్, బాలరాజు గౌడ్, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, దొడ్ల రాజు,తెలకల రామ్ రెడ్డి, తెలకల వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, దాసరి కనకయ్య, తెలకల సుధాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కిషోర్, ఓంకార్ ,బింగి రమేశ్ గౌడ్,చంద్ర శేఖర్ రెడ్డి, నవీన్ రామ్, లక్ష్మణ్, కిరణ్ ,విజయ్, కర్నాకర్, హరిష్, బర్ల పరమేష్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## యాచారం మండల కేంద్రంలో రైతు బజార్ ఏర్పాటు

- దళారీ వ్యవస్థ తగ్గించేందుకు కృషి
- సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలి
- రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- ఎంపిక చేయబడిన రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

**యాచారం, జనవరి 7 (జనం సాక్షి) :** వ్యవసాయ, ఉద్యాన శాఖ సమన్వయంతో తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో వర్షాధార ప్రాంత అభివృద్ధి, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కూరగాయల క్లస్టర్ లో రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. ఎంపిక చేయబడిన 169 మంది రైతులకు ప్లాస్టిక్ క్రేట్స్, వర్మీ బెడ్స్, తేనెటీగల



బాక్సులను రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రైతులకు పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడతూ కూరగాయల సాగును పెంచుతూ తేనెటీగల పెంపకాన్ని పెంచాలన్నారు. మండలంలో రైతు బజార్ ఏర్పాటు చేసి, దళారీ వ్యవస్తను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని రైతులకు ఉపయోగపడేలా రైతు మార్కెట్ ఏర్పాటు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సేంద్రీయ ఎరువులు వాడి, సేంద్రియ వ్యవసాయ పెంచాలని తెలిపారు. కమిషన్ సభ్యులు గోపాల్, మెంబర్ సెక్రటరీ, ఉష, జిల్లా వ్యవసాయ అధికారి, సురేష్, జిల్లా ఉద్యాన శాఖ పట్టు పరిశ్రమ శాఖ అధికారి, ఏడీఏ సుజాత, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ ఉద్యాన శాఖ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి మరింత తోడ్పాటు అందిస్తాం

- గత పాలకుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధి కుంటుపడింది
- శిలాఫలకాలు ముఖ్యం కాదు అభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, జనవరి 7 (జనం సాక్షి) :** అబివృద్ధికి అడ్డుపడేవారిని భద్రేశ్వరుడే గమనిస్తారని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు పట్టణం నడిబొడ్డున వెలిసిన శ్రీ బావిగి బద్దేశ్వర స్వామి ఆలయ నూతన దుకాణ సముదాయాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. నూతన దుకాణ సముదాయాలు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు .ముందుగా ఆలయంలో కొలువైన శ్రీ భావిగి భద్రేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారమే అభివృద్ధి పనులు పూర్తి అవుతున్నాయని తెలిపారు.భద్రేశ్వర స్వామి ఆశీస్సులతో దుకాణాలు పూర్తి చేసినందువుగాను ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ ప్రవీణ్ కుమార్ కమిటీ సభ్యులకు అభినందించారు.భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయం పేరు, ప్రతిష్టలు ఉన్న దేవాలయం. గత పాలకులు చాలా మంది దేవాలయం రూపురేఖలు మారుస్తాం అన్నారు, కానీ ఎవ్వరేమి చేయలేదని విమర్శించారు. ఆ రోజు ఓ పెద్దమ్మ చెప్పింది "దాసోహం" నిర్మించాలని.ఆర్థికంగా ఇబ్బంది ఉన్న, ఒడిదుడుకులు ఉన్న అందరి సహకారంతో ముందుళ్ళి దాసోహం నిర్మించామన్నారు. గత నాయకుల లాగ శిలాఫలకాలు వేయను, షాపింగ్ కాంప్లెక్స్ (17 షాప్స్) నిర్మాణం పూర్తి చేసి. ప్రారంభించామని తెలిపారు.మొత్తం 64 షాపులు నిర్మాణంలో ఉన్నాయి. ఈ రోజు 17 షాపులు ప్రారంభించుకోవడం సంతోషం అన్నారు. అతి త్వరలో మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు.వేద పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడించారు. కొందరు వ్యక్తులు కాంప్లెక్స్ ప్రారంభోత్సవం కావొద్దు అని హైకోర్టుకు వెళ్ళారు.స్వామి వారి ఆశీర్వాదం సంపూర్ణంగా మనకుంది. ఎవ్వరేమి చేయలేరు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. నాడు 7వ గ్యారంటీ గా వ్యాపారస్తులకు ఎవ్వరికి ఇబ్బంది కానివ్వను అని చెప్పిన. నేడు పక్క అమలు చేసి చూపిస్తున్నామన్నారు. నేనుకడావ్యాపార కుటుంబం నుంచి వచ్చాను నేనుకుడా వ్యాపార



వేత్తను.శిలాఫలకం ముఖ్యంకాదు అభివృద్ధి ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, దేవాలయ రెనవేషన్ కమిటి చైర్మన్ పటేల్ కిరణ్ కుమార్, డీసీసీబీ జిల్లా వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ డీపీసీ సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, దేవాలయ ఈఓ శేఖర్ గౌడ్, కమిటి సభ్యులు కోటం సిద్ధలింగం, జొల్లు రోహిణి, శెట్టి సురేష్, కిరణ్ కుమార్, వీరశైవ సమాజం అధ్యక్షులు ఆర్. బస్వరాజ్, కాళికాదేవి దేవాలయ చైర్మన్ పి.బస్వరాజ్, సమాజం సభ్యులు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఊరుకొండ మండలాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలో కలపాలి

- బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్



**కల్వకుర్తి, జనవరి 7 (జనం సాక్షి) :** కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ కు కూత పెట్టు దూరంలో ఉన్న ఊరుకొండ మండలాన్ని తీసుకొని పోయి జడ్చర్ల రెవెన్యూ డివిజన్ నూతనంగా ఏర్పాటు చేసి నా ఊరుకొండ మండలాన్ని జడ్చర్లలో కలపాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి నిన్న అసెంబ్లీలో మాట్లాడిన మాటలు విడ్డూరంగా ఉన్నాయి అని బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నిరంజన్ గౌడ్ విడురం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే ఏ స్వార్థం కొరకు మాట్లాడిందో అర్థం కావడం లేదు అని ఆనాడు ప్రజల సౌకర్యార్థం పరిపాలన సౌలభ్యం కొరకు ప్రజాభిప్రాయ సేకరణ మేరకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తల్లోజు ఆచారి అమర నిరాహార దీక్ష చేపట్టి అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ సాధించుకొని, ఊరుకొండ గేటు పైన అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో టెంటు వేసి కూర్చొని ఉద్యమాల ద్వారా 16 గ్రామ పంచాయతీల తీర్మానాల మేరకు ఆనాటి మాజీ ఎమ్మెల్యే డాక్టర్, చర్ల లక్ష్మరెడ్డి ఆశీస్సులతో మండలాన్ని సాధించుకోవడం జరిగింది అని తెలిపారు. కష్టపడి ఉద్యమాలు చేసి సాధించుకున్న మండలాన్ని తమ సొంత ప్రయోజనాల కొరకు జడ్చర్లలో కలపాలని మాట్లాడుతున్నారు అని ఇప్పటికే ఊరుకొండ మండల ప్రజలు జడ్చర్లకు ఓటు వేసి కల్వకుర్తి లీడర్ల తోటి పనిచేయించుకోవడం చాలా బాధాకరంగా ఉంది అని తెలిపారు. ఊరుకొండ మండల ప్రజలకు కల్వకుర్తి అతి దగ్గరలో 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. జడ్చర్ల 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ప్రతినిత్యం కల్వకుర్తికి ఉర్కొండ మండల ప్రజలు రోజుకు మూడు సార్లు నాలుగు సార్లు వాళ్ల అవసరాల కొరకు వస్తూ పోతూ ఉంటారు ప్రజల సౌకర్యార్థం కల్వకుర్తి లోనే రెవెన్యూ డివిజన్లో ఉర్కొండ మండలం ఉండాలి కొత్తగా ఏర్పడే జిల్లా కల్వకుర్తిలో మా ఊరుకొండ మండలం కూడా ఉండాలి. ఇందులో ఎలాంటి మార్పులు చేర్పులు జరుగుతే ఊరుకునేది లేదు అని మళ్లీ ఉద్యమాలతోటి మా మండలాన్ని జడ్చర్లలో కలపకుండా ఎంతైనా పోరాటం చేస్తామని ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువ నాయకులు టీ. అరవింద్ గౌడ్, బిజెపి నాయకులు, తాడెం చిన్న, కొమ్మగోని వెంకట్ గౌడ్ .శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వృద్ధులు,దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 7 (జనం సాక్షి) :** వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రతి సోమవారం జరిగే సాధారణ ప్రజావాణి కి రాలేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు,దివ్యాంగుల సౌకర్యార్థం ప్రతినెల మొదటి బుధవారం స్థానిక అర్బన్ తహిసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆమె వృద్ధులు, దివ్యాంగుల నుండి ఎదుర్కొంటున్న సమస్యల పై దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఇందులో తనకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని ఒక దివ్యాంగుడు కోరగా, తనకు ఇల్లు లేదని ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని ఒక వృద్ధుడు కోరాడు. వికలాంగులకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని వికలాంగుల సంఘం విజ్ఞప్తి చేసింది. అంతకు ముందు జిల్లా సంక్షమ శాఖ అధికారిణి జరీనా బేగం గతంలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, ఆర్టీసీ అధికారి వహీద్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సమిష్టి కృషితోనే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం



**పటాన్చెరువు, జనవరి 7 (జనం సాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వెల్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిస్తూ మెజార్టీ స్థానాలలో జయకేతనం ఎగురవేయడం సంతోషకారమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మెదక్ పార్లమెంటు పరిధిలోని సిద్దిపేట జిల్లా గజ్వెల్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన సర్పంచ్ లు, జిల్లా సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె కళ్యాణ లు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో కలిసి నీలం మధు ను చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా విజయకేతనం ఎగురవేసిన సర్పంచ్‌లను, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులను ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు. గజ్వెల్‌లో కాంగ్రెస్ తో నే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రజలు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులు కృషి మరువలేనిదని కొనియాడారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మనోహరబాద్ గ్రామ సర్పంచ్ భాస్కర్ యాదవ్, జీడిపల్లి గ్రామ సర్పంచ్ నర్సన్న గారి కృష్ణ, కొండాపూర్ గ్రామ సర్పంచ్ నూకల రాము, వెంకటాపూర్ అగ్రహారం గ్రామ సర్పంచ్ వెంకటేష్, గౌతజిగూడా గ్రామ సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు, సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ రైస్ ఇవ్వని మిల్లర్లపై ఉక్కుపాదం

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




**వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనం సాక్షి) :** సకాలంలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) సమర్పించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించే మిల్లర్లపై ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోళ్లు, మిల్లర్ల నుంచి సీఎంఆర్ అప్పగింత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇంకా ఏ ఏ మండలాల్లో దాన్యం కొనుగోలు ప్రక్రియ నడుస్తుందని ఆరా తీశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రైతులకు వేగంగా నగదు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఇక 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రైతులకు నగదు పెండింగ్ ఉందని వారికి వేగంగా నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా, జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా ధాన్యాన్ని అనధికారికంగా మిల్లులకు తరలించే దాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటువంటి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తొలగించి, బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అటువంటి పీపీసీలకు కమిషన్ కూడా ఆపివేయాలని సూచించారు. ఇక ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని సీఎంఆర్ అప్పగింత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మిల్లర్లపై ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం అటువంటి మిల్లర్ల జాబితా తయారుచేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే నెల రోజుల్లో మిల్లర్ల నుంచి సీఎంఆర్ పూర్తిస్థాయిలో అప్పగించే విధంగా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. గత రబీ సీజన్ లో ధాన్యం తీసుకుని సీఎంఆర్ పూర్తి చేయని వారికి ధాన్యం కేటాయించడానికి వీలులేదని చెప్పారు. ఈ సమావేశంలో డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, డి సి ఓ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఎఫ్ఎల్ హెడ్మాస్టర్‌కు షోకాజ్ నోటీస్



**నాగర్‌కర్నూల్, జనవరి 7 (జనంసాక్షి) :** పాఠశాల విధులకు అనధికారికంగా గైర్హాజరవుతూ, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంజయ్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ కు బుధవారం షోకాజ్ నోటీస్ జారీ చేయాలని నాగర్ కర్నూల్ మండల విద్యాశాఖాధికారి భాస్కర్ రెడ్డిని ఆదేశించిన నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ గత రెండు మాసాల క్రితం డి ఈ ఓ తనిఖీ చేసిన సందర్భంలో ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ గైర్హాజర్ పై మెమోను జారీ చేయగా, బుధవారం మరోమారు ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలోనూ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్ అనధికారికంగా గైరహాజరైనందుకు శేఖర్ కు షోకాస్ నోటీస్ జారీ చేసి, రెండు రోజుల్లో వివరణ కోరాలని, ప్రధానోపాధ్యాయుడి వివరణ ఆధారంగా శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ భాస్కర్ రెడ్డిని డిఈవో ఆదేశించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలల విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డిఇఓ ఈ సందర్భంగా హెచ్చరించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల ముఖ హాజరు వివరాలను డీఈవో పరిశీలించారు.

# ఆర్థిక స్థోమత లేని ఖైదీల కోసమే సాధికార కమిటీ

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




**వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** ఆర్థిక స్థోమత లేని కారణంగా హామీ పత్రం, డబ్బులు చెల్లించలేని విచారణ ఖైదీలకు బెయిల్ విషయంలో సహాయం చేయడమే సాధికార కమిటీ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం జిల్లా స్థాయి సాధికార కమిటీ వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం కాగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి మహబూబ్ నగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశంతో కలిసి హాజరయ్యారు. మిగిలిన కమిటి సభ్యులలో జిల్లా ఎస్పీ డి. సునీత, వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజనీ తమ తమ కార్యాలయాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. విచారణలో చిన్న నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైదీలకు బెయిలు లభించినప్పటికి ఆర్థిక స్తోమత లేని కారణంగా హామీ పత్రం ఇవ్వలేని ఇద్దరు ఖైదీలపై జిల్లా స్థాయి కమిటిలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని కారణంగా హామీ పత్రం, డబ్బులు చెల్లించలేని విచారణ ఖైదీలకు బెయిల్ విషయంలో సహాయం చేయడమే సాధికార కమిటీ ఉద్దేశమని తెలిపారు.సాధికార కమిటి ద్వారా ఎవరికైతే హామీ పత్రం డబ్బులు మాఫీ చేసి జైలు నుండి విడుదలకు అనుమతించడం జరుగుతుందో అలాంటి వారిని విడుదలకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిటీ సమావేశంలో ఇద్దరు ఖైదీలకు బెయిల్ కు కమిటీ సిఫారసు చేయడం జరిగిందన్నారు.

## ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి ఆరోగ్య పరికారాల అందజేత

- దాతృత్వం చాటుకున్న నర్సింగ్ అధికారి ఉమా దేవి
- జి.జి.హెచ్.డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్



**నాగర్‌కర్నూల్, జనవరి 7 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సింగ్ అధికారి ఏ.ఉమాదేవి పలు వార్డులకు రోగుల కొరకు నిత్య ఆరోగ్య సేవలకు అవసరమైన ఆరోగ్య పరికారాలను బుధవారం నాడు అందజేసి దాతృత్వం చాటుకున్నదని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ అన్నారు. ప్రతిరోజు గర్భిణీలకు అవసరమైన డాప్లర్ మెషీన్ పరికరం గైనిక్ వార్డుకు అందజేశారు. నవజాత శిశువులకు, చిన్నారులకు అవసరమైన ఇన్ఫాంట్ వేయిన్ ఐడెంటిఫైడ్ మిషన్ పి.ఐ.సి.యు.వార్డుకు మరియు ఆర్థోపెడిక్ వార్డుకు నిత్యం అవసరమైన సిల్వర్ వాకర్ స్టాండ్ ను నర్సింగ్ అధికారి ఏ.ఉమాదేవి అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, తోటి సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సుప్రియ, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజేష్ గౌడ్, డాక్టర్ రాజు, నర్సింగ్ సూపర్డెంట్ మంజుల, హెడ్ నర్సులు పద్మ,అమృత, నిర్మల, నర్సింగ్ అధికారి ఎం.ఆనంద్ కుమార్, ఇతర నర్సింగ్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 17న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం



**మక్తల్, జనవరి 7 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణ కేంద్రంలో ఈ నెల 17న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మక్తల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని బుధవారం నారాయణపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా తమ సిబ్బందికి తదుపరి ఏర్పాట్ల గురించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి తగు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ప్రాంతానికి చెందిన న్యాయవాదులతో పాటు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్, సహాయ న్యాయవాది నందు నామాజీ, సీనియర్ న్యాయవాదులు ఎస్ నారాయణ, మల్లికార్జున్, ఆడెం శ్రీనివాస్, కే రాజశేఖర్, కొర్ల ఆనంద్, భరత్ కుమార్, దత్తాత్రేయ, సూర్య ప్రకాష్, రంకుల ఆనంద్, మహేష్ యాదవ్, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యలను సాధించేటప్పుడు ఒత్తిడికి గురికావద్దు



**వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేటప్పుడు ఒత్తిడికి గురికావద్దని,తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ మధుకర్ స్వామి విద్యార్థులనుద్దేశించి అన్నారు. బుధవారం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ,వనపర్తి జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన, పదవ తరగతి విద్యార్థుల మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోఒక ఫంక్షన్ హాల్ నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌కి ముఖ్యఅతిథిగా పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్, మధుకర్ స్వామి, విశిష్ట అతిథులుగా జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని, ఎంఈఓ మద్దిలేటి, ప్రముఖ మోటివేషన్ స్పీకర్ శ్రీకృష్ణ కైలాస్,_రియర్ గైడెన్స్ కౌన్సిలర్ డాక్టర్ స్రవంతి, డాక్టర్ లక్ష్మకుమారి, భవాణి, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ గద్దె భాస్కర్, వివిధ పాఠశాలల జిహెచ్ఎంలు ఉపాధ్యాయులు, సుమారుగా 700 మంది విద్యార్థుల నుద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఏ విధంగా మసులుకోవాలి, లక్ష్యాన్ని ఏ విధంగా చేదించాలి, పదవ తరగతి పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా ,అత్యున్నతమైనటువంటి మార్పులు ఏ విధంగా సాధించాలి, అనే విషయాలతో పాటుగా వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన విషయాలను తెలియజేశారు. కార్యక్రమానికి వనపర్తి ప్రభుత్వ పాఠశాలల జిహెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గాయకులు సత్తార్ ,సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ , శివలింగం , వెంకటేశ్, రాము, కవి ఉప్పరి తిరుమలేష్ పాల్గొన్నారు.

## ఏకపక్షంగా లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం




**వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం దేశంలో ఏకపక్షంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడలుగా విభజించి కార్మికులకు అన్యాయం చేసిందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ విమర్శించారు. మంగళవారం వనపర్తి ఏఐటీయూసీ ఆఫీసులో జిల్లా కమిటీ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం తెచ్చిన లేబర్ కోడులలో3 కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని బిజెపి అనుబంధ కార్మిక సంఘం బిఎంఎస్ కూడా చెప్పిందన్నారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా విభజనలో దేశంలో కార్మిక సంఘాలను కార్మికులను కేంద్రం సంప్రదించలేదన్నారు. కోడుల ఫలితంగా సంఘంపెట్టుకునే హక్కు, సమ్మె హక్కు, జీతం పెంపుకు పోరాడే హక్కు, ఎనిమిది గంటల పని దినం తదితర హక్కులను కేంద్రం హరించిందన్నారు. రోజుకు ఎనిమిది గంటలు పని దినం ఉండగా 12 గంటలకు పెంచిందన్నారు. కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలకు దోచి పెట్టేందుకే కోడులను తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలోఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి మోష, సహాయ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 7 (జనం సాక్షి) :** ఇకపై ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకుండా జిల్లా కలెక్టర్ కార్యాలయం లోనికి ప్రవేశం లేదు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి నిర్ణయం మేరకు కలెక్టరేట్ లోకి హెల్మెట్ లేకుండా లోనికి ప్రవేశించే ద్విచక్ర వాహనదారులను గత రెండు రోజులుగా అనుమతించడం లేదు.రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద రవాణా శాఖ సిబ్బంది తో కలిసి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుండి 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలు పాటింపు,రోడ్డు భద్రతపై అవగాహన కలిగించేందుకు రవాణా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేని కారణంగా తలకు ప్రమాదం సంభవించి అనేక మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని,హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చే అధికారులు,ఉద్యోగులు,ప్రజలు తప్పక హెల్మెట్ ధరించి రావాలని ,అదే విధంగా నాలుగు చక్రాల వాహన దారులు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు.. కలెక్టర్ కార్యాలయం లో పని చేసే ఉద్యోగులు,సిబ్బంది అందరికీ ఆదర్శంగా ఉండాలని,ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు రెవెన్యూ అదనపు కలెక్టర్ తో పాటు జిల్లా రవాణా అధికారి రఘు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సువర్ణ రాజ్,మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు,ఆర్.టి. ఏ సభ్యులు సలీం, రవాణా శాఖ,కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

## మంత్రి పొంగులేటికి ఘనస్వాగతం



హనుమకొండ ప్రతినిధి జనవరి 7 (జనంసాక్షి) : హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు హెలికాప్టర్ ద్వారా బుధవారం ఉదయం 11.28 గంటలకు చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి వాహనంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షచేందుకు హన్మకొండ కలెక్టరేట్ ఐడిఓసి కార్యాలయానికి చేరుకున్నారు.

## కత్తితో వివాహిత హల్‌చల్

- భర్త అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఆందోళన
- షాప్‌లోకి వెళ్లి దాక్కున్న భర్త
- వరంగల్ చౌరస్తాలో టెన్షన్



వరంగల్ ఈస్ట్, జనవరి 07 (జనంసాక్షి) : తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని నిరసిస్తూ కూరగాయలు కోసే కత్తితో భర్తను వెంటాడి పొడుస్తానని వివాహిత మహిళ భయపెట్టింది. భార్య కత్తితో వెంటాడుతుండగా దుకాణంలోకి వెళ్లి తలదాచుకున్న భర్త సంఘటన వరంగల్ చౌరస్తాలో బుధవారం చోటుచేసుకుంది. తన ఆస్తులు ఆక్రమించి తనకు దూరంగా ఉంటున్నాడని ఆరోపిస్తూ వివాహిత మహిళ కత్తితో ఆందోళనకు దిగింది. వరంగల్ చౌరస్తాలో జనమంతా చూస్తుండగా జరిగిన ఈ సంఘటన ఒక్కసారిగా వాతావరణం వేడెక్కించింది. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా నర్సంపేట ప్రాంతానికి చెందిన సదరు ఈ మహిళ గతంలో కూడా జ్యువలరీ షాప్ కు చెందిన తన భర్త పై ఇలాగే దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి విషయం తెలుసుకున్న ఇంతేజారుగంజ్ పోలీసులు మహిళను సదన్ హెూం కు తరలించినట్లు సమాచారం.

## పెద్దవంగరలో వారాంతపు సంత..!

- శుక్రవారం నుండి ప్రారంభం
- ఎక్స్ రోడ్డు సమీపంలో ఏర్పాటు
- వ్యాపారులు అధిక సంఖ్యలో తరలిరావాలి : సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్




పెద్దవంగర జనవరి 07(జనం సాక్షి) : మండల ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. రేపటి నుండి (ప్రతి శుక్రవారం) మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు సమీపంలో వారంతపు సంత ఏర్పాటుకు ఇటీవల నూతన పాలక వర్గం, గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ ఆధ్వర్యంలో తీర్మానం చేసింది. ఈ మేరకు పాలక వర్గం మండలంలో సంత ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మండల ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న సంత కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం సంత నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో సంతలు ఏర్పాటు చేసుకొని కావాల్సిన సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ స్థానికంగా వ్యాపార అభివృద్ధి చెందాలన్నారు. అధిక సంఖ్యలో వ్యాపారస్తులు తరలిరావాలని, అన్ని రకాల సరుకులను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి 6వ గిరిజన సంక్షేమ క్రీడా పోటీలు ప్రారంభించిన మంత్రి సీతక్క



ఏటూరు నాగారం, జనవరి 07 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షమ శాఖ మరియు గిరిజన కమిషన్ వారి ఆధ్వర్యంలో ఐటిడిఏ ఏటూరునాగారం మండల కేంద్రంలోనీ కొమరం భీం మైదానంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యతను ప్రోత్సహించడం, ప్రతిభావంతులను గుర్తించడం,రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే 6వ రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షమ క్రీడా పోటీలు నిర్వహించే ముఖ్య ఉద్దేశం అని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు,గిరిజన క్రీడాకారుల సంక్షమం కోసం కట్టుబడి ఉందని వారి ఎదుగుదలకు, అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడా పోటీలు ములుగు జిల్లాలో నిర్వహించడం చాలా గర్వకారణం అని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ చిత్రా మిశ్రా , ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,గిరిజన క్రీడా శాఖ అధికారులు ,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, జనవరి 7 (జనంసాక్షి) : ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్ మెంట్ (పోష్)-2013 చట్టం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, స్థానిక, అంతర్గత ఫిర్యాదుల కమిటీల ప్రతినిధులు కవిత, శివ కీర్తి లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళ ఉద్యోగులతో పోష్ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నివారణ, పరిష్కారంపై తెలుసుకోవాలని, మహిళల సంక్షమానికి ఈ చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. జిల్లాలో స్థానిక, అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు తాము పని చేసే ప్రదేశాలలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఈ కమిటీలను సంప్రదించవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో స్థానిక ఫిర్యాదుల కమిటీ కొనసాగుతుందని, కనీసం 10 మంది పని చేసే జిల్లా శాఖ కార్యాలయాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసి జిల్లా సంక్షమ శాఖ కార్యాలయానికి వివరాలు తెలియజేసినట్లయితే ఆన్ లైన్ షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాలో ఇప్పటివరకు 47 అంతర్గత ఫిర్యాదుల కమిటీలు కొనసాగుతున్నాయని తెలిపారు. అసంఘటిత రంగాలలో పని చేస్తున్న మహిళలు ఫిర్యాదు కొరకు స్థానిక కమిటీని సంప్రదించవచ్చని, ఈ కమిటీలలో ఫిర్యాదు చేసిన 90 రోజులలో విచారించిన తరువాత 10 రోజులలో ఫిర్యాదు నివేదికను సంబంధిత జిల్లా అధికారికి సమర్పించడం జరుగుతుందని, నివేదిక అందిన 6 నెలల సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదులో తుది తీర్పు సంతృప్తికరంగా లేనట్లయితే అప్పీలు కొరకు ట్రిబ్యునల్/న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పని ప్రదేశాలను మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేసినట్లయితే సదరు ఫిర్యాదుదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటూ జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. సంఘటన జరిగిన 3 నెలల వ్యవధిలోగా ఫిర్యాదు చేయాలని, మహిళల సంక్షమం కోసం హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 181 ఏర్పాటు చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం చట్టం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల స్టూడెంట్స్ జాగ్రత్తగా ఉండాలి

- రోడ్డు ప్రమాదాలు జరుగకుండా బాధ్యతగా ఉండాలి
- కుటుంబసభ్యులకు స్టూడెంట్సే అవగాహన కల్పించాలి
- భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) : సైబర్ నేరాల పట్ల స్టూడెంట్స్ జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా బాధ్యతగా ఉండాలని, కుటుంబసభ్యులకు స్టూడెంట్సే అవగాహన కల్పించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం స్టూడెంట్స్ సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' నినాదంతో సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమంతో పాటు, రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సైబర్ నేరాల నివారణపై ప్రతిజ్ఞ చేయించి, సైబర్ మోసాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, బాధ్యతాయుత డిజిటల్ పౌరులుగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ఫ్రాడ్స్, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి సైబర్ నేరాలపై వీడియోల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు ఎలా జరుగుతాయో, వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాలపై ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైన వారు ఎలాంటి ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థులు అవగాహనతో పాటు బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించి, తాము నేర్చుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, అధిక వేగం కారణంగా జరిగే ప్రాణాంతక ప్రమాదాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని స్టూడెంట్స్ కు ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, డీటీవో సంధాని, సీఐలు, ఎస్ఐలు, టీచర్లు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన స్టూడెంట్స్ పాల్గొన్నారు.



### అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతరలో ఏర్పాట్లు చేయండి

వరంగల్ ఈస్ట్, జనవరి 07 (జనంసాక్షి) : ఈనెల 28, 29, 30, 31 తేదీలలో 44 వ డివిజన్ పరిధిలోని అమ్మవారిపేటలో జరుగు సమ్మక్క- సారలమ్మ జాతరకు విచ్చేసి భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల అభివృద్ధి కొరకు తగు చర్యలు తీసుకోవాలని వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి కార్పొరేటర్ జలగం అనిత రంజిత్ రావు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంలో కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షులు కోడూరి బిక్షపతి, ఆర్గనైజర్ దాసి రాందేవ్, బైరి నాగరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

### ఆకార్ ఆశా హాస్పిటల్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, జనవరి07 (జనంసాక్షి) : జిల్లా ప్రజలు ఆకార్ ఆశా హాస్పిటల్ కూకట్పల్లి, హైదరాబాద్ ద్వారా అందిస్తున్న ఉచిత పునర్నిర్మాణ శస్త్ర చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లో ఆకార్ ఆశా హాస్పిటల్‌కు చెందిన వైద్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి, తమ హాస్పిటల్‌లో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలియజేశారు. అనంతరం ఉచిత శస్త్ర చికిత్సలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకార్ ఆశా హాస్పిటల్ వారు పునర్నిర్మాణ శస్త్ర చికిత్సలను పూర్తిగా ఉచితంగా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన బాధితులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య, ఆకార్ ఆశా హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లిఖిత గుప్తా, డాక్టర్ శాలిని, డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆదేశాలు పాటించాలి

- గొండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్
- వెంకటాపురం మండలంలో ఎల్టిఆర్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



నూగూర్ వెంకటాపురం జనవరి 7(జనంసాక్షి): వెంకటాపురం మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు పాటించి ఎల్టిఆర్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గొండ్వాన సంక్షమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలో ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం ఆవరణలో జిఎస్పి కార్యకర్తల సమావేశంలో మండల నాయకులు పర్శిక అనిల్ అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ హాజరై మాట్లాడుతూ వెంకటాపురం మండలం కేంద్రంలో 1/70 ఎల్టిఆర్ ఉల్లంఘన చేస్తూ గిరిజనేతరులు వెంకటాపురం (జెడ్) లో ఉన్న గ్రామ కంఠం భూమిని క్రయవిక్రయాలు చేస్తున్నారని, సోమవారం గొండ్వాన సంక్షమ పరిషత్ ఆధ్వర్యంలో పత్రిక ప్రకటన ఇచ్చారు. ఆ ప్రకటనకు జిల్లా కలెక్టర్ స్పందించి రెవిన్యూ శాఖకు ఆదేశాలు జారి చేయడం జరిగింది ఇందుకుగాను ఓల్డ్ వాన సంక్షమ పరిషత్ జిల్లా అధ్యక్షులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాలు మండల రెవెన్యూ అధికారి పంచాయతీ అధికారులు పాటించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పూనెం ప్రవీణ్, సాగర్, దిలీప్ వెంకటేష్ పాల్గొన్నారు.

## కాకతీయులనాటి శిల్ప సంపద అద్భుతం



వరంగల్ ఎంజీఎం, జనవరి 7 (జనంసాక్షి) : బుధవారం సాయంకాలం మాల్దీవ్స్ నుండి 30 మంది పర్యాటకులు ఓరుగల్లు కోటను సందర్శించి ఆనాటి కాకతీయుల నాటి కళాఖండాలు అద్భుతం అని కొనియాడారు వారికి పర్యాటక శాఖ గైడ్ రవి యాదవ్ కాకతీయ రాజుల చరిత్ర చెప్పుకుంటూ అద్భుతమైన కళాఖండాలను చూపించుకుంటూ వాటి చరిత్రను వివరించడం అయినది స్వయంభు కాంప్లెక్స్ లోని కళా తోరణాలతో పాటు నంది నాట్యం మండపం ముగ్గురు మనుషులు నాలుగు కాళ్ల విశిష్టతను నాటి శిల్పుల యొక్క మేధస్సు గొప్పతనాన్ని వివరించడమైనది. తదనంతరం కోటలో ఉండబడిన రాతికోట మట్టి కోట ఏకశిలా కొండ కుష్ మహే హల్, శృంగారపు బావి, అక్కాచెల్లెళ్ల బావులు విశిష్టతను వివరించుకుంటూ వారు తెచ్చుకున్న కెమెరాలో కళాఖండాలను బంధించు కన్నారు. వారికి గైడ్ రవి యాదవ్ సహకరించారు.

## ప్రజల అవసరాల మేరకు సౌకర్యాల కల్పన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్




మంచిర్యాల/రామకృష్ణాపూర్, జనవరి 7 (జనంసాక్షి) : జిల్లాలో ప్రజల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల కార్యచరణను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిపి ఎ.భాస్కర్, మందమర్రి తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, ఆర్‌టిసి డిఎంలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మందమర్రి ప్రాంత ప్రజల సౌకర్యార్థం మందమర్రి పట్టణంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్యచరణ ప్రారంభించడం జరిగిందని, బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ మందమర్రి ప్రాంతంలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ మంజూరు చేయడం జరిగిందని, 2, 3 నెలలలో ప్రారంభించి సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణించేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. మందమర్రి నుండి హైదరాబాద్ కు బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, చెన్నూర్ నుండి హైదరాబాద్ కు అన్ని గ్రామాలను అనుసంధానం చేస్తూ 4 బస్సులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, చెన్నూర్ నుండి కాటారం, కాళేశ్వరం వరకు ప్రజల సౌకర్యార్థం బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో అవసరమైన అటవీ అనుమతులు పొంది పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పాఠశాల సమయానికి ఇబ్బందులు లేకుండా బస్సుల రవాణాకు సహకరించాలని తెలిపారు. ఆర్థిక అభివృద్ధికి దాదాపు 20వేల కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణ సదుపాయాలు కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
08 జనవరి 2026

# అట్టహాసంగా ప్రారంభమైన 69వ జాతీయస్థాయి అండర్ 17 బాలుర కబడ్డీ పోటీలు

- క్రీడల్లో గెలుపోటములు సహజం
- మంత్రి వాకాటి శ్రీహరి

**మణుగూరు, జనవరి 7 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో 69వ జాతీయస్థాయి అండర్‌ఉ17 బాలుర కబడ్డీ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల క్రీడల ఫెడరేషన్ ఆధ్వర్యంలో, కంది చారిటబుల్ ట్రస్ట్, మౌర్య టెక్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ జాతీయస్థాయి క్రీడా పోటీలను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి మత్స్య, క్రీడలు యువజన సేవల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా , శిశు సంక్షమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఐటిడిఏ పీఓ రాహుల్ తదితరులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి జిల్లాకు విచ్చేసిన మంత్రులు వాకాటి శ్రీహరి, ధనసరి అనసూయలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మణుగూరు ప్రధాన కూడలి నుంచి సీఎం టార్చ్ ర్యాలీని మంత్రి వాకాటి శ్రీహరి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం



ఏడూళ్ళ బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ పతాకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. జాతీయ కమిటీ పోటీల సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.అనంతరం బెలూన్లను గాలిలోకి వదిలి జాతీయ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ... దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి "ఈస్ట్ ఆర్ వెస్ట్ ఉ ఇండియా ఇస్ ది బెస్ట్, ఈస్ట్ ఆర్ వెస్ట్ ఉ బయ్యారం ఇస్ ది బెస్ట్, భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ క్రీడా సంబరం చూస్తే సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చినట్లుగా ఉందన్నారు. మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... జాతీయస్థాయి కబడ్డీ పోటీలను బయ్యారం గ్రామంలో నిర్వహించేందుకు బాధ్యత తీసుకున్న కంది చారిటబుల్ ట్రస్ట్ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా పోటీల నిర్వహణ కోసం వారు సుమారు ఆరు నెలల పాటు శ్రమించి, ఏర్పాట్ల నుంచి ఆతిథ్యం వరకు సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మారుమూల గిరిజన ప్రాంతమైన బయ్యారంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించటం ఎంతో సంతోషకరమన్నారు. గ్రామీణ స్థాయిలో యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ తరహా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. దేశం నలుమూలల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చి జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఇది మరచిపోలేని అనుభవంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి నాగలక్ష్మ, క్రీడా శాఖ అధికారి పరందామరెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ నిర్మల్ జంగ్డే,సర్పంచ్ చందర్రావు, కంది చారిటబుల్ ట్రస్ట్ సుబ్బారెడ్డి, విశ్వ భరత్ రెడ్డి, తాసిల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, క్రీడా శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ జలాలతో తుంగతుర్తి నియోజకవర్గం సస్యశ్యామలం

- బయ్యన్నవాగు స్టేజ్ 2 ద్వారా నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే మందుల సామెల్



**తుంగతుర్తి, జనవరి 7 (జనం సాక్షి) :** ఎస్ఆర్ఎస్పి జలాలతో తుంగతుర్తి నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు బుధవారం బయ్యన్న వాగు స్టేజ్‌ఉ2 పనుల ద్వారా ఎస్సారెస్పీ కాలువ నుంచి పంట పొలాలకు నీటిని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, చివరి ఎకరం వరకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటి విడుదలతో నియోజకవర్గ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది అని అన్నారు, సాగునీరు రావడంతో పంటలపై ఆశలు పెరిగాయని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్‌గా అంబటి శాంతయ్య



**ఖమ్మం, జనవరి 7 (జనం సాక్షి) :** చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ పెన్షన్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎంపికైయారు .స్వతగా రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన అంబటి సామాజిక సేవాకార్యక్రమాలలోముందు ఉంటారు. ఉపాధ్యాయ సమస్యల మీద, రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యల మీద పోరాటాలు చేసారు. హైదరాబాద్ ధర్నాలతో పాటు జిల్లా కేంద్రాలలో జరిగే ధర్నాల్లో కూడా చురుకుగా పాల్గొనడంతో రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నామినేట్ చేసింది. తన ఎంపికకు సహకరించినటువంటి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు మధు, ప్రధాన కార్యదర్శి వెంకట నరసయ్య, జిల్లా అధ్యక్షులు వైవికి కృతజ్ఞతలు తెలియజేసినారు. రిటైర్ అయినటువంటి పెన్షనర్ సమస్యల మీద తాను దృష్టి పెట్టివాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అంబటి తెలిపారు.

# ప్రభుత్వం లక్షలు పెట్టి పెంచిన చెట్లను నరికిన వెంచర్ దారులు

- అధికారులకు ముడుపులు అందించారా..?

**కోట్‌పల్లి, జనవరి 7 (జనం సాక్షి) :** ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి వృక్ష సంపదను పెంచేందుకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్లను నాటి కంటికి రెప్పల కాపాడుకుంటుంటే ... రహదారుల పక్కన వెలసిన వెంచర్లు కనిపించడం లేదని ఏళ్ల తరబడి ప్రభుత్వం ఖర్చు పెట్టి పెంచిన చెట్లను నరికి వేసిన సంఘటన కొట్ పల్లి మండల సమీపంలో జరిగింది. రహదారులపై ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి చెట్లు పెంచుతుంటే.. ప్రధాన రహదారుల పక్కన ఏర్పాటు చేసుకున్న వెంచర్ దారులు తమ వెంచర్ కనిపించడం లేదని ప్రభుత్వం లక్షల రూపాయలు పెట్టి పెంచిన చెట్లను నరికి వేయడం పై కోట్ పల్లి మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ పల్లి మండల కేంద్రానికి కూతపెట్టు దూరంలో



ప్రధాన రహదారి పక్కన ఏపుగా పెంచిన చెట్లను నరికిన విషయంపై వెంచర్లో ఉన్న ఇన్చార్జిని ఓ జర్నలిస్టు అడగగా అవును నేనే నరికించా.. ఏం చేస్తావో చేసుకో.. ఏమన్నా రాస్కో అని వ్యంగ్యంగా మాట్లాడారు. వెంచర్ దారులు నరికి వేస్తుంటే అధికారులకు కళ్ళు కనిపించడం లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వెంచర్ దారులు అధికారులకు ముడుపులు అందించి నరికి వేశారా అని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నాను.

### ఎంపీడీవో హేమంత్ వివరణ

కోట్‌పల్లి కూతపెట్టు దూరంలో ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టి నాటిన చెట్లను నరికిన విషయమై కోటపల్లి ఎంపీడీవో హేమంత్ ను వివరణ కోరగా... ప్రధాన రహదారి వైపు ఉన్న చెట్లను నరికి వేసేందుకు ఎవరికీ హక్కు లేదని.. ఈ విషయంలో మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నరికి వేయడం జరిగిందని, చెట్లను నరికిన విషయమై నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత

**రామన్నపేట, జనవరి 7 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి.సబిత అన్నారు. రోడ్డు రవాణా భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశానుసారం రామన్నపేట మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సైండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సత్తయ్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ లేదా కాలినడకన వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్టు, హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. నియమ నిబంధన




ఉల్లంఘించిన యడల మోటార్ వాహన చట్టం ప్రకారం శిక్షకు అర్హులవుతారని, వాటిపట్ల అందరూ అవగాహనతో ఉండాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు లైసెన్సులు పొందాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేనియెడల దొరికితే వారి తల్లిదండ్రులు శిక్షకు అర్హులు అవుతారని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ అనుగుణంగా రోడ్డు క్రాస్ చేసి వెళ్లాలని, సిగ్నల్స్ చూసుకుంటూ బండి డ్రైవింగ్ చేస్తూ వెళ్లాలని తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వారందరూ చేత ఈ మాతోత్సవాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, రామన్నపేట తహశీల్దార్ లాల్ బహుదూర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎ. మసీద్, కమిటీ సభ్యులు, ఏజీపి సుక్క శ్రవణ్ కుమార్, సీనియర్ అడ్వకేట్ జినుకల ప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్ లు బి.డేవిడ్, మామిడి వెంకట్ రెడ్డి, అడ్వకేట్ లు నకిరేకంటి మొగులయ్య, దినేష్, యాదాసు యాదయ్య, కునూరు శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.జగదీష్, మండల విద్యాధికారి గవ్వ జ్యోతి, సబ్ ఇన్స్పెక్టర్ డి.నాగరాజు, ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు, స్కూల్ కరస్పాండెంట్ చిట్టిబాబు, మల్లిఖార్జున్, నరేందర్ రెడ్డి, మాటిన్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కోక సబిత, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, జూనియర్ కళాశాల విద్యార్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లును పరిశీలించిన హౌసింగ్ ఏఈ రవీందర్ రెడ్డి



**భువనగిరి రూరల్, జనవరి 7 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణశాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలనే సంకల్పంతో భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి మంజూరైనటువంటి 15 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో మొదటగా జిట్టా అండాలు ఇందిరమ్మ ఇల్లు పూర్తయిన సందర్భంగా ఈరోజు హౌసింగ్ ఏఈ రవీందర్రెడ్డి, గ్రామ సర్పంచ్ జక్క రాఘవేందర్ రెడ్డి, గ్రామ సెక్రటరీ పద్మారెడ్డి, ఉప సర్పంచ్ కాసాని శేఖర్, వార్డు సభ్యులు జిట్టా మౌనిక,గుండు ఉమారాణి, కొత్త ఐలమ్మ, వాసగోని లలిత, ఎల్మినేటిసురేష్ రెడ్డి, గాదె శేఖర్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు ఇల్లును పరిశీలించడం జరిగింది.

# గాలి పటాలకు చైనా మాంజా వాడకండి



**గరిడేపల్లి, జనవరి 7 (జనం సాక్షి) :** గరిడేపల్లి మండల పరిధిలోని ప్రజలు పిల్లలకు సెలవులు ఉన్నందున పిల్లలు ఎంతో ఆనందంగా ఎగురవేసే గాలి పటాలకు చైనా మాంజాను కట్టి ఎగురవేయడం వలన అనేక పక్షలు పశువులు ముఖ్యంగా మోటారు సైకిల్ పై ప్రయాణించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. చైనా మాంజాను విక్రయించడం కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరం అటువంటి వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం నేరమని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జైలు శిక్షతోపాటు పదివేల రూపాయలు జరిమాన విధించే అవకాశం ఉందన్నారు. కోడి పంద్యాలు, జూజం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. సంక్రాంతి సెలవుల్లో మీ కుటుంబంతో మండల ప్రజలు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండాలని అందరికీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హాలియాలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం



**హాలియా, జనవరి 7 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో నల్గొండ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హాలియాలో 'నో హెల్మెట్.. నో పెట్రోల్ల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే ఎదురయ్యే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలపై వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు పెట్రోల్ అందించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంతో వాహనదారుల్లో మంచి స్పందన కనిపించింది.

# ఆర్మడ్ డిఎస్పీ నరసింహచారికి రాష్ట్రస్థాయి పోలీస్ సేవా పతకం

**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 7 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉద్యోగులకు ప్రతిభ అవార్డులను ప్రకటించారు. సూర్యాపేట జిల్లా పోలీస్ ఆర్మడ్ విభాగం నందు పని చేస్తున్న డిఎస్పీ నరసింహచారి పోలీస్ సేవా పతకంకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనను ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# నిబంధనలు పాటించండి



**కోదాడ, జనవరి 7 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమార్ అన్నారు. రోడ్డు భద్రత మహోత్సవంలో భాగంగా బుధవారం కోదాడ పట్టణంలో లారీ అసోసియేషన్ కార్యాలయంలో డ్రైవర్లు, యాజమాన్యాలకు మరియు తేజ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలి తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలకనుగుణంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా పలు రకాల చట్టాలను వివరించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలాని మాట్లాడుతూ డ్రైవర్లు అతివేగాన్ని నియంత్రించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. లారీ యజమానులు తమ వాహనాల ఫిట్నెస్ విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ సోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉయ్యాల నరసయ్య, కోదాడ అసోసియేషన్ అధ్యక్షులు తునాం కృష్ణ, సెక్రటరీ యలమందల నరసయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు పైడిమర్రి వెంకటనారాయణ, ఆవుల రామారావు, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి,లారీ అసోసియేషన్ జానీ, సమ వెంకటరెడ్డి, పెద్ది చంద్రమౌళి, గుండపునేని నాగేశ్వరరావు, విలాస కవి నరసరాజు, పెద్ది అంజయ్య పాఠశాల యాజమాన్యం సంతోష్ కుమార్, జానకి రాములు, సోమ నాయక్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి

**ఖమ్మం, జనవరి 7 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ఆత్మీయ సమావేశం ఖమ్మం పట్టణ అధ్యక్షులు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. భారత దేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం సాకారం చేసే విధంగా పాలన చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. కేసీఆర్ పాలనలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయి అని ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఖమ్మంలో కేటీఆర్ బైక్ ర్యాలీకి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ముగ్గురు మంత్రులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన మన నాయకులు, కార్యకర్తలు వీరుల్లా పోరాడి మన సర్పంచ్ అభ్యర్థులు ను గెలిపించారన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కొన్ని చోట్ల బీఆర్ఎస్ మద్దతు దారులు గెలిస్తే మరల రీకౌంటింగ్‌లు పెట్టి అధికార పార్టీ ఇబ్బందులుకు గురి చేసారని నామ అన్నారు. మంత్రి పదువులు శాశ్వతం కాదని, పుట్టిన నాటి నుండి మంత్రులుగా లేరు అలా అని చచ్చే వరకు ఎవరు మంత్రులు కూడా ఉండరన్నారు. జిల్లా లో ఉన్న మంత్రులు ఎన్ని రాజకీయాలు చేసి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేసిన వారిపై పోరాడి పార్టీ జెండాను గులాబీ శ్రేణులు నిలబెట్టారని తెలిపారు. అధికార అండతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. గత పదిహేడవ లోకసభ లో తాను ఎంపీగా, లోక్ సభ ఫ్లోర్ లీడర్ గా ఉన్నప్పుడు కేసీఆర్ ఆదేశాల మేరకు పార్లమెంట్ సమావేశాలను స్థంభింపజేసి రాష్ట్రానికి సరిపడా యూరియా ను తీసుకువచ్చామని కేసీఆర్ పాలనలో ఏనాడు రైతన్నలు యూరియా కోసం ఇబ్బంది పడలేదన్నారు. కేసీఆర్ ముందు చూపుతో రైతులు ఎరువులు విషయం లో కానీ విద్యుత్ విషయం లో కానీ ధాన్యం కొనుగోలు విషయం లో కానీ ఎక్కడ ఇబ్బందులు పడలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి, సంక్షమం పరుగులు పెట్టాలంటే కేసీఆర్ పాలన రావాలని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ



కార్యక్రమం లో రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డ, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు,హరిప్రియ, చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల కృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ లు ఖమర్, ఉమా మహేశ్వరరావు, దిండిగల రాజేందర్, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, ఉద్యమకారులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయి

**కనగల్లు, జనవరి 7 (జనం సాక్షి) :** క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందించడమే కాకుండా, శారీరక, మానసిక ఉల్లాసాని కలిగిస్తాయని ఎస్సై కే రాజు రెడ్డి అన్నారు. మండలంలోని షాబ్దుల్లాపురం గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బుధవారంఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప శుభ పరిమాణం అని ఇలాంటి పోటీలలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను వెలికి తీసుకోవాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలలో యువత పాల్గొని వారిలో మనోధైర్యాన్ని పెంచుకున్నప్పుడే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసి క్రీడలలో ఉత్సాహంగా ఆడుతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ పోటీల నిర్వాహకులు దాసి రడ్డి నవీన్ రెడ్డి, సర్పంచ్ తంగిరాల అంతయ్య, ఉప సర్పంచ్ కారింగు స్వామి, కేసాని వెంకటరెడ్డి, కోయ ప్రభాకర్ రెడ్డి, కారింగ్ నరేష్, కారింగ్ శంకర్, కాలగ్ సురేష్, నక్క శివ, కోలా అనిల్, రాజు, మల్లికార్జున్, నాగరాజు, అర్జున్, నవీన్, రాంబాబు, స్వామి, జాకత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.






## రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్

### సత్తా చాటిన ఏపీ,తెలంగాణ విద్యార్థులు

రిలయన్స్ ఫౌండేషన్ 2025-26 విద్యా సంవత్సరానికి ప్రకటించిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు.దేశవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఈ రెండు రాష్ట్రాల నుంచి మొత్తం 1,883 మంది విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు.దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 5,100 మంది విద్యార్థుల్లో (5,000 అండర్ గ్రాడ్యుయేట్, 100 పోస్ట్ గ్రాడ్యుయేట్) ఆంధ్రప్రదేశ్ నుంచి 1,345 మంది, తెలంగాణ నుంచి 538 మంది ఉన్నారు. అత్యంత పోటీతో కూడిన జాతీయ స్థాయి ఎంపిక ప్రక్రియలో ఈ ఫలితాలు తెలుగు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి.ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత విద్యను అందించడమే ఈ స్కాలర్‌షిప్‌ల లక్ష్యం. ప్రతిభ మరియు ఆర్థిక స్థితి (మెరిట్-కమ్-మీన్స్) ఆధారంగా ఎంపిక చేసిన వారిలో 83% మంది విద్యార్థులు, వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాల నుంచే రావడం విశేషం. ఇందులో బాలికలు మరియు దివ్యాంగ విద్యార్థులకు కూడా తగిన ప్రాధాన్యం లభించింది.

# రియల్ ఎస్టేట్‌కి పెట్టుబడుల బూస్ట్



**న్యూఢిల్లీ:**రియల్ ఎస్టేట్ రంగంలో ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు (సంస్థాగత) గతేడాది పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. 8.47 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది.2024లో వచ్చిన 6.56 బిలియన్ డాలర్ల కంటే 29 శాతం అధికమని పేర్కొంది. ఇందులో దేశీ పెట్టుబడులు గణనీయంగా పెరగ్గా, విదేశీ పెట్టుబడులు తగ్గాయి. దేశీ ఇన్వెస్టర్ల నుంచి 4.82 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. 2024లో దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు 2.24 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 120 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడులు మాత్రం అంతకుముందు ఏడాదితో పోల్చితే 2025లో 16 శాతం తగ్గి 3.65 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ వివరాలతో కొలియర్స్ ఇండియా ఒక నివేదిక విడుదల చేసింది. సంస్థాగత ఇన్వెస్టర్లలో ఫ్యామిలీ ఆఫీసులు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంక్‌లు, ప్రొప్రయిటరీ బుక్‌లు, పెన్షన్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ, రియల్ ఎస్టేట్ ఫండ్-డెవలపర్స్, ఎన్‌బీఎఫ్‌సీలు, రీట్‌లు, సావరీన్ వెల్త్ ఫండ్స్ ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది."2025లో అధిక శాతం పెట్టుబడులను ఆఫీస్ ఆస్తులు ఆకర్షించాయి. మొత్తం పెట్టుబడుల్లో 54 శాతం (4.53 బిలియన్ డాలర్లు) ఆఫీస్ ఆస్తుల్లోకి వచ్చాయి. ఆ తర్వాత నివాస ప్రాజెక్టులు, పారిశ్రామిక, గోదాముల్లోకి వెళ్లాయి"అని కొలియర్స్ ఇండియా ఎండీ, సీఈవో బాదల్ యాజి&ఙక్ తెలిపారు. 2026లో సంస్థాగత పెట్టుబడులు మరింత బలపడతాయని, అంతర్జాతీయం గా పెట్టుబడులకు రిస్క్ ధోరణి పెరగడం, దేశీ ఇన్వెస్టర్లు ఇందుకు మద్దతుగా నిలవనున్నట్టు పేర్కొంది.

## మూడో రోజూ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు ప్రతికూల ప్రభావం చూపాయి. దీనికితోడు ఎఫ్ఐఐల విక్రయాలు, త్రైమాసిక ఫలితాల సీజన్ వేళ మదుపర్లు అప్రమత్తత పాటించడమూ మరో కారణం. ఆటోమొబైల్, ఆయిల్ గ్యాస్ షేర్లు సూచీలు నష్టాలు చవిచూడగా.. కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లు రాణించాయి.సెన్సెక్స్ ఉదయం 84,620.40 పాయింట్ల (క్రితం ముగింపు 85,063.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరకి 102.20 పాయింట్ల నష్టంతో 84,961.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.95 పాయింట్ల నష్టంతో 26,140.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.87గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.38 డాలర్లు, బంగారం ఔన్సు 4,464.01 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.80 | ₹ 5.82 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,26,750 (22 క్యారెట్లు) | ₹ 1,38,270 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,77,000

## ఐదు ఫెయిల్.. రూ.12తో మొదలై రూ.12వేల కోట్ల సామ్రాజ్యం



**సూరత్(జనంసాక్షి):**సూరత్‌కు చెందిన ఈ వజ్రాల వ్యాపారి సావ్జీ డోలకియా అనగానే అందరికీ గుర్తు వచ్చేది ప్రతి ఏటా తమ ఉద్యోగులకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం. ఖరీదైన కార్లు ఇళ్లు, కార్లు, వజ్రాలు, ఆభరణాలు ఇలా ఎంతో విలువైన బహుమతులతో కేవం తన ఉద్యోగులను మాత్రమే కాదుయావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతారు.కానీ ఇలా ఖరీదైన బహుమతులు వచ్చేంత స్థాయికి రావడానికి వెనుక ఉన్న కృషిని గురించి ఎపుడైనా ఆలోచించారా? ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, అంచెలంచెలుగా ఎదిగి డైమండ్ సామ్రాజ్యాన్ని నిర్మించి, సావ్జీభాయ్‌గా పేరు గడించిన హరి కృష్ణ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఛైర్మన్, సావ్జీ ధోలాకియా సక్సెస్ గురించి తెలుసుకుందాం.గుజరాత్‌లోని దుధాల గ్రామానికి చెందిన ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు సావ్జీ ధోలాకియా. కుటుంబ ఆర్థిక పరిస్తితుల కారణంగా 5వ తరగతిలోనే చదువు ఆపేశారు. అంతేకాదు 1977లో కేవలం 13 ఏళ్ల వయసులోనే , జేబులో 12 రూపాయలు 50 పైసలు (బస్సు టికెట్‌కు సరిపోయే) సూరత్ నగరానికి పయనమయ్యాడు. అప్పటికి ఆయన మనసులో ఉన్నది కుటుంబానికి పోషించుకోవడం మాత్రమే.ఆలా సూరత్ నగరంలో తొలి ఉద్యోగం వజ్రాల కర్మాగారంలో. నెలకు రూ.179 రూపాయల జీతం. ఈ కొద్ది పాటి జీతంలోంచే ఆయన ప్రతి నెలా రూ. 39 పొదుపు చేసేవాడు. 1984లో తనకంటూ ఏదైనా సాధించాలనే కల మొదలైంది. ఈ కల సాకారానికి పట్టుదల ఓర్పుతోడైంది. తన సోదరులతో కలిసి, అతను 'హరి కృష్ణ ఎక్స్‌పోర్టర్స్' అనే చిన్న వజ్రాల వ్యాపారాన్ని ప్రారంభించాడు. వజ్రాల వ్యాపారం రిస్క్ తో కూడుకున్నది, పైగా పోటీ. దీంతో మొదట్లో వ్యాపారం చాలా కష్టమయ్యేది. కానీ ప్రజలపై సావ్జీభాయ్‌కి నమ్మకం వమ్ముకాలేదు. దీనికి తోడు ఉద్యోగులకు కార్మికుల్లాగా కుండా, తన ఇంట్లో మనుషుల్లాగా చూసుకునవాడు. అటు ఉద్యోగుల మనసుల్లోనూ, ఇటు వ్యాపారంలోనే అందనంత ఎత్తుకు ఎదిగాడు.ఉద్యోగులకు బోనస్‌లు ఇవ్వడం మాత్రమే కాదు, ఖరీదైన దీపావళి కానుకలిస్తూ సావ్జీభాయ్ ధోలాకియా వార్తల్లో నిలిచారు. ఆయన నమ్మింది ఒకటే. తన ఉద్యోగులకు బావుంటే.. కంపెనీ బావుంటుంది..వారి అభివృద్దే తన వ్యాపారం అభివృద్ధి అని. అదే నమ్మకం నేటికీ కొనసాగుతోంది. 2025లో కూడా 3 కోట్ల రూపాయలకు పైగా విలువైన మూడు బ్రాండ్ న్యూ మెర్సిడెస్-బెంజ్ ఉబూ ాజఉలను కానుకగా ఇచ్చాడు. పాతికేళ్ళనుంచి తన కంపెనీలో సేవలందిస్తున్న నమ్మకమైన జట్టు సభ్యులు, ముగ్గురు సీనియర్ ఉద్యోగులకు బహుమతిగా ఇచ్చాడు. సావ్జీభాయి దృష్టిలో ఇటువంటి బహుమతులు అంటూ దుబారా కాదు, జీవితాంతం కలిసి చేసిన కృషికి, విజయానికి హృదయపూర్వక 'ధన్యవాదాలు'అంటారాయన.ఈ ప్రత్యేకమైన లక్షణమే ఒక చిన్న వర్క్‌షాప్‌గా మొదలైన ఆయన కంపెనీ ప్రపంచ వజ్రాల శక్తి కేంద్రంగా నిలిపింది. ఆభరణాల బ్రాండ్ 'కిస్నా వ్యాపారం ఇప్పుడు రూ. 12,000 కోట్లకు పైమాటే.. 2022లో, భారత ప్రభుత్వం సావ్జీభాయ్ ధోలాకియాను గుజరాత్‌లో సామాజిక సేవలో ఆయన చేసిన విశిష్ట సేవకు గాను దేశంలోని అత్యున్నత పౌర అవార్డులలో ఒకటైన పద్మశ్రీతో సత్కరించింది. బిలియనీర్ ,పద్మశ్రీ అవార్డు గ్రహీత సావ్జీభాయ్ ఇప్పటికీ చాలా సాదా సీదాగా ఉండే వ్యక్తి. ధోలాకియా 1996లో హరి కృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. దాన్నే ధోలాకియా ఫౌండేషన్ అని పిలుస్తారు. దీని ద్వారా అనేక కార్యక్రమాలతోపాటు, చెట్లను నాటడం, నీటిని ఆదా చేయడం , భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని రక్షించడం కోసం కోట్లు ఖర్చు చేయడం విశేషం. మొక్కవోని పట్టుదల, అచంలమైన విశ్వాసంతో సాగిన ఆయన జీవితం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తున్నారు."గ్రాఫిటీలో కూడా మహిళలకు భద్రతలు లేదు" అంటూ విజువల్స్‌తో పాటు ఒక యూజర్ ట్విటర్లో షేర్ చేశారు, దీనిపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో తీవ్ర విమర్శలు చెలరేగాయి.ఇది మనుషుల్లో కొరవడుతున్న సివిక్ సెన్స్, మహిళల భద్రత,ప్రజా కళను విధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తమైంది. పబ్లిక్ ప్రాపర్టీని విధ్వంసం చేయడం మాత్రమే కాదు, మహిళలను అగౌరవపరిచే తీవ్రమైన కేసు, దోషులపై చర్య తీసుకోవాలని చాలామంది నెటిజన్లు డిమాండ్ చేశారు. ఇది చౌకబారు ఆలోచన అని కొందరు అభివర్ణించారు. ఆడవారి దుస్తులను కాదు ఈ పైత్యాన్ని ప్రశ్నిద్దాం మరికొందరు వ్యాఖ్యానించారు. మొత్తంగా ఈ చర్య మహిళల పట్ల అగౌరవానికి, స్మార్ట్‌సిటీ హోదాకు భంగకరమనే ప్రజాగ్రహానికి దారితీసింది.మరోవైపు ఈ విధ్వంసం ఎప్పుడు జరిగింది, ఎవరు బాధ్యులు, లేదా స్థానిక అధికారులతో ఏదైనా ఫిర్యాదు నమోదైనా అనే దానిపై అధికారిక ధృవీకరణ లేదు. అలాగేదీనిపై గ్వాలియర్ మున్సిపల్ పరిపాలన లేదా పోలీసులు ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు.

# బిహార్ రాజకీయాల్లో కలకలం

## చీలిక దిశగా ఆర్‌ఎల్‌ఎం



**పట్నా:**బిహార్‌లోని ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) పార్టీ చీలిక దిశగా పయనిస్తోంది. ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేల్లో ముగ్గురు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.ఆర్‌ఎల్‌ఎం అధినేత ఉపేంద్ర కుష్వాహ్ తన కుమారుడు దీపక్ ప్రకాశ్‌కు మంత్రి పదవి కట్టబెట్టడంతో వీరంతా రగిలిపోతున్నారు. శాసనస భ్యుడు కాకపోయినప్పటికీ తన కుమారుడిని నితీశ్ కుమార్ కేబినెట్‌లో కూర్చొబెట్టడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపేంద్ర కుష్వాహ్ తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెడుతున్నారని, తమకు ఏమీ చేయడం లేదంటూ మండిపడుతున్నారు.ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏతో జట్టు కట్టిన ఆర్‌ఎల్‌ఎం ఆరు స్థానాల్లో పోటీ చేసి నాలుగు చోట్ల విజయం సాధించింది. దినారా నుంచి అలోక్ కుమార్ సింగ్, బజ్‌పట్టి నుంచి రామేశ్వర్ మహతో, మధుబని నుంచి మాధవ్ ఆనంద్ గెలిచారు. ఉపేంద్ర కుష్వాహ్ భార్య స్నేహలత.. ససారం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. పొత్తులో భాగంగా నితీశ్ కేబినెట్‌లో ఆర్‌ఎల్‌ఎంకు దక్కిన మంత్రి పదవిని అనూహ్యంగా తన కుమారుడికి కట్టబెట్టారు కుష్వాహ్. స్నేహలత మంత్రి అవుతారని అంతా అనుకున్నారు. కానీ ఊహించని విధంగా కుమారుడిని తెరపైకి తెచ్చారు. కనీసం ఎమ్మెల్యే కూడా కానీ కొడుకుని మంత్రిని చేయడంతో మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలు ఖిన్నులయ్యారు. ఈ నేపథ్యంలో తిరుగుబాటు జెండా ఎగురవేశారు.తాజాగా కుష్వాహ్ ఏర్పాటు చేసిన లిట్టి చోఖా విందుకు ఆర్‌ఎల్‌ఎం ముగ్గురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. అదే సమయంలో బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను (ఔతిబితిని ఔజీఎతిని) కలిశారు. ఆ తర్వాత అదే రోజు ఆనంద్, మహతో బీజేపీ నాయకులను కలవడానికి ఢిల్లీకి వెళ్లి కుష్వాహ్‌కు షాకిచ్చారు. దీంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు బీజేపీలో జంప్ అవుతారనే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే మర్యాదపూర్వకంగానే నబీన్‌ను కలిశామని ఎమ్మెల్యే మాధవ్ ఆనంద్ మీడియాతో చెప్పారు. కుష్వాహ్ కుటుంబ రాజకీయాలను వ్యతిరేకిస్తున్నామని కుండబద్దలు కొట్టారు. పార్టీకి విధేయంగానే ఉంటామని చెప్పుకొచ్చారు.

**మర్యాదపూర్వక భేటీ**

"రాజకీయాల్లో వారసత్వాన్ని ప్రోత్సహించడం కుష్వాహ్‌కు ఆత్మహత్యాసదృశమైన చర్య. ఎందుకంటే ఆయన రాజ్యసభ ఎంపీ, ఆయన భార్య ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడికి మంత్రి కట్టబెట్టారు. పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా, ఒకే కుటుంబంలోని ముగ్గురు పదవులు తీసుకోవడాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. అయితే మేము పార్టీని వీడాలని అనుకోవడం లేదు. నబీన్‌ను కలవడం కేవలం మర్యాదపూర్వక భేటీ. కుష్వాహ్ కూడా ఆయనను కలిశార"ని ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు.

**నిరసన తెలిపాం**

తన కుమారుడి మంత్రి పదవి విషయంలో ఉపేంద్ర కుష్వాహ్ ఏకపక్షంగా వ్యవహరించారని మరో ఎమ్మెల్యే రామేశ్వర్ మహతో విమర్శించారు. "కుష్వాహ్ గతంలో వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించారు. అకస్మాత్తుగా, ఆయన ఆ విషయాన్ని మర్చిపోయారు. తన కొడుకును మంత్రిని చేసే ముందు ఆయన మమ్మల్ని సంప్రదించలేదు. మేము పార్టీతోనే ఉన్నాం. నబీన్‌ను కలిసినంత మాత్రాన మేము బీజేపీలో చేరుతున్నామని కాదు. మా నిరసన తెలియజేయాలనే కుష్వాహ్ విందుకు హాజరుకాలేదు. మేం ముగ్గురు ఎమ్మెల్యేలం ఒకే మాట మీద ఉన్నాం. తదుపరి కార్యాచరణపై ఇంకా ఏమీ అనుకోలేదు. పార్టీని వీడాలా, ఉండాలా అనే దానికి నిర్ణయం తీసుకోలేద"ని ఎమ్మెల్యే మహతో తెలిపారు.

**స్పందించని కుష్వాహ్**

తమ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేశారని వస్తున్న వార్తలపై ఉపేంద్ర కుష్వాహ్ స్పందించలేదు. ఈ వ్యవహారాన్ని పెద్దదిగా చూపిస్తున్నారని ఆర్‌ఎల్‌ఎం పార్టీ వర్గాలు వ్యాఖ్యానించారు. త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయని పేర్కొన్నాయి. సీనియర్ నేత జితేంద్ర నాథ్‌తో సహా ఏడుగురు నాయకులు పార్టీని వీడిన నెల రోజులకు తాజా పరిణామామం చోటు చేసుకోవడం గమనార్హం. ఉపేంద్ర కుష్వాహ్ తన కుమారుడికి మంత్రి కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వీరంతా పార్టీ నుంచి వెళ్లిపోయారు.

**బీజేపీ, జేడీయూ స్పందన**

ఆర్‌ఎల్‌ఎంలో తిరుగుబాటుపై బీజేపీ ఆచితూచి స్పందించింది. ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని బీజేపీ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. అటు జేడీయూ కూడా నర్మగర్భ వ్యాఖ్యలు చేసింది. తన వర్గాన్ని ఎలా ఐక్యంగా ఉంచుకోవాలో హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) అధినేత జితన్ రామ్ మాంఝీని చూసి కుష్వాహ్ నేర్చుకోవాలని జేడీయూ నాయకుడు ఒకరు సలహాయిచ్చారు. కాగా, బిహార్‌లో ఖాళీ అవుతున్న 5 రాజ్యసభ స్థానాల్లో తమకు ఒకటి ఇవ్వాలని మాంఝీ డిమాండ్ చేస్తున్నారు.

**తిరుగుబాట్లు కొత్తకాదు**

ఉపేంద్ర కుష్వాహ్‌కు తిరుగుబాట్లు ఎదుర్కోవడం కొత్తేమీ కాదు. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆర్‌ఎల్‌ఎం పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ జేడీ(యూ) పార్టీలో చేరినా.. ఆయన తన ఆధిపత్యాన్ని కోల్పోకుండా నిలుపుకున్నారు. తాజాగా తలెత్తిన సంక్షోభాన్ని ఆయన ఎలా ఎదుర్కొంటారనే దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.



## హ్యాట్రిక్ కొట్టేసిన పసిడి, వెండి

**దేశంలో బంగారం, వెండి ధరలు మరింతభగ్గుమన్నాయి. వరుసగా మూడోరోజూ ఎగిశాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమొడిటీ మార్కెట్లపైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు మరింతగాపెరిగాయి. వెండి ధరలు అయితేఅత్యంతభారీగాదూసుకెళ్లాయి.**

## ఫిబ్రవరి 1నే బడ్జెట్

28వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు, రెండోవిడత సమావేశాలు మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీన ఆదివారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్ట నున్నారు. ఇటీవలికాలంలో కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి అని తెలుస్తోంది. ఈనెల 28న పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఈనెల 29న ప్రభుత్వం ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనుంది. అయితే ఒకప్పుడు ఫిబ్రవరి నెల చివరి రోజు బడ్జెట్ ప్రవేశపెట్టే సంప్రదాయం ఉండేది. అయితే దాన్ని 2017లో ఫిబ్రవరి 1కి మార్చారు. అయితే, ఈ సారి ఫిబ్రవరి నెలలో మొదటి తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ ప్రవేశపెట్టే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్టాక్ మార్కెట్ సహా ఇతర ఆర్థిక కార్యకలాపాలేవీ ఆ రోజు జరగవు. దీంతో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ ఏమైనా మారుస్తారా? అన్న విషయంపై చర్చ జరుగుతోంది. అయితే, ఈ తేదీ మార్చకూడదని ప్రభుత్వం భావిస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.మరోవైపు జనవరి 30, 31 తేదీల్లో సెలవులు రానున్నాయి. రెండో దశ సమావేశాలు మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే అవకాశం ఉంది. వరుసగా తొమ్మిదోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టను న్నారు. అత్యధికంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా మొరార్జీ దేశాయ్ రికార్డు ఉంది. ఆయన రెండు దఫాల్లో 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు

### 16 అంతస్తుల బిల్డింగ్‌పై నుంచి పడి
## టెకీ దుర్మరణం

**బెంగళూరు(జనంసాక్షి):**

బెంగళూరులో భవనం 16వ అంతస్తు నుంచి పడి టెకీ (26) దుర్మరణం పాలయ్యాడు. విదేశాల్లో విద్య పూర్తి చేసుకొని వచ్చి, ఉద్యోగాన్వేషణలో ఉండగా ఈ విషాదం చోటు చేసకుంది.ఐరోపాలో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లో తన విద్యను పూర్తిచేసిన నిక్షప్ ఇటీవలే ఇండియాకు తిరిగి వచ్చాడు. బెంగళూరులోని శెట్టిహళ్లిలోని ప్రిన్స్ టౌన్ అపార్ట్‌మెంట్స్ భవనం 16వ అంతస్తు నుండి పడి మరణించాడు. కొన్ని రోజులుగా హసరఘట్టలోని గౌడియ మఠంలో ఉంటున్నట్టు సమాచారం.బుధవారమే తన తల్లిదండ్రులు కిషోర్, జయశ్రీల వద్దకు వచ్చాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై గలగుంటె పోలీస్ స్టేషన్ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. అయితే మృతుడు గత కొన్నేళ్లుగా గా స్కిజోఫ్రెనియాతో బాధపడుతున్నాడని తండ్రి పోలీసులకు తెలిపారు. మరణానికి దారితీసిన పరిస్థితులపై తాము దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు

## వివస్త్రను చేసి దూషించారు

### కర్ణాటక పోలీసులపై బీజేపీ మహిళ కార్యకర్తసంచలన ఆరోపణలు

బెంగళూరు : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో కర్ణాటకలోని బీజేపీ మహిళపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి.తన ప్రాంతంలో ఓటర్ల జాబితా నిర్వహించడానికి వచ్చిన ప్రభుత్వ అధికారులు తన పట్ల దారుణంగా ప్రవర్తించారని వివస్త్రను చేశారని మహిళా కార్యకర్త ఆరోపించారు. సోమవారం తనను అరెస్టు చేసిన పోలీసు సిబ్బంది తనను కొట్టి, బలవంతంగా బట్టలు విప్పించారని ఆమె ఆరోపించారు. అయితే దీనిపై పోలీసల వాదన మరో ఉంది. కర్ణాటకలోని హుబ్బళ్లిలో ఈ వివాదం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే...బీజేపీ కార్యకర్త సుజాత హండి, చాలుక్య నగర్ ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఎస్ఐఆర్ సర్వే సందర్భంగా ఘర్షన చోటుసుకోడంతో ఆమెను అరెస్టు చేస్తున్నప్పుడు , పురుష పోలీసులు తనపైదాడిచేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ, అభ్యంతరకరంగా ప్రవర్తించారని బాధితురాలి ఆరోపణ. ఈ సంఘటనకు సంబంధించిన రెండు వీడియోలు వైరల్ అయ్యాయి.వాటిలో ఒకదానిలో హండిని పోలీసు వ్యాన్‌లోకి తీసుకెళు న్న దృశ్యాలకు సంబంధించింది.మరోవైపు సుజాత ఆరోపణలు పోలీసులు తీవ్రంగా ఖండించారు. పోలీసులు ఆమెతో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణ పూర్తిగా అవాస్తవం అన్నారు. అయితే, సుజాత అరెస్టును ప్రతిఘటించి, అధికారులతో దురుసుగా ప్రవర్తించిందని పోలీసులు పేర్కొన్నారు. దీంతో భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 307 తో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**ఆమే చింపేసుకుంది..**

అధికారులు నిర్వహిస్తున్న సర్వే సమయంలో స్థానికుల మధ్య విభేదాలు తలెత్తి, అది ఘర్షణకు దారితీసింది. పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు, వాగ్వాదాలు జరిగాయి, భౌతిక దాడులకుదిగారని పోలీసులుత ఎలిపారు.దీనిపై స్థానికుడు ప్రశాంత్ బొమ్మాజీ ఫిర్యాదు ఆధారంగా ఆమెను అరెస్టు జరిగినట్లు చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, సోమవారం ఎనిమిది నుండి పది మంది మహిళా అధికారులతో కలిసి హండిని అరెస్టు చేయడానికి వెళ్లారని, ఈ క్రమంలో నిందితురాలు పోలీసు వ్యాన్‌లోకి తీసుకెళ్తున్నప్పుడు ఆమే తన బట్టలు తీసేసిందని శశికుమార్ చెప్పారు. అక్కడున్న మహిళా అధికారులు ఆమెకు మరో జత బట్టలు అందించడానికి స్థానికుల సహాయం కోరారని, ఆమెను బట్టలు వేసుకోమని పదేపదే కోరామని చెప్పారు. అలాగే నిందితురాలు సుజాతపై గత ఐదేళ్లలో తొమ్మిది కేసులు నమోదయ్యాయన్నారు. ఐదు గత ఐదేళ్లవి కాగా, నాలుగు ఈ సంవత్సరానికి చెందినవి. ఈ నాలుగింటిలో మూడు ప్రజలు దాఖలు చేసినవి, ఒకటి పోలీసు దాఖలు చేసినట్టు వివరించారు.సుజాత అరెస్ట్‌పై కమిషనర్ స్పందిస్తూ, అరెస్టు సమయంలో, ఆమె తన అనుచరులతో కలిసి పోలీసులను తీవ్రంగా ప్రతిఘటించి ఘర్షణకు దిగిందనీ, సబ్-ఇన్‌స్పెక్టర్, ముగ్గురు నలుగురు పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారనీ, విధులను నిర్వర్తించకుండా అడ్డుకున్నారని ఆయన చెప్పారు.బాధితురాలి సోదరి మాట్లాడుతూ మా ఇంటి బయట కూర్చుని ఉండగా, సుమారు 30 మంది పోలీసులు వచ్చి సుజాతతోపాటు అందర్నీ లోపలికి తీసుకెళ్లారు. సుజాతపై దారుణంగా దాడి చేశారు, ఆమె బట్టలు చింపేశారు. మహిళా, పురుష పోలీసు అధికారుతొద్దరూ ఉన్నారు, మమ్మల్ని వదిలేయమని వేడుకున్నాం అయినా పోలీసులు సుజాతను ఈడ్చుకెళ్లారు." అని బాధితురాలి సోదరి విజయలక్ష్మి తెలిపింది. ఈ ఘటనపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా లోకానికే తీరని అవమానమని, సంబంధిత లీసులను వెంటనే సస్పెండ్ చేయాలని స్థానిక నేతలు డిమాండ్ చేశారు.

### శబరిమలలో నెయ్యి అమ్మకాలలో అవకతవకలు..
## ఏకంగా 16 లక్షలు

**పథనంతిట్ట:** శబరిమల ఆలయంలో బంగారం చోరీ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ జరుపుతుండగా మరో చోరీ వెలుగు చూసింది. ఈసారి 'ఆదియ శిష్టం నెయ్యి' (నెయ్యాభిషేకం నైవేద్యం నుంచి మిగిలిపోయిన నెయ్యి) అమ్మకంలో అక్రమాలు బయటపడ్డాయి. సాధారణంగా నెయ్యభిషేకానికి అవకాశం లేని యాత్రికులు ఈ ఆదియ శిష్టం నెయ్యిని కొనుగోలు చేస్తారు.దీనిని వంద మిల్లీలీటర్ల పౌచ్‌లలో విక్రయిస్తారు. దీని ధర ప్యాకెట్‌కు రూ. 100. దేవస్వం విజిలెన్స్ దర్యాప్తులో సుమారు రూ. 16 లక్షల విలువైన 16 వేల నెయ్యి ప్యాకెట్లు మాయమైనట్లు తేలింది. సాధారణంగా ఆలయ ప్రత్యేక అధికారి స్టాక్‌ని స్వీకరించి సంబంధిత కౌంటర్లకు అమ్మకానికి అప్పగిస్తారు. అయితే అందుకున్న ప్యాకెట్లకు చెల్లించాల్సిన మొత్తం దేవస్వం ఖాతాకు జమ అవ్వలేదని విజిలెన్స్ తనిఖీలో బయటపడింది.

## నలంద పాఠశాలకు రాష్ట్రస్థాయి ర్యాంకులు



**ఆర్మూర్, జనవరి 7 (జనంసాక్షి) :** ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద పాఠశాలలో ఇటీవల ఈ – అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన రామన్ సైన్స్ మహోత్సవ్ – ఐఐటి పరీక్షలో నలంద పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పి.చిన్మయి రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు,7వ తరగతి విద్యార్థిని_. రాజశ్రీ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు,6వ తరగతి విద్యార్థులు ఎస్.సన్విత్త,.గంగ శంకర్,ఎం. హర్షవర్ధన్, పి.యువరాజ్, జి.మనుష్,ఏ.అక్విల్ రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ విద్యార్థిని,విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి మార్గదర్శకత్వం అందించిన ఐఐటి సైన్స్ ఉపాధ్యాయులు నిఖిలా, భాను,రాజశేఖర్ లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

### పారమిత హెరిటేజ్ పాఠశాలకు సిబిఎస్ఇ బోర్డు నుండి

## ఆర్యభట్ట గణితఛాలెంజ్‌లో అరుదైన గౌరవం

### విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 07 (జనంసాక్షి) :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎద్యుకేషన్ (సి.బి.ఎస్.ఇ) బోర్డు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే "ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ పోటీలలో 2025–26 విద్యా సంవత్సరంలో భారతదేశ వ్యాప్తంగా 5 లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రతీ రీజియన్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 100 మంది విద్యార్థులను ఎంపిక చేయగా , విజయ వాడ రీజియన్ స్థాయిలో పారమిత హెరిటేజ్ పాఠశాల కు చెందిన ముగ్గురు 10వ తరగతి విద్యార్థులు సి.హెచ్ వెంకట మోక్షత్, సి.హెచ్ శ్రీశాంత్_. అగస్త్య విశ్రుత్ లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మొదటి 100 మంది విద్యార్థుల జాబితాలో స్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ తెలిపారు . పాఠశాలకు సి.బి.ఎస్.ఇ బోర్డు నుండి ఇలాంటి గౌరవం దక్కడం మూడవ సారి కావడం విశేషం అన్నారు. కరీంనగర్ జిల్లా నుండి ఎంపికైన నలుగురు విద్యార్థులలో ముగ్గురు పారమిత విద్యార్థులు ఉండటం గమనార్హం. బుధవారం రోజు కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఘనత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, పాఠశాల సిబ్బందిని, జిల్లా పాలానధికారి పమేలా సత్పతి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘనత దక్కడం ఎంతో గర్వ కారణమని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు తెలిపారు. పాఠశాలకు ఇలాంటి గౌరవం లభించడం పట్ల డైరెక్టర్లు రశ్మిత, అనుకర్ రావు, ప్రసూన, వినోదరావు, వి.యు.యం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, గైడ్ టీచర్ ఇ.సంపత్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## కేటీఆర్‌ను సిరిసిల్ల మానేరు ఒడ్డున ఉరితీయాలి

### రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి నీకు లేదు
### నేరెళ్ల దళితులను ఇసుక లారీతో గుద్ది చంపించావు
### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 07 (జనంసాక్షి) :** రాహుల్ గాంధీని, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. ఉరితీయాల్సింది రాహుల్ గాంధీని కాదని, మానేరు ఇసుకను పందికొక్కులా తిని వేలకోట్లు సంపాదించిన కేటీఆర్‌నే మానేరు నది ఒడ్డుకు ఉరితీయాలని నరేందర్ రెడ్డి అన్నారు. నేరెళ్ల దళిత బిడ్డలను కేటీఆర్ ఇసుక లారీలతో గుద్దించారని, తెలంగాణ సంపదను చెరపట్టారని అందుకే కేటీఆర్‌నే ఉరితీయాలని ఆయన అన్నారు. రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని, విమర్శించే స్థాయి కేటీఆర్ కు ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన జరుగుతుంటే చూసి ఓర్వలేక కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్, కేసిఆర్ కుటుంబ బండారాన్ని, వేలకోట్ల అవినీతి సామ్రాజ్యాన్ని ఆ ఇంటి ఆడబిడ్డ కల్వకుంట్ల కవితనే బయట పెడుతోందని నరేందర్ రెడ్డి అన్నారు. కల్వకుంట్ల కవిత ఆరోపణలకు సమాధానం చెప్పకుండా కేటీఆర్ మతితప్పి మాట్లాడుతున్నారని, పదేళ్ల పాలనలో ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ లు ఇల్లు ఇవ్వలేదని, హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, అలాంటి కేటీఆర్ తమను విమర్శిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరు దగ్గర పెట్టుకోకపోతే కేటీఆర్‌కు గుణపాఠం చెప్తామని, ఎక్కడ దొరికితే అక్కడ ఉరికిచ్చి కొడతామని, కాంగ్రెస్ కార్యకర్తల దెబ్బల రుచి చూడాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇవ్వాలని ప్రజలు కేసీఆర్ ను గెలిపిస్తే, జీతం తీసుకుని ఫామ్ హౌస్ లో పడుకుంటున్నారని, అందుకేనా జనం గెలిపించిందని ఏద్దేవా చేశారు. అసలు కేకే మహేందర్ రెడ్డి సీటును సిరిసిల్లలో కేటీఆర్ లాక్కొని అత్తెసరు మెజారిటీతో తొలిసారి ఎమ్మెల్యే అయ్యాడని, అలాంటి కేటీఆర్ కు రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని అన్నారు. ఇంకోసారి ఇలాగే మాట్లాడితే కేటీఆర్ కు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

## లూయి బ్రెయిలీ లిపి కాదు.. అంధుల ఆశాజ్యోతి

### అంధుల అక్షర ప్రదాత డాక్టర్ లూయి బ్రెయిలీ 217వ జయంతి



**నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ కు సమీపంలో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అందుల వనరుల కేంద్రం ఆవరణలో అంధుల జీవనజ్యోతి, అక్షర ప్రదాత, బ్రెయిలీ లిపి నిర్మాత డాక్టర్ లూయి బ్రెయిలీ217వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షమ అధికారిని రసూల్ బి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ మరియు నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లూయి బ్రెయిలీ ఒక లిపి కాదని అందుల ఆశాజ్యోతిగా మహొన్నత మార్గానికి శ్రీకారం చుట్టారని వారు పేర్కొన్నారు. అందుల అభ్యున్నతికి అందత్వమనేది ఒక అడ్డు కాదని వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారిలో ఆత్మవిశ్వాసం కల్పించే దిశగా తన తండ్రి ప్రోత్సాహం ద్వారా లిపిని తయారు చేయడం జరిగిందని తెలిపారు. స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య, స్నేహ సొసైటీ ఉపాధ్యాయ సిబ్బంది, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతి ఒక్కరి సహకారంతో స్నేహ సొసైటీ దివ్యాంగ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినట్టు, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకున్నట్టు తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య దృష్టికి దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకొచ్చారు. అందుకు అనుగుణంగా వెంటనే స్పందించిన పోలీస్ కమిషనర్ వారి సమస్యలకు అలాగే దివ్యాంగులకు ప్రజలకు ఉపయోగపడే మంచి ఆలోచన సంతోషకరమన్నారు. స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య అందుల వనరుల కేంద్రంలో ఉన్న వసతులు, దివ్యాంగ విద్యార్థుల ఉన్నతి కోసం కావాల్సిన సౌకర్యాలను జిల్లా సంక్షేమ అధికారిని దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బి ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల్లో రాణించడం దివ్యాంగుల ఉన్నతికి నిదర్శనం అన్నారు. కంప్యూటర్ శిక్షణను ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ అంధుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, అర్బన్ సిడిపిఓ సౌందర్య, అంద ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయన్న, వీసీఈఏ అధ్యక్షుడు సాగర్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆరోగ్య రాజు, 100 నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇలియాజుద్దీన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీ సాయి చైతన్య స్నేహ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంధ విద్యార్థిని రజిని స్నేహ సొసైటీ పాఠశాలకు 50వేల విలువైన క్లాస్ రూమ్ బెంచీలను విరాళంగా అందించారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా
## నూతన ఆవిష్కరణలు జరగాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 7 (జనంసాక్షి) :** 53వ బాల వైజ్ఞానిక ప్రదర్శిని, ఇన్‌స్పైయిర్ మనక్ ప్రదర్శనలను నేడు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అబ్దుల్ కలాం ప్రాంగణం విద్యానికేతన్ హై స్కూల్ నందు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగళి శ్రీపాల్ రెడ్డి, పలువురు నాయకులు, ఎస్‌సిఆర్ టి డైరెక్టర్ రమేష్, ఆర్జెడి సత్యనారాయణ అతిధులుగా పాల్గొన్నారు. ముందుగా స్వాగత ఉపన్యాసం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ గత 15 రోజులుగా 27 కమిటీలలో ఉపాధ్యాయులను ప్రతి కమిటీకి గెజిటెడ్ అధికారిని కన్వీనర్‌గా నియమించి ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా నిరంతరం సమీక్షస్తూ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ కామారెడ్డిలో జరగడానికి సహకరించిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ సహాయంతో స్కై వాచ్ క్లబ్బులు ఇస్రో పర్యటనలు ఇన్నోవేషన్ల కొరకు ప్రోత్సాహకాలు వంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించడంలో సైన్స్ ఫెయిర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ మాట్లాడుతూ పూర్వ విద్యా విధానం కన్నా విద్యావ్యవస్థ బలపడాలంటే తప్పక నూతన వరబడెలైనటువంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాస్త్ర సాంకేతిక రంగాలలో సాటిలైట్ టెక్నాలజీ హైడ్రోజన్ ఎనర్జీ వంటి నూతన విధానాలకు ప్రేరణ కల్పించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని అలాంటి ఆవిష్కరణలనే విద్యార్థులు చేసేలా ప్రోత్సహించాలని అప్పుడే నూతన భారతం నిర్మితమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులలో సృజనాత్మకత ప్రతి ఒక్క విద్యార్థుల్లోనూ ఉంటుందని దానిని వెలికి తీసి సరైన మార్గంలో వారికి మార్గ నిర్దేశం చేయడమే సైన్స్ ఉపాధ్యాయులుగా కర్తవమని గౌరవ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ రెడ్డి ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేశారు. భ్రుత్వ ముఖ్య సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి తన వద్దనే శాఖను ఉంచుకోవడం విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నటువంటి ప్రాధాన్యతను తెలియపరుస్తుందని తెలియజేశారు. తర్వాత మాట్లాడిన పెద్దలు మహమ్మద్ అలీ షబ్బీర్ తన చదువుకున్న పాఠశాల నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలను ఎస్డీఎఫ్ నిధుల నుండి ప్రత్యేకంగా కేటాయించబడినవని, వచ్చే విద్యా సంవత్సరానికల్లా నూతన ప్రాంగణాన్ని బాలుర ఉన్నత పాఠశాల కామారెడ్డి నందు నిర్వహించుకోబోతున్నామని తెలియజేసినారు.

## నూతన పరిశోధనలకు కామారెడ్డి
## సైన్స్ ఫెయిర్ వేదిక కావాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 7 (జనంసాక్షి) :** కామారెడ్డి లోని అబ్దుల్ కలాం ప్రాంగణం విద్యానికేతన్ హై స్కూల్ నందు నిర్వహిస్తున్నటువంటి ఇన్స్పైర్ మనకు అవార్డ్స్ మరియు 53వ రాజ్యస్తరీయ బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని ఏర్పాట్లను గౌరవ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘం సందర్శించి సమీక్షంచడమే కాక పలు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుండి 887 ప్రదర్శనలు సైన్స్ ఫెయిర్ కు రానున్న సందర్భంగా ఏడు సత్యంస్లో వారేగా వర్గీకరించి వాటికి రూములను కేటాయించి తగు ఏర్పాట్లను చేశారు. ప్రతి ఒక్క విభాగానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ మొత్తం 27 విభాగాలలో కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులకు విజ్ఞాన శాస్త్ర అభిమానులకు భావితరాల సైంటిస్టులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ముఖ్యంగా మంచినీటి వసతిని, భోజన వసతిని సౌకర్యవంతంగా ఉంచాలని భావిశాస్త్రవేత్తలకు అనుగునమైనటువంటి వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తించి రాబోవు తరాలకు సౌకర్యమంతమైనటువంటి పరిశోధనలు చేసే దిశగా వారి ఆలోచన దృక్పథన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం జరిగే కార్యక్రమమే అయినప్పటికీ ప్రస్తుతం ఆధునికత ర్లైట్ వేగంతో దూసుకుపోతున్న తరుణంలో నూతన ఆవిష్కరణల ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా కామారెడ్డి సైన్స్ ఫెయిర్ కేంద్ర బిందువు కావాలని ఆకాంక్షించారు.

## ఇంటి పన్ను పక్కాగా వసూలు చేయాలి

### డీపీవో వీర బచ్చయ్య



**ముత్తారం, జనవరి 07(జనంసాక్షి) :** ఇంటి పన్నులు పక్కాగా వసూలు చేయాలని పెద్దపెల్లి జిల్లా పంచాయతీ అధికారి విరబుచ్చయ్య తెలిపారు.ముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడివో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు నేటి నుండి ఆర్థిక సంవత్సరంలోపు పూర్తి స్థాయిలో ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. త్వరలో జరగబోయే సోషల్ ఆడిట్ నివేదికలను కూడా సిద్ధం చేయాలని చెప్పారు.గ్రామాలలో నీటి సరఫరా పరిశుద్ధ పనుల సమస్య లపైన ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని తెలిపారు.గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు వాడవాడ తిరుగుతూ పర్యవేక్షణ చేసి సమస్యలు లేకుండా చర్య చేపట్టాలని ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్,ఎంపీఓ తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తనుగుల సమ్మక్క,సారలమ్మ జాతర కమిటీ చైర్మన్‌గా బుర్ర శ్రీనివాస్ గౌడ్



**జమ్మికుంట, జనవరి 7 (జనంసాక్షి) :** జమ్మికుంట మండలంలోని తనుగుల సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ చైర్మన్‌గా బుర్ర శ్రీనివాస్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం తనుగుల, గంద్రపల్లి, శంబునిపల్లి గ్రామాలకు చెందిన సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ సభ్యులు గద్దెల వద్ద సమావేశమై మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తనుగులకు చెందిన బుర్ర శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్‌గా బత్తుల పాండు ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో జాతర కమిటీ సభ్యులు,మూడు గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్ హోం భవనం వేగవంతం చేయాలి

### నిర్మాణ పనులను, వృద్ధుల ఆశ్రమం సందర్శించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**తంగళ్ళపల్లి, జనవరి – 07 (జనంసాక్షి) :** చిల్డ్రన్ హోం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆద్వర్యంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ హోం నిర్మాణ పనులను ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణ ప్లాన్, పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.


**త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలకు తీసుకువెళ్ళండి**

తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమాన్ని ఇంచార్జి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ముందుగా ఆవరణ, వసతి గదులు, వంట గది, సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రతి రోజూ అల్పాహారం, భోజనం, ఆరోగ్య అంశాలపై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఎందరు వృద్దులు ఆశ్రయం పొందుతున్నారో ఆరా తీసారు. 37 మంది ఉన్నారని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి జిల్లా సంక్షమ అధికారి తీసుకువెళ్లారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వృద్దుల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వైద్య శాఖ వద్ద ఉన్న పాలియేటీవ్ కేర్ వాహన సేవలు వృద్దుల కోసం వినియోగించాలని సూచించారు. వృద్దులను విహార యాత్రలకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. వేములవాడలో నిర్వహించనున్న త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలకు తీసుకువెళ్లాలని జిల్లా సంక్షమ అధికారి లక్ష్మరాజంకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షమ అధికారి లక్ష్మరాజం తదితరులు పాల్గొన్నారు.



## అడవి తల్లి మెడలో హారం.. నయా మేడారం

- ఆకర్షిస్తున్న ఆదివాసి గిరిజన సంప్రదాయ బొమ్మలు
- జాతరతో పాటు ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు
- సెల్ఫీలు దిగుతూ ఆనందం పంచుకుంటున్న భక్తులు





**వరంగల్ బ్యూరో, జనవరి 07 (జనంసాక్షి) :** పచ్చని అడవిలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి మరింత ఆకర్షణీయంగా అందంగా కనిపిస్తుంది. ఈనెల 28 నుంచి 31 వరకు జాతర జరుగుతుంది. ఇందుకు ప్రభుత్వం సుమారు 200 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా జాతర ప్రాంగణం తో పాటు జాతర చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఆదివాసి గిరిజన ప్రాంతవాసులే కాకుండా దేశ నలుమూలల నుండి వచ్చే ప్రజలకు భక్తులకు ఈసారి జాతర మరింత ఆకర్షణీయంగా ఉండే విధంగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ ( సీతక్క), కొండా సురేఖతోపాటు లక్ష్మణ్, ఎంపీ బలరాం నాయక్ మొదలైన వారు మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా కనివిని ఎరుగని విధంగా నిర్వహించేందుకు కావలసిన అన్ని రకాల అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సమ్మక్క సారలమ్మ గద్దెలప్రాంతంలో రాతి కట్టడాలతో పాటు వాటిపై గిరిజన సాంప్రదాయానికి సంబంధించిన చిత్రాలను వేయడం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అదేవిధంగా జాతర ప్రాంతం తో పాటు జాతరకు వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రధాన రహదారులు, జాతర ప్రవేశ ద్వారాల వద్ద గిరిజన ఆదివాసి సాంప్రదాయానికి సంబంధించిన బొమ్మలను వివిధ సర్కిల్స్ వద్ద ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. జాతర నెల రోజులు ముందు నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అదేవిధంగా ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తున్నటువంటి అందమైన బొమ్మలు శిల్పాల వద్ద సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. ఎన్నడు కనివిని ఎరుగని విధంగా సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు బాగున్నాయని పొగుడుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మిగిలిన పనులు జాతరకు ముందే పూర్తి చేసి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు. సమ్మక్క సారలమ్మ దేవతల దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వేడుకుంటున్నారు.







నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్

బోడుప్పల్, జనవరి 07 (జనంసాక్షి) :

## బీసీలకు చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్

# తక్షణమే అమలు చేయాలి



కరీంనగర్ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలకు ఫిర్యాదులిచ్చిన టీఆర్పీ నాయకత్వం



కరీంనగర్ (జనంసాక్షి) : తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయంలో అధికారులను కలిసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన "బీసీ సబ్ ప్లానును తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేస్తూ జిల్లా నాయకులతో కలిసి కరీంనగర్ జిల్లా కలెక్టర్, ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న మండలాల్లో మండల నాయకత్వం కూడా మండల అధికారులకు ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటివరకు బీసీల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా మిగులు బడ్జెట్ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వం బీసీల నోటి కాడ బుక్కను ఎత్తుకొని పోయినట్టు ప్రభుత్వాలు బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం రేవంత్ సర్కార్‌కి సిగ్గుచేటు అని అన్నారు. ఇప్పటికైనా బీసీలకు సబ్‌ప్లాన్ చేసే దిశగా ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు పని చేయాలని, లేదంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని, ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షులు విజయ లక్ష్మి, ఉపాధ్యక్షులు సత్రం సరితా, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, జిల్లా యూత్ అధ్యక్షుడు గూడెల్లి రాకేష్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్, టౌన్, మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, మహిళా విభాగం, యూత్ విభాగం, మైనారిటీ విభాగాలు పూర్తి నాయకత్వం తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

**1.35 లక్షల మంది విద్యార్థులు హాజరు**

**ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్స్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై బుధవారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు రెండు సెషన్లలో, మూడు స్పెల్స్‌గా జరుగుతాయన్నారు. థియరీ, ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్, ప్రాక్టికల్ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగంలో 64,780 మంది, వొకేషనల్ కోర్సుల్లో 1,368 మంది కలిపి మొత్తం 66,148 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 67,792 మంది, వొకేషనల్ కోర్సుల్లో 1,258 మంది మొత్తం 69,050 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. ఈ విధంగా జిల్లాలో మొత్తం 1,35,198 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నట్లు స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా మొత్తం 151 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. అలాగే అవసరమైన పోలీస్ బందోబస్తు కల్పించాలని పోలీస్ శాఖను, జవాబు పత్రాలను భద్రంగా తరలించేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం. కిషన్, కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో వరుసపెట్టి ముగ్గురు అధికారులు

**ఎంపీడీవో కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకొని లక్షలు డిమాండ్**

**ముందే లక్షయాభై అడ్వాన్సుగా తీసుకున్న వైనం**



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : ఎంపీడీవో కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకొని ఓ భవన నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. ఆ తర్వాత రెండున్నరా లక్షలకు డీల్ కుదుర్చుకోగా ముందే లక్ష యాభై వేల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకొని మిగతా బ్యాలెన్స్ లక్ష రూపాయలు బుధవారం నాడు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో ఓ భవన నిర్మాణానికి అనుమతి కోసం ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోవడంతో





గ్రామపంచాయతీ కార్యదర్శి చెన్నయ్య ,ఎంపీఓ తేజ్ సింగ్, ఎంపీడీవో సుమతి, ముగ్గురి సమక్షంలో మొట్టమొదట ఐదు లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు రెండున్నర లక్షలకు డీల్ కుదుర్చుకోగా ముందే లక్ష యాభై వేల రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు మిగతా లక్ష రూపాయలు బుధవారం నాడు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు సాక్షాత్తు నందిగామ ఎంపీడీవో కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కిస్మత్‌పూర్ ప్రజల భద్రతకు

# నీరుడు శేఖర్ చొరవ

**సొంత ఖర్చుతో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు**


రాజేంద్రనగర్,జనవరి7(జనంసాక్షి) : కిస్మత్‌పూర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లప్పుడూ కృషి చేస్తానని మాజీ ఉపసర్పంచ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ అన్నారు. కిస్మత్‌పూర్ డివిజన్‌లోని ఎర్రకుంట లంబాడీ తండా, 60 గజాల రోడ్డు, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, వివేకానంద విగ్రహం రోడ్డు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించి బుధవారం తన సొంత ఖర్చుతో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్నప్పుడు పలు అభివృద్ధి పనులు పూర్తి చేశానని, ప్రస్తుతం పదవిలో లేకపోయినా ప్రజలు నమ్మకంతో సమస్యలు తన దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. అటువంటి ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని, భవిష్యత్తులో కూడా అదే విధంగా సేవలు కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నీరుడు శేఖర్ ముదిరాజ్‌ను కిస్మత్‌పూర్ ప్రజలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



## ఆరాధ్య, ఆదర్శ్‌లకు బాపు చిత్రకళా పురస్కారం

హైదరాబాద్ జనవరి 8 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక రంగానికి చిరస్మరణీయుడు ప్రముఖ రచయిత, కథనాయకుడు, చిత్రబ్రహ్మ బాపు 92వ జయంతి వేడుకలు బొగ్గులకుంట సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. బాపు జయంతి సందర్భంగా కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సొసైటీ వారు నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన దీకొండ ఆరాధ్య, దీకొండ ఆదర్శ్‌లకు ఫిల్మ్ డైరెక్టర్ వంశీ, నటుడు శివాజీ రాజా చేతుల మీదుగా 'బాపు చిత్రకళా పురస్కారం అందజేశారు. ప్రస్తుతం వీరు నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో ఎడవ తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు దీకొండ రమేష్, అన్న పూర్ణ ఆనందం వ్యక్తం చేశారు. సంఘ ఫౌండర్, సెక్రటరీ సురేందర్ అధ్యక్షురాలు పుష్పలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మధుసూదన్, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని బాబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపు తెలుగు సాహిత్య, నాటక, రచనా రంగాల్లో చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటులు దాస్యప్రియ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య పరీక్షలకు విశేష స్పందన



మల్కాజిగిరి జనవరి 7(జనంసాక్షి) : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా వినాయక నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంతోష్ మాత చౌరస్తాలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.కంటి, కిడ్నీ, గుండె పరీక్షలు మొత్తం బాడీ చెకప్ చేసి ఉచితముగా కంటి అద్దాలు 250 మందికి పైగా ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,డివిజన్ మహిళలు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పెరిక సంఘం జిల్లా కో ఆర్డినేటర్ల నియామకం

**జనవరి నెలాఖరుకు సంఘం నిర్మాణం పూర్తి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి ముత్తయ్య ఆదేశాలు**



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణలో పెరిక సంఘాన్ని పటిష్ట పరచడం కోసం గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వివిధ కమిటీలను నిర్మాణం పూర్తి చేయాలని తెలంగాణ పెరిక (పురగిరి క్షత్రియ) సంఘం రాష్ట్ర కమిటి నిర్ణయించినట్లు రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి ముత్తయ్య తెలిపారు. సంఘం విస్తరణలో బాగంగా రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి ముత్తయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లక్కర్సు ప్రభాకర్ వర్మ, ముఖ్య సలహాదారు చింతం లక్ష్మనారాయణ పర్యవేక్షణలో 10 మంది రాష్ట్ర నాయకులను జిల్లా కో ఆర్డినేటర్లుగా నియమించించినట్లు ఎర్రంశెట్టి ముత్తయ్య ప్రకటించారు. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల కోఆర్డినేటర్లుగా ధనికుల కృష్ణ, కోట మల్లికార్జున్, కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ గా ఆక రాధాకృష్ణ, ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్‌గా కర్రే సురేందర్, మెదక్ జిల్లా కోఆర్డినేటర్ గా నట్టే మోహన్ రావు, నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ గా సంగాని హరికిషన్, మహబూబ్ నగర్ జిల్లా కోఆర్డినేటర్ గా బోడకుంటి సుధాకర్, నల్గొండ జిల్లా కోఆర్డినేటర్‌గా బొలిశెట్టి రంగారావు, ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్‌గా అంకతి వెంకటరమణ, వరంగల్ కోఆర్డినేటర్‌గా అంకతి ఉమామహేశ్వరరావు ను నియమించినట్లు తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ గా నియమితులైన రాష్ట్ర నాయకులు వెంటనే వారి వారి జిల్లాల్లో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల నిర్మాణం జనవరి 31 వరకు పూర్తిచేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి ముత్తయ్య జిల్లా కోఆర్డినేటర్లను ఆదేశించారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సంఘం నిర్మాణం చేయడంతో పాటు విద్యార్థి విభాగం, మహిళా విభాగం, యువజన విభాగం, రాజకీయ విభాగం విద్యాభివృద్ధి విభాగలను కూడా త్వరితగతిన నిర్మితం చేసి పెరిక కులస్తులను అన్ని రంగాలలో చైతన్యం చేసి, స్వసంఘీయుల అభివృద్ధిలో పాటుపడతామని ముత్తయ్య తెలిపారు.


## ఉర్దూ యూనివర్సిటీ భూమిని లాక్కోవడం విద్యా ద్రోహమే

**విద్యాసంస్థల భూములను రియల్ ఎస్టేట్ మాఫియాకు అప్పగించొద్దు**

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**



హైదరాబాద్ (జనంసాక్షి) : మణికొండలోని సర్వేనంబర్ 211, 202లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం 1998లో కేటాయించిన 200 ఎకరాల భూమిలో, నిరుపయోగంగా ఉన్నదనే సాకుతో 50 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేయడం దుర్మార్గం. తక్షణమే ఈ నోటీసును ఉపసంహరించుకుని, తరగతి గదులు, హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, లైబ్రరీ, పరిశోధన కేంద్రాలు, క్రీడా స్థలాల నిర్మాణానికి నిధులు కేటాయించి యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. ఒకవైపు కార్పొరేట్ సంస్థలకు, బహుళజాతి కంపెనీలకు వేల కోట్ల విలువైన భూములను ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల కోసం కేటాయించిన భూములపై కూడా కన్నేయడం దుర్మార్గం. ఇది అల్పసంఖ్యాక వర్గాల విద్యపై దాడి చేసి, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీయడమే. ఐటీ కారిడార్‌లో విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు, రియల్ ఎస్టేట్ మాఫియాకు ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వం, ఎకరాకు వందలకోట్లు పలుకుతున్న ఈ భూములను కూడా విద్యేతర ప్రయోజనాల కోసం, రియల్ ఎస్టేట్ వెంచర్ల కోసం మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఇది దేశంలోనే ఏకైక ఉర్దూ విశ్వవిద్యాలయంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడమేనని స్పష్టమవుతున్నది. యుజీసీ నిబంధనల ప్రకారం భవిష్యత్తులో విద్యార్థుల అవసరాల కోసం భూమిని నిల్వ ఉంచడం తప్పనిసరి. కానీ వినియోగం లేదనే సాకుతో భూమిని లాక్కోవడం సరైందికాదు. యూనివర్సిటీకి కేటాయించిన 200 ఎకరాలను ఎలా వినియోగించాలో గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు, ప్రణాళికలు అందించినప్పటికీ, ఈ షోకాజ్ నోటీసును జారీ చేయడం దుర్మార్గం. ఈ భూమిని పూర్తిస్థాయిలో వర్సిటీకే పరిమితం చేస్తూ గెజిట్ విడుదల చేయాలి.



# అతిచేస్తే అంటించారు.. చెంపఛెళ్లనిపించారు..!

## కేటీఆర్ టూర్‌లో పగిలిన చెంపలు

- ఓవర్ యాక్షన్‌కు కేరాఫ్ ఆ పీఏ
- ఫాలోవర్స్‌ను అడ్డుకోవడమే అతని లక్ష్యం
- రెండవసారి అంటించిన కార్యకర్తలు

ఖమ్మం టౌన్, జనవరి 07 (జనంసాక్షి) : ఖమ్మంలో అతనికతనే యంపీ అనుకుంటాడు. అతనే సర్వం అనుకుంటాడు. అతని నోటికి అడ్డు అదుపు ఉండదు. నోటికి ఎంతొస్తే అంత మాట అనేస్తాడు. ఇప్పటి సదరు రాజ్యసభ సభ్యుడి వద్దకు వచ్చే అభిమానులు ఆ పీఏని చూసి రావడం తగ్గించారు. పీఏ అతి ఎక్కువైందనే ఫిర్యాదు ఎన్నోసార్లు రాజ్యసభ సభ్యుడి వద్దకు చేరింది. అయినా సదరు ఎంపీ పట్టించుకోలేదు. అది కాస్తా కేటీఆర్ టూర్‌లో కార్యకర్తల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏదైతే అదైందని చెడామడా వాయించేసారు. చివరికి కాళ్ల బేరానికి వచ్చేలా చితక్కొట్టారు.

కేటీఆర్ ప్రసంగం, సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమం ముగిసిన తర్వాత రాజ్యసభ సభ్యుడి ఇంట్లో మధ్యాహ్న భోజనానికి ఉపక్రమించారు. అప్పటికే అక్కడ ఉన్న త్రీ టౌన్ కార్పోరేటర్ తనయుడి ఫాలోవర్స్ భోజనం చేస్తుండగా పీఏగారు నోరు పారేసుకోవడం మొదలు పెట్టారు. తమపై కాదులే అని మౌనంగా ఉండగా తినే వాళ్లని పిలిచి మరీ వేలెత్తి బూతు పురాణం అందుకున్నాడు. దాంతో అప్పటికే ఆగ్రహంగా ఉన్న కార్యకర్తలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. దొరికిందే అవకాశం అని చెంపలు వాయించారు. దాంతో కళ్లజోడు కింద పడి పగిలినట్లు సమాచారం. గతంలో సదరు రాజ్యసభ సభ్యుడి జన్మదిన వేడుకలో బిర్యానీ కొద్దిగా వంచించి 250 మందికి వడ్డించానని చెప్పి అభిమానులను అవమాన పరిచాడు. తిన్న విస్తరాకులు సైతం లెక్కపెట్టి మరీ చెంపలు వాయించుకున్న చరిత్ర కలిగి ఉంది సదరు పీఏ గారికి. ఇప్పుడు ఇది రెండవ సంఘటన కావడంతో పీఏగారు బుద్ధి మార్చుకుంటారో లేక ఎంపీగారు పీఏనే మార్చేస్తారో చూడాలి. పీఏగారు ఎంపీని సర్వం నాకేసి కలాం నగర్ ఐదులో బ్రహ్మాండమైన కోట నిర్మిస్తున్నట్లు సమాచారం. జీతం రాకపోతే జిబజిబలాడే పీఏ ఇప్పుడు కోట్లకు ఎలా పడగెత్తాడో ఆయనే సమాధానం చెప్పాలి.

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు ఉండకూడదు

**చెల్లింపుల్లో జాప్యం సహించం : సివిల్ సప్లైస్ కమిషనర్**





మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి (జనం సాక్ష), జనవరి 7 : రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సివిల్ సప్లైస్ కమిషనర్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ సప్లైస్ కమిషనర్ అన్ని జిల్లాల పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, జిల్లాల స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు చెల్లింపుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టంగా ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సదుపాయాలు మెరుగ్గా ఉండేలా చూడాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా సజావుగా సాగాలని తెలిపారు. అలాగే రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా జిల్లా స్థాయిలో నిరంతర సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి అంశాన్ని క్షణ్ణంగా పర్యవేక్షిస్తూ, ఎక్కడా నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ మేడ్చల్‌ఉమల్కాజిగిరి జిల్లా తరఫున అదనపు జిల్లా కలెక్టర్ శ్రీ విజయేందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎల్. సుగుణబాయి, జిల్లా సరఫరాల అధికారి (డీఎస్ఓ) శ్రీనివాస్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అన్నాడిఎంకె కూటమిలోకి పిఎంకె

- తమిళనాట మారుతున్న సమీకరణాలు



చెన్నై, జనవరి7 (జనంసాక్షి) : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే, బీజేపీ కూటమి తో పట్టలి మక్కల్ కట్టి పిఎంకె చేతులు కలిపింది. పీఎంకే అధ్యక్షుడు అంబుమణి రామదాస్ తమిళనాడు మాజీ సీఎం, అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామిని కలుసుకుని ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్టు ప్రకటించారు. అంబుమణి రామదాస్‌తో కలిసి పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ పీఎంకే చేరికతో తమ కూటమి మరింత బలపడిందని, మరి కొన్ని పార్టీలు కూడా తమతో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయన చెప్పారు. తమది 'విక్టరీ అలయెన్స్' అని ప్రకటించారు. అన్నాడీఎంకే నాయకత్వంలో ఎన్డీయేలో చేరేందుకు పీఎంకే చేతులు కలిపినట్టు అంబుమణి రామదాస్ తెలిపారు. మహిళల భద్రత, రైతులు, నిరుద్యోగం వంటి అంశాల్లో అధికార డీఎంకేపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, డీఎంకేను గద్దె దించడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని చెప్పారు. భారీ మెజారిటీతో గెలిచి అన్నాడీఎంకే నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఈ ఏడాది ప్రథమార్థంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# ఫిబ్రవరి 1న బడ్జెట్‌పై సందిగ్ధం

- ఆదివారం కావడంతో కొంత చర్చ
- త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి7 (జనంసాక్షి) : పార్లమెంట్ బడ్జె సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే బడ్జెట్ ప్రతిపాదనలను ఫిబ్రవరి1న ప్రవేశ పెడతారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో అదే రోజు ప్రవేశపెడతారా? అనే చర్చ జరుగుతోంది. అలా కానట్లయితే 2న ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంటుంది. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమి కాదు. తొలిసారిగా 2016లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లోనూబడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టారు. 2020లో కరోనా సమయంలోనూ, అంతకు ముందు 2012 మే 13న ఆదివారం పార్లమెంట్ సమావేశం జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరిరోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించు కునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తరువాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించే వారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. ఈక ÷-రమంలో ఈ యేడాది కూడా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అభ్యంతరం ఉండకపోవచ్చు. ఇకపోతే ఇప్పటికే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడస్జెట్ కసరత్తు మొదలు పెట్టారు. వివిధ శాఖలనుంచి నివేదికలు తెప్పించుకున్నారు.



## సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) : సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండలస్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

# ప్రభుత్వ కార్యాలయాలు నాణ్యతతో నిర్మించాలి

- అర్థ శతాబ్దానికి పైగా సేవలు అందించాలి
- కృష్ణ,గోదావరి జలాలలో తెలంగాణ నీటి హక్కులు సాధిస్తాం
- డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్, ఇరిగేషన్ కార్యాలయాల పనుల పరిశీలన
- రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి





హుజూర్ నగర్, (జనంసాక్షి) : అర్థ శతాబ్దానికి పైగా సేవలు అందించేలా ప్రభుత్వ కార్యాలయాలు నాణ్యతతో నిర్మించాలని ఎలివేషన్ అద్భుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ వద్ద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కృష్ణ, గోదావరి జలాలలో తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులు సుప్రీం కోర్ట్, కేంద్ర జల సంఘం, కేంద్ర ప్రభుత్వం వద్ద బలమైన వాదనలు వినిపించి సాధిస్తామన్నారు. అనంతరం హుజూర్ నగర్ పట్టణంలో రూ. 4.5 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రూ. 7.5 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణాలను, రూ. 8 కోట్లతో నిర్మిస్తున్న రూ. 8 కోట్లతో నిర్మిస్తున్న ఆర్బి గెస్ట్ హౌస్ కమ్ షాపింగ్ కాంప్లెక్స్, రూ. 7 కోట్లతో చేపట్టిన నీటిపారుదల శాఖ కార్యాలయ పనులను పరిశీలించారు.

### షాదీ ముబారక్, కళ్యాణ్ లక్ష్మ చెక్కులు అందజేత

పట్టణంలోని హుజూర్ నగర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద హుజూర్ నగర్ నియోజకవర్గంలోని హుజూర్ నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల్లో 1.71 కోట్ల రూపాయలు విలువ చేసే షాదీ ముబారక్, కళ్యాణ్ లక్ష్మ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన నిర్మిస్తున్న 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇల్లులు కొరకు ఈ నెల 8 (గురువారం) నుండి పది రోజులు పాటు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అధికారులు క్షత్రస్థాయి పరిశీలన చేసి అర్హులను గుర్తించి ఫిబ్రవరి నెలలో వారికి ప్లాట్స్ కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ 15 ఏళ్ల శ్రమకు ఫలితం త్వరలో దక్కబోతుందని తెలిపారు. అద్దె ఇంట్లో ఉంటున్న, స్థలం ఉన్నా లేకపోయినా, ఇల్లు లేని అర్హులందరికీ సింగిల్ బెడ్ రూమ్ ఇల్లులు ఎవరికీ ఒక్క పైసా ఇవ్వకుండా ఉచితంగా కేటాయిస్తామని తెలిపారు. హుజూర్ నగర్ పట్టణంలో 28 కోట్ల రూపాయలతో రింగ్ రోడ్డు నిర్మించానని, కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయని జూన్ నాటికి పూర్తయి అందుబాటులోకి వస్తాయని, ప్రభుత్వ హాస్పిటల్ లో నూతన ఓపి బిల్డింగ్, సిటీ స్కాన్, డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంకులను నిర్మించానని, జాబ్ మేళా ద్వారా హైదరాబాద్ నుండి 270 కంపెనీలు హుజూర్ నగర్ పట్టణానికి తీసుకువచ్చి యువతకు 4500 ఉద్యోగాలు వచ్చేలా చేశానని, 40 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, 6 కోట్లతో ఐ టి ఐ కళాశాల నిర్మాణం ఇలా హుజూర్ నగర్ నియోజకవర్గంలో విద్యా, వైద్యం, రోడ్లు, విద్యుత్, ఇండ్లు కనివిని రీతిలో నిర్మించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్ కుమార్, ఆర్ అండ్ బి ఈ ఈ సీతారామయ్య, ఇరిగేషన్ ఈ ఈ నాగభూషణం, టి జి ఈ డబ్ల్యు ఐ డి సి డిఈ రమేష్, తహసిల్దారులు, ఎంపీడీవోలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల పాటు

# మిషన్ భగీరథ సమ్మర్ స్పెషల్ డ్రైవ్

- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ చర్యలు
- ప్రతి రోజు ఎమ్మెల్యేల వాట్సాప్‌కు నియోజకవర్గాల్లో మంచి నీటి సరఫరా వివరాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన, నిరంతర తాగు నీటి సరఫరా అందించే దిశగా మిషన్ భగీరథ విభాగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇటీవల గ్రామీణ తాగునీటి విభాగం పై సమీక్ష నిర్వహించిన మంత్రి సీతక్క ముందస్తుగానే వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని 2026 ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల పాటు ప్రత్యేక సమ్మర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు మండల స్థాయి బృందాలతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను మిషన్ భగీరథ అధికారులు రూపొందించారు. జలాశయాల నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షంచడం, ప్రభుత్వం నిర్ణయించిన కనీస డ్రా డౌన్ లెవల్స్‌ను పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. బల్క్ నీటి సరఫరాకు ఆటంకాలు కలగకుండా పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. నీటి శుద్ధి కేంద్రాల్లో అవసరమైన గ్యాస్ క్లోరిన్, లిక్విడ్ క్లోరిన్, పాలీ అల్యూమినియం క్లోరైడ్ వంటి రసాయనాలను మూడు నెలలకు సరిపడా ముందుగానే సమకూర్చుకుంటున్నారు. ప్రతి రోజు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి సరఫరా కొనసాగిస్తున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల్లో ప్రతి రోజూ మంచి నీటి సరఫరా వివరాలను వాట్స్ యాప్ ద్వారా తెలియ పరుస్తూ ఎక్కడా ఏలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

గ్రిడ్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భంలో తాగునీటి సమస్య తలెత్తకుండా స్థానిక వనరులౌచేతి పంపులు, సింగిల్ ఫేజ్ మోటార్లు, బావులు పూర్తిస్థాయిలో వినియోగించేలా గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. అవసరమైన చోట మరమ్మతులు పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తెస్తున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు బల్క్ సరఫరాపై రోజువారీ పర్యవేక్షణ, ఉదయం 9.30 గంటలకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి సమస్యలు తలెత్తిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఎన్ సీ కృపాకర్ రెడ్డి తెలిపారు. తాగునీటికి సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ పనిచేస్తుండగా, 24ఇ7 టోల్ ఫ్రీ నెంబర్ 1916 ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామీణ ప్రజలకు వేసవిలోనూ ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని, మంత్రి సీతక్క సూచనల మేరకు మిషన్ భగీరథ విభాగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు.




## జైలులో మత్తు పదార్థాల సరఫరా

- నిజామాబాద్ జైలర్ ఉపేందర్ సస్పెన్షన్

నిజామాబాద్, జనవరి7 (జనంసాక్షి) : జిల్లా జైలులో గంజాయి దొరికిన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జైలులో డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతుందన్న ఆరోపణలపై జైళ్ల శాఖ డీఐజీ, ఐజీ పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా జైలర్ ఉపేందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరో జైలర్ సాయి సురేశ్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే సూపరింటెండెంట్ దశరథాన్ని నెల రోజులు సెలవులపై వెళ్లాలని ఆదేశించారు. ఇక వరంగల్ జైలర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్‌కు నిజామాబాద్ జైలర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్‌రావుకు ఇంచార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. జైలు అధికారులతో కలిసి పనిచేసినట్లు తేలిన ఖైదీలను ఇతర జైళ్లకు మార్చారు.

# దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయం

- సుప్రీమ్ కోర్టు రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- అంబేడ్క ఓపెన్ యూనివర్సిటీలో అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం బ్రిడ్జు ప్రారంభం



హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) : దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయమని సుప్రీమ్ కోర్టు రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డా. బి ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బి. ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ డైలాగ్ ఆన్ గవర్నెన్స్ అండ్ ఈక్విటీ (బ్రిడ్జ్) పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లోతైన ఆలోచనలు, భావజాలాన్నీ ఈ సంస్థ ప్రతిధ్వనిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్త పర్చారు. అంబేద్కర్ దార్శనికత సమానత్వం సమగ్రతను కలిగి ఉంటుందన్నారు.. విద్య, ఆర్థిక శాస్త్రం, పరిపాలన విధానంలో ప్రభావవంతమైన కృషి చేసారని వెల్లడించారు. ఆర్టికల్ 70 కుల వివక్షతను రద్దు చేయడం ఒక పెద్ద సంస్కరణ అని పేర్కొన్నారు. బిఆర్ అంబేద్కర్ అన్వేషించని రచనలపై విద్యా కార్యక్రమాలను సవరించాలని సూచించారు. డాక్టర్ అంబేద్కర్ బౌద్ధమత పరివర్తనలను విస్తృతంగా చర్చించడానికి ఈ కేంద్రం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. బిఆర్ అంబేద్కర్ ఇతర ఆలోచనల గురించి, ఆయన దూర దృష్టితో తీసుకున్న నిర్ణయాల గురించి విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, ఐ.ఏ.ఎస్., మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం అంబేద్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. అంబేద్కర్ త్యాగాలు కేవలం సైద్ధాంతికమే కాకుండా సామాజిక అన్యాయాలకు, ముఖ్యంగా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అన్ని కులాలు సమానమేననే భావన వచ్చేలా నిరంతరం పోరాటం చేశారన్నారు. అందరికీ సమానత్వం, సమ న్యాయం అనే దృక్పథంతో రూపొందించిన రాజ్యాంగాన్ని ఎవరైనా మోసం చేస్తే, అంబేద్కర్ పోరాడిన మౌళిక సూత్రాలకే ద్రోహులు అవుతారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ భావజాల స్ఫూర్తి, ఆదర్శాలను కాపాడటం, ప్రోత్సహించడం మనందరి లక్ష్యమని వెల్లడించారు. విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక న్యాయం, స్వేచ్ఛ, కులం, భాష, విద్య, సాధికారత వంటివి సమానత్వంలో అంతర్భాగమని పేర్కొన్నారు. అందరికీ సమాన అవకాశాలను అందించడం, సమ్మిళిత సమాజాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎస్సీ సబ్-ప్లాన్ కింద ఈ కేంద్రాన్ని, కార్యక్రమాన్ని కొనసాగించడానికి, విస్తరించడానికి రాబోయే ఐదు సంవత్సరాల పాటు ఏటా రూ. 10 కోట్లు నిధులు కేటాయించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. రానున్న రోజుల్లో ఈ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం అన్ని దేశాల పరిశోధకులకు మార్గదర్శిగా నిలువనుందని, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సామాజిక పరిశోధకులతో పలు కమిటీలను ఏర్పాటు చేసి బ్రిడ్జ్ సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

గౌరవ అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. మొలుగరమ్ కుమార్ మాట్లాడుతూ విద్య, సామాజిక అభివృద్ధి, సమానత్వం మధ్య అంతరాలను తగ్గించడం ప్రాముఖ్యతను, ముఖ్యంగా విస్తృత సమగ్ర దృక్పథలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చేపట్టే వివిధ విద్యా పరిశోధన కార్యక్రమాలు, ఫెలోషిప్లు, కార్యకలాపాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సంపూర్ణ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. ప్రతి విద్యార్థికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని, దృఢ సంకల్పానికి శక్తివంతమైన ఉదాహరణ అని అడిషనల్ డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ జి. సుధీర్ బాబు, ఐ.పీ.ఎస్. పేర్కొన్నారు. విద్యార్థులు ఎన్ని అడ్డంకులు ఎదుర్కొన్నా, విజయం కోసం తమ ప్రయత్నాలను ఎప్పుడూ వదులు కోవద్దని సూచించారు. అనంతరం, న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ ఇనిషియేటివ్స్ కన్వీనర్, చరిత్ర విభాగ అధ్యాపకురాలు ప్రొ. అనుపమ రావు ముఖ్య వక్తగా జూమ్ లో హాజరై "ఏ డైలాగ్ ఆన్ అంబేద్కర్ ఇన్ హిస్ టైం అండ్ అవర్స్ అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. ప్రొఫెసర్ అనుపమ రావు మాట్లాడుతూ బ్రిడ్జ్ (దీ=ఱఱఱ+జు) కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు, జ్ఞాన భాగస్వామ్య వేదిక అని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఇది సామాజిక న్యాయం, సమానత్వ సూత్రాలను ముందుకు తీసుకెళ్లడానికి పని చేయాలని సూచించారు. అంబేద్కర్ దార్శనికత ముందుకు సాగడానికి, కుల ఆధారిత వివక్షను నిర్మూలించే భవిష్యత్తు అని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అంబేద్కర్ రచనలు స్ఫూర్తి అని వెల్లడించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్ ఈ చర్చా కార్యక్రమానికి ప్రధాన వక్తగా వ్యవహరించారు. ఉన్నత విద్య మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, ఓ యూ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్, మల్లెపల్లి లక్ష్మయ్య, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మల్లేష్ సంకశాల, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ బాంగ్యా బుక్యా, ప్రొఫెసర్ వి. కృష్ణ, అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ గనుముల జ్ఞానేశ్వర్ ఈ సంభాషణలో పాల్గొని అంబేద్కర్ దార్శనికతను వివరించారు. సమాజంలో పేరుకుపో యిన అంటారానితనం వ్యవస్థను రూపుమా పడానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్.విజయ కృష్ణా రెడ్డి, ప్రొ. రవీంద్రనాథ్ సోలమన్, అన్ని విభాగాల డైరెక్టర్స్, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370